www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

CASAGRAND EVON
KOMPALLY

శనివారం | 12-4-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 357 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: పౌర్ణమి తె.5.52 తదుపరి పాడ్యమి; నక్షత్రం: హస్త సా.6.08 తదుపరి చిత్ర; వర్జ్యం: తె.3.09-4.57; దుర్ముహూర్తం: ఉ.6.05-7.43; అమృతఘడియలు: ఉ.11.23-1.11; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.27 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





విద్యుత్ సంస్కరణలకు సిద్ధం

ఆర్డీఎస్ఎస్, ఇతర పథకాల్లో చేరేందుకు
పంపిణీ సంస్కరణల కమిటీ ఏర్పాటు
ప్రభుత్వ ఉత్తర్వులు జారీ **11**

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మిస్ వరల్డ్ పోటీల ప్రతినిధులకు

'కాకతీయ టూర్'

ఏర్పాట్లపై పర్యాటక శాఖ కార్యదర్శి
స్మిత సభర్వాల్ సమీక్ష **13**

శనివారం | 12-4-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 357 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, శుక్ల పక్షం; తిథి: పౌర్ణమి తె.5.52 తదుపరి పాడ్యమి; నక్షత్రం: హస్త సా.6.08 తదుపరి చిత్ర; వర్జ్యం: తె.3.09-4.57; దుర్ముహూర్తం: ఉ.6.05-7.43; అమృతఘడియలు: ఉ.11.23-1.11; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.27 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కూనవరంలో గిరిజనుల ఇంట్లో సన్నబియ్యం భోజనం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

14న భూభారతి

పోర్టల్ ప్రారంభం

శిల్పారామంలో ఆవిష్కరించనున్న సీఎం రేవంత్

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

మణుగూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'భూ భారతి' చట్టం అంబేడ్కర్ జయంతి(ఏప్రిల్ 14) రోజున అమల్లోకి రానుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ చట్టానికి సంబంధించిన వెబ్ పోర్టల్‌ను ఏప్రిల్ 14న శిల్పారామంలో సాయంత్రం 5గంటలకు సీఎం రేవంత్ ప్రారంభిస్తారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో

మిగతా 13వ పేజీలో...

పంట నష్టపోయిన రైతులకు

ఎకరానికి రూ. 10 వేలు

పరిహారం ఇచ్చేందుకు సర్కారు నిర్ణయం

20 వేల ఎకరాలకు పంపిణీ చేసే అవకాశం **13**

ఫోర్త్ సిటీ మెట్రో అనుమతులు..

పరుగెత్తించండి

డీపీఆర్ సిద్ధం చేయండి

రెండో దశ అనుమతుల కోసం
కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు
మూసీ పనుల్లో వేగం పెంచండి
మీర్ ఆలం వంతెన అద్భుతంగా ఉండాలి
వందేళ్ల అవసరాలకు తగినట్లుగా డ్రైపోర్టు
ఆర్ఆర్ఆర్ పనులు ముమ్మరం చేయాలి
అధికారులతో సమీక్షల్లో సీఎం రేవంత్‌రెడ్డి



జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ అంబర్‌పేటలో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మహేశ్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, వీహెచ్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఫోర్త్ (ఫ్యూచర్) సిటీ వరకు మెట్రో రైలును విస్తరించాలని, అందుకు అవసరమైన తుది ప్రతిపాదనలను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 40 కి.మీ మేర మెట్రో ప్రాజెక్టును విస్తరించాల్సి ఉందన్నారు. సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్తు నగర విస్తరణ అవసరాల దృష్ట్యా మెట్రోను మీర్‌ఖాన్‌పేట్ వరకు పొడిగించాలని, అందుకు అవసరమయ్యే అంచనాలతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపాలని ఆదేశించారు. హెచ్ఎండీఏ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థలను మెట్రో విస్తరణలో భాగస్వాములు చేయాలని సూచించారు. మెట్రో రెండో దశ విస్తరణ పనులకు సంబంధించిన పురోగతిపైనా ఆరా తీశారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మెట్రో రైలు విస్తరణ పనులు, మూసీ పునరుజ్జీవం పనులు, జాతీయ రహదారుల నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) పురోగతిపై ముఖ్యమంత్రి ఆయా

మిగతా 13వ పేజీలో...

లేక్‌వ్యూ పార్కులో పూలే విగ్రహం.. స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్ **13**

కేంద్రానికి బీసీ బిల్లులు

న్యాయ సలహా తర్వాత పంపిన గవర్నర్
మార్చి 17న బిల్లులకు అసెంబ్లీ ఆమోదం
విద్య, ఉపాధి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% కల్పించేలా రూపకల్పన
50 శాతం దాటనున్న రిజర్వేషన్లు
కేంద్రం వెంటనే ఆమోదిస్తుందా, ఎలా స్పందిస్తుందన్న దానిపై ఆసక్తి **13**



జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



జస్టిస్ షమీమ్ అక్తర్

లోకాయుక్త, టీజీహెచ్ఆర్సీ చైర్మన్

నియామకం

లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి
మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌గా జస్టిస్ షమీమ్ అక్తర్.. సభ్యులుగా ప్రవీణ, కిశోర్
ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్‌కుమార్
నియమించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ **10**
ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి
సమాచార హక్కు కమిషన్ నియామకాలపై మరోసారి సీఎం అధ్యక్షతన సమావేశం



96,000 దాటిన పసిడి

ఒక్కరోజే రూ.6,250 పెరుగుదల **12**

రూ.96,450కి చేరిన 10 గ్రాముల ధర

సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి ఇది..

రూ.95,500కు చేరుకున్న కిలో వెండి

అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ప్రభావం

సంస్కృతానికే దండ..

తెలుగుకేదీ అండ?

కార్పొరేట్ విద్యార్థులకు స్కోరింగ్ సబ్జెక్టుగా సంస్కృతం

తెలుగు, ఇంగ్లిష్, హిందీ.. ఏ లిపిలో రాసినా 90కి పైనే

గత 30 ఏళ్లలో అందులో తప్పినవారు అతి తక్కువమంది

రాష్ట్రంలో 15 ప్రభుత్వ కళాశాలల్లోనే సంస్కృత బోధన

సర్కారీ కాలేజీల్లో విద్యార్థుల తగ్గుదలకు ఇదీ ఓ కారణం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వరకూ సంస్కృతం ఒక్క ముక్క కూడా రాదు! కానీ.. ఇంటర్‌లో రెండో భాషగా సంస్కృతాన్ని తీసుకునే విద్యార్థులకు 100కి 90కి పైగా మార్కులు వచ్చేస్తాయి. అదే.. పుట్టినప్పటి నుంచీ అమ్మ మాట వింటూ, అమ్మభాష అయిన తెలుగులో మాట్లాడుతూ పెరిగిన విద్యార్థులు తెలుగును ద్వితీయ భాషగా తీసుకుంటే మాత్రం పరీక్ష ఎంత అద్భుతంగా రాసినా బొటాబొటి మార్కులే వస్తాయి. సంస్కృతాన్ని ద్వితీయ భాషగా తీసుకున్న

మిగతా 14వ పేజీలో...



ఫస్ట్ ర్యాంక్ కోల్పోతానని తెలిసినా తెలుగునే

ఎంచుకున్నా

ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించా

సంస్కృతం ఎంచుకోలేదని పశ్చాత్తాపం లేదు

ఐపీఎస్ అధికారి మస్తిపురం రమేశ్ **14**

'సంస్కృతం'పై పునరాలోచన చేయాలి

విద్యార్థులను మాతృభాషకు దూరం చేయడం సరికాదు

రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య సూచన **14**

గర్భస్థ శిశువులూ

ఉక్కిరిబిక్కిరి!



వాయు కాలుష్యంతో అనేక సమస్యలు
శ్వాసకోశ అవయవ ఎదుగుదలపై ప్రభావం
నవజాత శిశువులపైనా కాలుష్య కాటు
హైదరాబాద్‌లో గత ఐదేళ్లలో ఆస్థమాతో పుడుతున్న పిల్లల సంఖ్య 20% పెరుగుదల
తక్కువ బరువుతో పుట్టేవారు 15% అధికం
కామినేని వైద్యురాలు కంచన్ పరిశోధన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వాయుకాలుష్యం.. ఇది పెద్దలపైనే కాదు.. గర్భస్థ శిశువులపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. పుట్టబోయే పిల్లలు కూడా కాలుష్యం ధాటికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాయు కాలుష్యం కారణంగా

మిగతా 3వ పేజీలో...



రూ. 10 వేల కోట్ల

ఆర్థిక మోసం!

కంచ గచ్చిబౌలి భూముల పేరిట రుణం **14**

దేశాన్ని, బ్యాంకులను మోసగించిన రేవంత్ సర్కార్

హక్కు పత్రాలు చూడకుండానే రుణమిచ్చిన 'ఐసీఐసీఐ'

బీజేపీ ఎంపీ సహకారంతో స్కాంకు తెరలేపిన సీఎం

ప్రధానికి, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

టీజీఐఐసీకి రుణం ఇవ్వలేదు.. వాళ్ల స్థలాలు తనఖా పెట్టలేదు.. కేటీఆర్ ఆరోపణలను ఖండించిన ఐసీఐసీఐ



ఆ 5200 కోట్లు..

బిల్లీ రావుతో కేటీఆర్ లంచం పద్దు!

ఐఎంజీ భారత్‌తో 30 శాతానికి ఒప్పందం
బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే.. 400 ఎకరాలను బిల్లీ రావుకు అప్పగించేవారు
బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భూముల అమ్మకాలపై చర్చకు కేటీఆర్ సిద్ధమా?: టీపీసీసీ చీఫ్ మహేశ్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): "కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి విలువ రూ.5,200 కోట్లు అని కేటీఆర్ చెబుతున్నారు. వాస్తవానికి అది బిల్లీ రావుతో కేటీఆర్ కుదుర్చుకున్న లంచం పద్దు" అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అన్నారు. ఆ భూములకు సంబంధించి 30 శాతం ముడుపులు చెల్లించేలా ఐఎంజీ భారత్‌తో కేటీఆర్ ఎన్నికల ముందు ఒప్పందం చేసుకున్నారని

మిగతా 14వ పేజీలో...



విద్యా హక్కు చట్టం ఈ ఏడాది నుంచైనా

అమలు చేస్తారా?

పేదలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 25% రిజర్వేషన్లు కల్పించడంపై హామీ ఇవ్వండి
ఇప్పటికే జారీ చేసిన మెమోను నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తారా చెప్పండి
చట్టం అమలు కోసం తీసుకున్న చర్యలేమిటో వివరించండి: హైకోర్టు
యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామన్న ప్రభుత్వం **10**

నకిలీ తీర్పు కాపీలతో

100 ఎకరాలు స్వాహా

శంషాబాద్ పైగా విలేజ్ కేసులో ట్విస్ట్ **3**

మోసం చేసిన వ్యక్తులపై హైకోర్టు ఆగ్రహం

నకిలీ తీర్పు కాపీలపై సిట్ దర్యాప్తునకు ఆదేశం

మరో 114

రాఫెల్ విమానాలు!

ఫ్రాన్స్ నుంచి కొనుగోలుకు కేంద్రం నిర్ణయం



18 ఆ దేశంలోనే తయారీ..

మిగిలిన 96 భారత్‌లో

స్థానిక కంపెనీలకు భాగస్వామ్యం

ఇప్పటికే వాయుసేన వద్ద 36 రాఫెల్ విమానాలు

నౌకాదళం కోసం మరో 26

కొత్త విమానాల్లో అమెరికా ఎఫ్-35లు ఉంటాయంటూ గతంలో ఊహాగానాలు

లండన్, ఏప్రిల్ 11: వైమానిక దళాన్ని బలోపేతం చేసేందుకు 114 రాఫెల్ 'బహుళ ప్రయోజనకర యుద్ధవిమానాలను' (ఎంఆర్ఎఫ్ఏ) ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. భారత్-ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య ఒప్పందం ద్వారా వీటిని సమకూర్చుకునే విధంగా కసరత్తు నడుస్తోంది. ఈ వివరాలను రక్షణశాఖకు చెందిన వర్గాలు వెల్లడించాయి. ఒప్పందంలో భాగంగా.. దాదాపు 18 విమానాలను ఫ్రాన్స్‌లోనే తయారుచేసి భారత్‌కు అందజేస్తారు. మిగిలిన 96 విమానాలను.. భారత్‌కు విడిభాగాలను తరలించి అక్కడే వాటిని అనుసంధానిస్తారు. దీనికోసం

మిగతా 2వ పేజీలో...



అమెరికాపై చైనా 125 శాతం

ప్రతీకారం

అగ్రరాజ్య సరుకుల దిగుమతులపై సుంకం మళ్లీ పెంపు
90 రోజుల నిలుపుదల జాబితాలో తమ దేశం లేనందునే!
అమెరికా మరోసారి పెంచితే పట్టించుకోబోమని ప్రకటన
ఈయూ కలిసిరావాలి.. కఠోర శ్రమతో మేం ఎదిగాం: జిన్‌పింగ్
అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటాం: జైశంకర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: అమెరికాతో సుంకాల యుద్ధంలో చైనా ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాన్ని 125 శాతానికి పెంచుతూ ప్రతీకారం తీర్చుకుంది. అమెరికా ప్రతీకార బాదుడు సుంకాలు మొదలుపెట్టినప్పటి నుంచి అటు అగ్రరాజ్యం, ఇటు డ్రాగన్ దేశం

మిగతా 2వ పేజీలో...

గూగుల్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపు

వందలాది మందికి ఉద్వాసన **2**

డెలాయిట్, యాక్సెంచర్, ఇతర సంస్థలతో 5.1 బిలియన్ డాలర్ల ఐటీ ఒప్పందాలు రద్దు: పెంటగాన్

రైల్వే తీరుతో ప్రయాణికుల పరేషాన్ **10**

రేపటి నుంచి పలు రైళ్ల మళ్లింపు
సికింద్రాబాద్ బదులు చర్లపల్లి టెర్మినల్
పొంతనలేని సమాచారంతో గందరగోళం



తమిళనాట అన్నాడీఎంకే-బీజేపీ

మళ్లీ పొత్తు **2**

పళనిస్వామి సారథ్యంలో పనిచేస్తాం: అమిత్ షా
ఆర్ఎస్ఎస్ నేత, ఆడిటర్ గురుమూర్తి సలహాతో పొత్తుపై హుటాహుటిన కేంద్ర మంత్రి ప్రకటన
పళని డిమాండ్‌తోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి అన్నామలై తొలగింపు
కొత్త సారథిగా నాగేంద్రన్ నియామకం
డీఎంకే దూకుడుతో కమలనాథుల నిర్ణయం

మరో 114 రాఫెల్ విమానాలు!

(మొదటిపేజీ తరువాయి)

ఫ్రాన్స్‌కు చెందిన విమానాల తయారీ కంపెనీ దసో ఏవియేషన్, రక్షణ రంగంలో అనుభవం ఉన్న భారతీయ కంపెనీతో కలిసి భారత్‌లో ఓ కేంద్రాన్ని నెలకొల్పుతుంది. విమాన విడిభాగాలు, ఇతర కీలకమైన యంత్ర సామగ్రి తయారీ ప్రక్రియలో స్థానిక కంపెనీలకు కూడా భాగస్వామ్యం కల్పించనున్నట్లు సమాచారం. కనీసం 100 విమానాలు కొనుగోలు చేస్తేనే భారత్‌లో తయారీకేంద్రాన్ని నెలకొల్పుతామని దసో ఏవియేషన్ షరతు విధించింది. ఇప్పటికే 36 రాఫెల్ యుద్ధవిమానాలను దసో నుంచి కొనుగోలు చేయగా.. నౌకాదళం కోసం రూ.68,236 కోట్ల వ్యయంతో 26 మెరైన్ రాఫెల్ ఫైటర్ జెట్‌ల కొనుగోలుకు ఇటీవల ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన భద్రతా వ్యవహారాల కేంద్ర క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. ఫ్రాన్స్ రక్షణమంత్రి త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటన సందర్భంగా కొనుగోలు ఒప్పందంపై సంతకాలు జరగనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వీటికి అదనంగా మరో 114 విమానాల కొనుగోలుకు తాజాగా కసరత్తు నడుస్తోంది. వీటి కోసం టెండర్ల దాఖలుకు ఆహ్వానం పలుకగా అమెరికా, యూరప్, రష్యా దేశాలకు చెందిన పలు కంపెనీలు పోటీపడ్డాయి. వీటిలో దసో రాఫెల్ ఎంపికైంది. కాగా, భారత్‌కు ఎఫ్35 విమానాలను విక్రయిస్తామని ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయితే అది సాధ్యమయ్యే పని కాదని పేర్కొంటూ 'ఆంధ్రజ్యోతి' అప్పట్లో ఒక విశ్లేషణాత్మక కథనాన్ని ప్రచురించింది. తాజా పరిణామాలు దీనినే రుజువు చేయడం విశేషం.

పాస్‌పోర్టు నిబంధన సరళతరం

» పెళ్లి సర్టిఫికెట్ లేకుంటే 'అనుబంధం జే' పూర్తి చేస్తే సరి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: పాస్‌పోర్టు దరఖాస్తులో జీవిత భాగస్వామి పేరు చేర్చుకోవాలన్నా, మార్చుకోవాలన్నా పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. ఈ నిబంధన వల్ల దేశంలోని వివిధ ప్రాంతాల్లోని పౌరులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ నిబంధనను సరళీకృతం చేస్తూ భారత విదేశీ మంత్రిత్వ శాఖ విధానపర నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇప్పటికే పాస్‌పోర్టు సేవ వెబ్ సైట్‌లో కూడా మార్పులను జోడించారు. దీని ప్రకారం 'అనుబంధం జే'ను పాస్‌పోర్టు దరఖాస్తుదారు పూరించాల్సి ఉంటుంది. దానిపై దంపతులు ఇద్దరూ తేదీ, స్థలం పేర్కొంటూ సంతకం చేయాలి. వివాహం అయిందని, కలిసి ఉంటున్నామని నిర్ధారించాలి. తాము నివసిస్తున్న చిరునామాను పేర్కొనాలి. కలిసి దిగిన ఫొటోను 'స్వీయ నిర్ధారణ' చేసి జత చేయాలి. ఇరువురి ఆధార్ లేదా ఓటర్ ఐడీ లేదా పాస్‌పోర్టు నంబరును పేర్కొనాలి. దీనివలన పెళ్లి సర్టిఫికెట్ లేకపోయినా జీవిత భాగస్వామి పేరును జత చేసుకొని సులభంగా పాస్‌పోర్టు పొందవచ్చు.

రైల్వేలో 9,970 అసిస్టెంట్ లోకో పైలెట్ పోస్టులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దేశవ్యాప్తంగా అన్నీ రైల్వే రీజియన్లలో 9,970 అసిస్టెంట్ లోకో పైలెట్ పోస్టుల భర్తీకి రైల్వే శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. టెన్త్‌తో పాటు ఐటీఐ చేసిన వారు, సంబంధిత రంగంలో డిప్లొమా, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ చేసిన వారు ఈ పోస్టులకు అర్హులు. 2025 జూలై 1వ తేదీ నాటికి 18-30 ఏళ్ల మధ్య వయసున్న అర్హులైన అభ్యర్థులు మే 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఉంది. మరోవైపు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్)లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 98 టెక్నీషియన్ పోస్టులతో పాటు గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్ పోస్టుల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. టెక్నీషియన్ పోస్టుల్లో డిప్లొమా టెక్నీషియన్(మెకానికల్) 20, డిప్లొమా టెక్నీషియన్(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్) 26, ఆపరేటర్(ఫిట్టర్) 34, ఆపరేటర్(ఎలక్ట్రిషియన్), ఆపరేటర్(మెషినిస్ట్)3, ఆపరేటర్(షీట్ మెటల్ వర్కర్)1 ఉద్యోగాలు ఉన్నాయి. పోస్టును బట్టి డిప్లొమా, ఐటీఐ పాసైన వారు అర్హులు. ఈనెల 18వ తేదీలోగా అప్లై చేసుకోవచ్చు.

భ్రూణ హత్యలపై హరియాణాలో టాస్క్‌ఫోర్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: హరియాణాలో భ్రూణహత్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో అక్రమ గర్భస్రావాలను అరికట్టేందుకు అక్కడి ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. అబార్షన్ కేంద్రాలు, ఐవీఎఫ్ సెంటర్లపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో అవకతవకలకు పాల్పడుతున్నట్టు గుర్తించిన 300 అబార్షన్ సెంటర్ల లైసెన్స్‌ను అధికారులు రద్దు చేశారు. నేషనల్ హెల్త్ మిషన్-హరియాణా డైరెక్టర్ డాక్టర్ వీరేందర్ యాదవ్ నేతృత్వంలో ఈ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీరేందర్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. 23 అబార్షన్ సెంటర్లకు నోటీసులు జారీచేశామని, ఆన్‌లైన్‌లో ఎంటీపీ కిట్లు అమ్ముతున్నవారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని చెప్పారు.

లాంగ్ రేంజ్ గ్లైడ్ బాంబ్ 'గౌరవ్' పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: భారత రక్షణ రంగ బలాన్ని మరింత పెంచేలా లాంగ్ రేంజ్ గ్లైడ్ బాంబ్ వాయుసేన (ఐఏఎఫ్)లో చేరేందుకు మార్గం సుగమమైంది. సుఖోయ్ యుద్ధ విమానం నుంచి లాంగ్ రేంజ్ గ్లైడ్ బాంబ్ 'గౌరవ్' విడుదల పరీక్షను రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) విజయవంతంగా పూర్తిచేసింది. 1000 కేజీల బరువుండే గౌరవ్ క్లాస్ గ్లైడ్ బాంబ్‌ను డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధి చేసింది. దీనికి ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించగా.. 100 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఈ బాంబు పిన్‌పాయింట్ కచ్చితత్వంతో ఛేదించిందని రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది.

భార్య చనిపోయిందన్న బాధతో ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్య

బెంగళూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య మృతి చెందడాన్ని జీర్ణించుకోలేక ఇద్దరు కూతుళ్లను చంపేసి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు ఓ వ్యక్తి. కర్ణాటక రాష్ట్రం దావణగెరె పట్టణంలోని ఎస్‌పీఎస్ నగర్‌లో గురువారం ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. మృతులను ఉదయ్‌కుమార్ (35), సింధుశ్రీ (6), శ్రీజయ(4)గా గుర్తించారు. ఉదయ్‌కుమార్ పదేళ్ల క్రితం హేమ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. 8నెలలక్రితం హేమ గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఉదయ్ కుమార్ మనోవేదనకు గురై పలుమార్లు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అయితే పిల్లలు అనాథలవుతారని ఆగిపోయాడు. ప్రతిరోజూ భార్య సమాధి వద్దకు వెళ్లి ఏడ్చేవాడని బంధువులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఇద్దరు పిల్లల గొంతు నులిమి హత్య చేసి, తన చేయి కోసుకున్నాడు. గోడపై ఐ లవ్ యూ హేమ అని రాసి, ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు.

125 శాతం ప్రతీకారం



(మొదటిపేజీ తరువాయి)

పోటాపోటీగా సుంకాల విధింపును పెంచుకుంటూ పోతుండడం తెలిసిందే. కాగా, తమ దేశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను 145 శాతానికి పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన చైనాకు ఆగ్రహం తెప్పించింది. దీనికితోడు 75 దేశాల్లో సుంకాల పెంపుదల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తూ.. చైనాలో మాత్రం అమలవుతుందని ట్రంప్ చెప్పడాన్ని మరింత తీవ్రంగా పరిగణించింది. అమెరికాపై అంతకుముందు 84 శాతానికి పెంచిన సుంకాన్ని శుక్రవారం ఏకంగా 125 శాతానికి పెంచేసింది. అయితే ఇకపై మరింత పెంచే ఆలోచన లేదని పేర్కొంది. అమెరికా మరిన్ని అదనపు సుంకాలు విధించినా తాము పట్టించుకోబోమని స్పష్టం చేసింది. ఇప్పటికే తమ దేశంపై అసాధారణమైన రీతిలో సుంకాలు పెంచడం ద్వారా అంతర్జాతీయ, ఆర్థిక వాణిజ్య నిబంధనలను, ప్రాథమిక ఆర్థిక చట్టాలను అమెరికా పూర్తిగా ఉల్లంఘించిందని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఇది తమపై బెదిరింపులకు దిగడమేనని ఆక్షేపించింది.

సుంకాల యుద్ధంలో విజేతలు ఉండరు..

సుంకాల యుద్ధంలో ఎవరూ విజేతలు ఉండరని, కానీ.. దీనివల్ల అంతర్జాతీయ సమాజం మొత్తం స్వీయ నిర్బంధంలోకి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. ఈ అంశంపై ఆయన తొలిసారి బహిరంగంగా స్పందించారు. అన్నారు. ఏడు దశాబ్దాలుగా చైనా కఠోర శ్రమతో ఎదిగిందని, ఎవరి దయాదాక్షిణ్యాలపైనా ఆధారపడలేదని తెలిపారు. పైగా తమను అకారణంగా అణచివేయాలని చూసినవారెవరికీ వెన్ను చూపలేదని స్పష్టం చేశారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్‌తో బీజింగ్‌లో జరిగిన సమావేశంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా.. అమెరికా ఏకపక్షవాదాన్ని, ఆర్థిక దౌర్జన్యాన్ని తిప్పికొట్టడంలో, అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చేందుకు యూరోపియన్ యూనియన్ తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. తద్వారా ఈయూ తమ హక్కులను, ప్రయోజనాలను కాపాడుకోవాలని అన్నారు. కాగా, స్పెయిన్‌కు, ఈయూకు చైనాతో వాణిజ్య లోటు ఉందని, దీనిని పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని శాంచెజ్ అభిప్రాయపడ్డారు. అయితే తమ బంధాన్ని బలోపేతం చేసుకునే క్రమంలో వాణిజ్యపరమైన ఆందోళనలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుందన్నారు. మరోవైపు తమపై అమెరికా పన్నాగాలు పనిచేయవని చైనా విదేశాంగ శాఖ పేర్కొంది. తమతో సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అమెరికా భావిస్తే ముందుగా బాధ్యతారహితమైన చర్యలను ఆపాలని హితవు పలికింది.

అమెరికా, ఈయూతో భారత్ ఒప్పందం: జైశంకర్

అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను కొలిక్కి తెచ్చే విషయాన్ని భారత్ అత్యంత ఆవశ్యక అంశంగా పరిగణిస్తోందని భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన గ్లోబల్ టెక్నాలజీ సమ్మిట్‌లో మాట్లాడుతూ.. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం గతంలో ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నాలుగేళ్లపాటు చర్చలు జరిపామని, అయినా ఒప్పందం కుదరలేదని అన్నారు. ప్రస్తుతం పూర్తి సంసిద్ధంగా ఉన్నామని, ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నామని చెప్పారు. ఇక యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని జైశంకర్ ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో 23 ఏళ్లుగా చర్చలు జరుగుతున్నాయంటున్నారని, కానీ.. అది నిజం కాదని అన్నారు. ఈయూతో ఒప్పందం విషయంలో కొన్ని అడ్డంకులున్నాయని, ఈసారి వాటిని అధిగమించాలనే కృతనిశ్చయంతో ఉన్నామని తెలిపారు.



గూగుల్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: టెక్ కంపెనీల్లో లేఆఫ్‌ల పర్వం కొనసాగుతోంది. తాజాగా ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ పెద్దఎత్తున ఉద్యోగులను తొలగించింది. తన ప్లాట్‌ఫాంలు, డివైజెస్ విభాగాల్లో పనిచేసే వందలాది మందికి ఉద్వాసన పలికింది. ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్ విభాగాలకు చెందిన సిబ్బందిపై వేటు పడిందని 'ది ఇన్ఫర్మేషన్' మీడియా సంస్థ వెల్లడించింది. ఈ ఏడాది జనవరిలో ఉద్యోగులకు ప్రకటించిన స్వచ్ఛంద విరమణ కార్యక్రమానికి అనుగుణంగా ఈ తొలగింపులు జరిగాయని పేర్కొంది. గతేడాది ఆండ్రాయిడ్, క్రోమ్ బృందాలను పిక్సెల్ అండ్ డివైజెస్ గ్రూప్‌లో విలీనం చేయడంతో ప్రారంభమైన కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. విలీనం సమయంలో ఉమ్మడి యూనిట్లలో 20వేల మందికి పైగా ఉద్యోగులు ఉండేవారు. ప్లాట్‌ఫాంలు, డివైజెస్ బృందం సామర్థ్యాలను, క్రియాశీలతను పెంపొందించడమే లక్ష్యంగా పునర్వ్యవస్థీకరణను చేపట్టినట్లు గూగుల్ అధికార ప్రతినిధి తెలిపారు. అయితే అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా నియామకాలు కొనసాగుతున్నాయని కంపెనీ పేర్కొంది. ఇదిలా ఉండగా, యాక్సెంచర్, డెలాయిట్ వంటి ప్రముఖ సంస్థలతో 5.1 బిలియన్ డాలర్ల విలువైన ఐటీ సేవల ఒప్పందాలను రద్దు చేస్తున్నట్లు పెంటగాన్ ప్రకటించింది. వృథా ఖర్చులు తగ్గించడంతో పాటు రక్షణ శాఖ సిబ్బంది అంతర్గత సామర్థ్యాలను మెరుగుపరచడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా రక్షణశాఖ కార్యదర్శి పీట్ హెగ్సేత్ గురువారం జారీ చేసిన మెమోలో పేర్కొన్నారు. పెంటగాన్ ఉద్యోగులు నిర్వహించగలిగిన సేవల కోసం థర్డ్ పార్టీ కన్సల్టెంట్లకు అనవసరంగా చెల్లింపులు చేయడాన్ని అరికట్టడానికే తాజా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ చర్య 5.1 బిలియన్ డాలర్ల వృథా ఖర్చును అరికట్టడంతో పాటు దాదాపు 4 బిలియన్ డాలర్లు ఆదా అవుతాయని హెగ్సేత్ తెలిపారు.

వాళ్లకు ఇలా కావాల్సిందే!

» ముంబై మారణహోమం అనంతరం ఉగ్రవాది హెడ్లీతో రాణా వ్యాఖ్య

» తనకు పాక్ యుద్ధవీరుల అవార్డు 'నిషాన్ ఈ హైదర్' ఇవ్వాలన్న ఉగ్రవాది




న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: 'వాళ్లకు ఇలా కావాల్సిందే..'.. 166 మంది మరణించి, 238 మంది గాయపడిన ముంబై మారణహోమం తర్వాత ఉగ్రవాది తహవ్వుర్ హుస్సేన్ రాణా చేసిన వ్యాఖ్య ఇది. అంతేకాదు.. ఈ దుష్కృత్యాన్ని విజయవంతంగా పూర్తిచేసినందుకు తనకు పాకిస్థాన్ అత్యున్నత యుద్ధవీరుల పురస్కారమైన 'నిషాన్ ఈ హైదర్' ఇచ్చి గౌరవించాలని కూడా ఈ కరుడుగట్టిన ఉగ్రవాది డిమాండ్ చేశాడు. తనతో కలసి నాటి దారుణానికి ఒడిగట్టిన ఉగ్రవాది డేవిడ్ హెడ్లీతో రాణా ఈ విషయాలు చెప్పినట్టు అమెరికా న్యాయశాఖ తెలిపింది. తహవ్వుర్ రాణాను భారత్‌కు అప్పగించిన సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. రాణా అప్పగింతతో ముంబై ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు న్యాయం చేసే రోజు వచ్చిందని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో అన్నారు. ఇదిలా ఉండగా, పటియాలా హౌస్ ఎన్ఐఏ కోర్టు రాణాకు 18 రోజుల ఎన్ఐఏ కస్టడీ విధించింది. ప్రతి 24 గంటలకోసారి రాణాకు వైద్య పరీక్షలు చేయించాలని, రోజు విడిచి రోజు అతడి తరఫు న్యాయవాదిని కలిసేందుకు అనుమతించాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు శుక్రవారం తెల్లవారుజామున రాణాను లోధీరోడ్‌లోని సీజీఓ కాంప్లెక్స్‌లో ఉన్న ఎన్ఐఏ ప్రధాన కార్యాలయానికి తరలించారు. రాణాను అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ప్రత్యేకమైన సెల్‌లో ఉంచినట్టు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. 14 అడుగుల పొడవు, 14 అడుగుల వెడల్పు ఉన్న ఈ గదిలో 24 గంటలూ సీసీ కెమెరా నిఘా ఉంటుందని, గార్డులు నిరంతరం కాపలాగా ఉంటారని వెల్లడించాయి. ఆ గదిలోనే ఓ మూలన బాత్రూం, నేలపై బెడ్ ఉంటుందని వివరించాయి.

రాణాను తీసుకొచ్చిన విమానం విలువ రూ.500 కోట్లు

అమెరికా నుంచి రాణాను భారత్‌కు తీసుకొచ్చేందుకు ఎన్ఐఏ అధికారులు గల్ఫ్‌స్ట్రీమ్ జీ550 విమానాన్ని వినియోగించారు. ఎక్కడా ఆగకుండా ఏకధాటిగా 12,500 కిలోమీటర్ల దూరం వెళ్లగలిగే సామర్థ్యం దీని సొంతం. దీనితోపాటు విశాలమైన క్యాబిన్, మంచి భద్రతకు కూడా ఈ జెట్ విమానాలు పేరుపొందాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా సంపన్నులు, ప్రభుత్వాధిపతులు ఈ విమానాలను వినియోగిస్తారు. ఇందులో 19 మంది ప్రయాణించవచ్చు. దీని విలువ రూ.500 కోట్లు. రాణాను తీసుకువచ్చేందుకు దీనికి సుమారు రూ.4 కోట్లు అద్దె చెల్లించినట్టు అంచనా.

అన్నాడీఎంకే-బీజేపీ మళ్లీ పొత్తు



కమలాలయంలో మీడియాతో మాట్లాడుతున్న అమిత్ షా, చిత్రంలో పళనిస్వామి, అన్నామలై

» పళనిస్వామి సారథ్యంలో పనిచేస్తాం

» స్వయంగా ప్రకటించిన అమిత్ షా

» ఆర్ఎస్ఎస్ నేత, ఆడిటర్ గురుమూర్తి సలహాతో కేంద్ర మంత్రి నిర్ణయం

» పళనిస్వామి కోరికతో బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలై తొలగింపు..నాగేంద్రన్‌కు పదవి!

చెన్నై, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిపై దృష్టి పెట్టిన బీజేపీ.. వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. కర్ణాటకలో అధికారం కోల్పోయిన దరిమిలా.. ఏపీలో టీడీపీ, జనసేనలతో కలిసి పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన కమలనాథులు ఇప్పుడు తమిళనాడుపైనా ఇదే వ్యూహంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. నిన్న మొన్నటి వరకు ఒంటరిగానే ఎన్నికలకు వెళ్లేందుకు ప్రయత్నించినా.. త్రిభాషా ఉద్యమం, నీట్, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక విషయాల్లో అధికార డీఎంకే పార్టీ బీజేపీని కేంద్రంగా చేసుకుని రాజకీయ యుద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఒంటరి పోరు ఏ విధంగానూ సరికాదని గ్రహించిన బీజేపీ అగ్రనాయకత్వం.. తమిళనాడు ప్రధాన ప్రతిపక్షం, ఒకప్పటి మిత్ర పక్షం.. అన్నాడీఎంకేతో చేతులు కలిపింది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అన్నాడీఎంకే-బీజేపీల మధ్య పొత్తు ఖరారైంది. సాక్షాత్తు బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెన్నై వచ్చి అన్నాడీఎంకే నేతలతో చర్చించిన తర్వాత ఈ పొత్తును ఆయనే స్వయంగా ప్రకటించారు. అంతేకాదు, నేరుగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్) నివాసానికి వెళ్లిన అమిత్ షా.. ఈపీఎస్ కుటుంబంతో కలిసి తేనీరు సేవించారు.

ఎన్నికలే అజెండా!

డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. ప్రజల్లో ఆ పార్టీకి, ఆ పార్టీ మిత్రపక్షాలకు సానుకూల స్పందన కల్పిస్తున్నాయి. దీనికి తోడు త్రిభాషా అమలు విధానం కోసం ఒత్తిడి, డీలిమిటేషన్‌పై వ్యతిరేకత, 'నీట్' వ్యతిరేక బిల్లును రాష్ట్రపతి తిరస్కరించడం తదితర కారణాతో బీజేపీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుని తమ పార్టీ నుంచి నలుగురిని అసెంబ్లీకి పంపించిన బీజేపీకి.. ఈసారి ఒంటరిగా ఎన్నికలను ఎదుర్కొనే పరిస్థితి కనిపించడం లేదు. ప్రస్తుతం బీజేపీతో తమిళమానిల కాంగ్రెస్, పీఎంకే వంటి చిన్న పార్టీలు మాత్రమే కలసి నడుస్తున్నాయి. గత 2024 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి కూటమికి 11 శాతం ఓట్లు పోలయినట్లు కనిపించినా, అందులో పీఎంకేకు 6 శాతానికి పైగా ఓటు బ్యాంకు ఉండడం గమనార్హం. దీంతో పరిస్థితిని గ్రహించిన కమలనాథులు అన్నాడీఎంకేను దరి చేర్చుకున్నారు. తమిళనాడులో ప్రస్తుత బీజేపీ చీఫ్ అన్నామలైని పక్కన పెడితేనే పొత్తుకు సిద్ధమని అన్నాడీఎంకే తేల్చి చెప్పడంతో.. ఆ డిమాండ్‌కు తలొగ్గిన బీజేపీ అధినాయకత్వం అన్నామలైని ఆ బాధ్యతల నుంచి వెంటనే తప్పించడం గమనార్హం.

అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోం

తమిళ పత్రిక 'తుగ్లక్' సంపాదకుడు, ఆర్ఎస్ఎస్ క్రియాశీలక నాయకుడిగా పేరొందిన ప్రముఖ ఆడిటర్ గురుమూర్తితో భేటీ అయ్యాకే అన్నాడీఎంకేతో పొత్తును అమిత్‌షా ప్రకటించడం గమనార్హం. నిజానికి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అమిత్‌షా గురుమూర్తితో భేటీ కావాల్సివుంది. కానీ, ఉదయం 10 గంటలకే గురుమూర్తి నివాసానికి వెళ్లిన అమిత్‌షా.. ఆయనతో చర్చించారు. కూటమి ఏర్పాటు గురించి జాప్యం చేయవద్దని ఆయన చేసిన సూచన మేరకు ఈపీఎస్‌ను తను ఉన్న హోటల్‌కు పిలిపించుకున్న అమిత్‌షా.. ఆయనతో గంటపాటు చర్చించారు. అనంతరం నేరుగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చి పొత్తుపై ప్రకటన చేశారు. తమిళనాట అన్నాడీఎంకే నేతృత్వంలోనే తమ కూటమి పని చేస్తుందని, ఈ పొత్తుకు ఎలాంటి షరతుల్లేవని అమిత్‌షా చెప్పారు. శుక్రవారం సాయంత్రం బీజేపీ తమిళనాడు ప్రధాన కార్యాలయమైన కమలాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో మోదీ నేతృత్వంలో, రాష్ట్రస్థాయిలో పళనిస్వామి నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ఎన్నికలకు వెళ్తుందని చెప్పారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. కాగా, తమిళనాడులో బీజేపీ, అన్నాడీఎంకే చేతులు కలపడం ఆహ్వానించదగిన పరిణామమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. బీజేపీ, అన్నాడీఎంకే కూటమికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కూటమి తరఫున సీఎం అభ్యర్థిగా పళనిస్వామి పేరును ప్రకటించడం ద్వారా పాలనానుభవం ఉన్నవారికి బాధ్యతలు అప్పగిస్తామని సంకేతమిచ్చినట్లు అయిందన్నారు.

నాగేంద్రన్‌కు బీజేపీ పగ్గాలు



తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా తిరునల్వేలి ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ పదవికి నాగేంద్రన్ మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక లాంఛనమైంది. దక్షిణ తమిళనాడులో దేవర్ల ప్రాబల్యం అధికంగా ఉన్న నేపథ్యంలో ఆ సామాజిక వర్గానికి చెందిన నాగేంద్రన్‌ను బీజేపీ ఎంపిక చేయడం గమనార్హం. 1989లో అన్నాడీఎంకేలో చేరి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన నాగేంద్రన్.. 2001లో తిరునల్వేలి నుంచి అన్నాడీఎంకే తరఫున పోటీచేసి విజయం సాధించారు. జయలలిత మంత్రివర్గంలో మంత్రిగా వ్యవహరించారు. జయ మరణానంతరం అన్నాడీఎంకేలో ఏర్పడిన విభేదాలతో ఆ పార్టీ నుంచి వైదొలిగి 2017లో బీజేపీలో చేరారు. కాగా.. ఇప్పటి వరకు పార్టీని నడిపించిన అన్నామలై శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. పార్టీ తరఫున అన్నామలై శక్తికిమించి పనిచేశారని అమిత్ షా అన్నారు.

పార్టీ పదవి నుంచి తమిళ మంత్రి పొన్ముడి ఔట్



చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన తమిళనాడు అటవీ శాఖ మంత్రి కె.పొన్ముడిని డీఎంకే అధినేత, సీఎం స్టాలిన్ పార్టీ పదవి నుంచి తప్పించారు. ఆయన్ను డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి స్థానం నుండి తొలగిస్తూ శుక్రవారం ఒక ప్రకటన చేశారు. అయితే ఇందుకు కారణాలను అందులో చెప్పలేదు. డీఎంకే ప్రభుత్వం నిరుపేద గృహిణులకు ప్రతినెలా రూ.1,000 నగదును వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసే 'కలైంజర్ మహిళా సాధికారిక పథకం' గురించి ఓ సభలో వివరిస్తూ పొన్ముడి మహిళలపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఒక సెక్స్ వర్కర్ గురించి మాట్లాడే క్రమంలో హిందూ మత చిహ్నాలను లైంగిక భంగిమలతో పోలుస్తూ ఆయన చేసిన వివాదాస్పద జోక్ రాష్ట్రంలో రాజకీయ దుమారానికి కారణమైంది. డీఎంకే ఎంపీ కనిమొళి సహా విపక్ష పార్టీల నేతలు తీవ్ర విమర్శలు చేశారు.

మా నినాదం అందరి వికాసం

» వారికి కుటుంబమే సర్వస్వం.. విపక్షాలపై ప్రధాని ఆగ్రహం

» వారాణసీలో రూ.3,880 కోట్ల పథకాలకు శంకుస్థాపన



వారాణసీలో గ్యాంగ్ రేప్ బాధితురాలి వివరాలను ఎయిర్‌పోర్టులోనే ఆరా తీస్తున్న ప్రధాని మోదీ

వారాణసీ, ఏప్రిల్ 11: ప్రతిపక్షాలు కుటుంబ పార్టీలంటూ ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అందరి సమగ్రాభివృద్ధే లక్ష్యంగా.. 'సబ్‌కా వికాస్.. సబ్‌కా వికాస్' నినాదంతో తమ ప్రభుత్వం పనిచేస్తుంటే.. అధికార కాంక్షతో విపక్షాలు తమ కుటుంబాలను ప్రోత్సహించడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. యూపీలోని తన నియోజకవర్గం వారాణసీలో శుక్రవారం ఆయన పర్యటించారు. 2014లో ప్రధానిగా పగ్గాలు చేపట్టాక ఇది ఆయనకు 50వ అధికారిక పర్యటన. ఈ సందర్భంగా రూ.3,880 కోట్ల విలువ చేసే 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కొన్ని ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగించారు. జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు. 2036 ఒలింపిక్ క్రీడలు మన దేశంలో నిర్వహించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మోదీ వారాణసీలో అడుగుపెట్టగానే.. ఇటీవల తన నియోజకవర్గంలో 19 ఏళ్ల యువతిపై జరిగిన గ్యాంగ్‌రేప్‌పై ఆరా తీశారు. పోలీసు కమిషనర్, డివిజనల్ కమిషనర్, కలెక్టర్ వివరాలు తెలియజేశారు. 23 మంది నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ప్రధాని ఆదేశించారు.

పెద్ద పెద్ద కార్పొరేట్లకు మేలుతో యువతకు ఉద్యోగాలొస్తాయా?

» ఎన్నికలప్పుడు చెప్పిన ఈఎల్ఐ స్కీమ్ ఏది.. ప్రధానిపై రాహుల్ ధ్వజం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పనపై ప్రధాని మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మూడు ప్రశ్నలు సంధించారు. పెద్దపెద్ద కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చి.. చిన్న పరిశ్రమలను పక్కనపెడితే ఉద్యోగాల కల్పన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2024 ఎన్నికల ముందు ప్రధాని ఆర్భాటంగా ప్రకటించిన ఉపాధి ఆధారిత రాయితీ (ఈఎల్ఐ) పథకం ఏమైందని నిలదీశారు. దేశ యువతకు అత్యవసరమైన ఉపాధి కల్పనపై ఆయనకు నిర్మాణాత్మక ప్రణాళిక ఉందా.. లేక ఇది కూడా శుష్క వాగ్దానమేనా అని శుక్రవారం 'ఎక్స్'లో ప్రశ్నించారు. ఈఎల్ఐ స్కీంపై కార్యాచరణే సిద్ధం కాలేదని.. నియమ నిబంధనలు రూపొందించలేదని.. బడ్జెట్‌లో దానికి కేటాయించిన రూ.10 వేల కోట్లు ఎక్కడకు వెళ్లాయని నిలదీశారు. నిరుద్యోగ సమస్య పరిష్కారంలో ఆయన చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. స్వదేశీ పెట్టుబడులను మోదీ ప్రభుత్వం నాశనం చేసిందని.. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) కూడా దాదాపు అంతరించే దశలో ఉన్నాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఆరోపించారు. భయపెట్టడం, మోసగించడం, బెదిరించడం అనే విధానాల వల్లే ఈ దుర్గతి పట్టిందని 'ఎక్స్'లో ధ్వజమెత్తారు.

కవిత సారీ చెప్పాలి

» లిక్కర్ కేసులో జైలుకెళ్లిన ఆమెకు పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే హక్కు లేదు : తెలంగాణ జనసేన

పంజాగుట్ట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు లేదని, పవన్ కల్యాణ్‌పై ఆమె చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలంగాణ జనసేన పార్టీ ఇన్‌చార్జి శంకర్ గౌడ్ అన్నారు. కవిత బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే అర్హత ఎవరికీ లేదన్నారు. లిక్కర్ కేసులో జైలుకు వెళ్లిన కవితకు పవన్ కల్యాణ్ గురించి మాట్లాడే హక్కు లేదని, కవిత నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. తమ నాయకుడు సీరియస్ పొలిటీషియన్ కాదడమేంటని ఆయన ప్రశ్నించారు.

గర్భస్థ శిశువులూ ఉక్కిరిబిక్కిరి!

(మొదటి పేజీ తరువాయి)

నవజాత శిశువులు అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. తల్లి గర్భం నుంచి బయటకు రాగానే ఇబ్బందులు పడుతున్నారు. చాలా మందికి ఆస్థమా సమస్య ఉంటుండగా.. మరికొందరు తక్కువ బరువుతో పడుతున్నారు. గర్భిణులు కలుషిత గాలిని పీల్చడమే దీనికి ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. గడిచిన ఐదేళ్లలో హైదరాబాద్‌లో ఆస్థమాతో జన్మిస్తున్న పిల్లల సంఖ్య ఏకంగా 20 శాతం పెరిగిందని, అలాగే తక్కువ బరువుతో పుడుతున్న పిల్లల సంఖ్య 15 శాతం పెరిగినట్లు తన పరిశోధనలో తేలిందని కామినేని ఆస్పత్రి పిల్లల వైద్యురాలు కంచన్ ఎస్ చన్నావర్ చెప్పారు. హైదరాబాద్ మహానగరంలో గాలి నాణ్యత నానాటికీ దిగజారిపోతోందని కంచన్ అన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాలు, పారిశ్రామికీకరణతో పాటు వ్యర్థాల నిర్వహణ సరిగా లేకపోవడం వంటి కారణాలతో మనం పీల్చుకునే గాలి విషతుల్యంగా మారుతోందని చెప్పారు. కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ లాంటి హానికరమైన ఉద్గారాలు కలిసిన కలుషిత గాలిని గర్భిణులు పీల్చడం వల్ల పిల్లలు తక్కువ బరువుతో పుట్టడం, ఆస్థమా బారిన పడడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు.

తల్లి పీల్చే కలుషిత గాలితో ముప్పే

గర్భిణులు కాలుష్యం బారిన పడితే కడుపులో ఉండే శిశువు శ్వాసకోశ అవయవాల ఎదుగుదల సరిగా ఉండదని కంచన్ చెప్పారు. ఆస్పత్రులకు వచ్చే పిల్లల్లో 50 శాతం మందికి శ్వాసకోశ సమస్యలు ఉంటున్నాయన్నారు.



వీరిలో 30-40 శాతం పిల్లలకు అలర్జీ, ఆస్థమా, గురక, అలర్జీ రినైటిస్ (గొంతులో దుమ్ము కారణంగా ఏర్పడే అలర్జీతో పాటు జ్వరం రావడం) వంటి జబ్బులు ఉంటున్నాయని తెలిపారు. చాలా మంది పిల్లలు వయసుకు తగ్గ బరువు ఉండడం లేదన్నారు. అలాంటి పిల్లలకు పల్మనరీ ఫంక్షన్ చేస్తే వాయు కాలుష్య ప్రభావం వల్ల అవయవాల ఎదుగుదలలో లోపం ఉన్నట్లు నిర్ధారణ అవుతుందని చెప్పారు. ఏడాది, రెండేళ్లలోపు పిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో ఆస్పత్రికి వస్తున్నట్లు వివరించారు. శిశువులకు కొన్నిసార్లు ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే ఆస్పత్రికి తీసుకొచ్చి నెబ్యులైజర్ పెట్టాల్సి ఉంటుందన్నారు. సిగరెట్ పొగ కారణంగా కూడా పుట్టబోయే పిల్లలు శ్వాసకోశ సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సిగరెట్ పొగలో సీసం, నికోటిన్, కోటినిన్, సైనైడ్, కాడ్మియం, పాదరసం, కార్బన్ మోనాక్సైడ్, పాలిసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రో కార్బన్ ఉంటాయి. కార్బన్ మోనాక్సైడ్ గర్భంలోని పిండానికి ఆక్సిజన్ సరఫరాను తగ్గిస్తుంది. తల్లి సిగరెట్ పొగను పీల్చడం ఆపివేసిన తర్వాత కూడా ఐదారు గంటల వరకు గర్భంలోని శిశువుకు ఆక్సిజన్ సరఫరా పరిమాణం తగ్గుతుంది. ఫలితంగా దీర్ఘకాలిక హైపోక్సియా వచ్చే ముప్పు ఉంటుంది. కాబట్టి గర్భిణులు పొగ తాగడం మంచిది కాదని డాక్టర్ కంచన్ చెప్పారు. ఇంట్లో ఎవరికైనా ధూమపానం అలవాటు ఉంటే గర్భిణులకు దూరంగా వెళ్లాలని సూచించారు.

నవజాత శిశువుల ఇబ్బందులు వర్ణనాతీతం



డాక్టర్ కంచన్

కాలుష్యం కారణంగా నవజాత శిశువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి బాధలు వర్ణనాతీతం. నవజాత శిశువుల ఊపిరితిత్తులు చాలా సున్నితంగా ఉంటాయి. రోగ నిరోధక శక్తి కూడా తక్కువే. ఇలాంటి పరిస్థితుల్లో కలుషిత గాలిని పీల్చడం వల్ల చిన్నారులను జీవితాంతం అనారోగ్య సమస్యలు వేధిస్తాయి. దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, గుండె కవాటాల జబ్బులు, నాడీ వ్యవస్థ సమస్యలు బాధిస్తాయి. పాలకులు, ప్రజలు కాలుష్య సమస్యపై తప్పనిసరిగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలి. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించాలి. వ్యర్థాల నిర్వహణకు మెరుగైన విధానాలను రూపొందించి, అమలు చేయాలి. హైదరాబాద్‌లో పుట్టి, పెరిగే పిల్లల భవిష్యత్తు మన చేతులు, చేతల్లోనే ఉంది. వారికి స్వచ్ఛమైన గాలిని పీల్చుకునే అవకాశం కల్పించాలి.

ఒక్క క్లిక్‌తో స్థలాల సమస్త సమాచారం!

» చెరువులు, ప్రభుత్వ భూముల పరిధుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో..

» ఓఆర్ఆర్ లోపల ఆస్తుల పరిరక్షణకు ఎన్ఆర్ఎస్‌సీతో హైడ్రా ఒప్పందం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతంలో చెరువు ఉంది..? దాని విస్తీర్ణమెంత..? వరద కాలువలు, నాలాలు ఎక్కడున్నాయి..? వంటి వివరాలతోపాటు ప్రభుత్వ భూములు, పార్కులకు సంబంధించిన సమస్త సమాచారం ఒక్క క్లిక్‌తో ప్రజలు తెలుసుకునేందుకు హైడ్రా కీలక నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధి వరకు ఆయా అంశాలు గుర్తించి.. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేందుకు నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ఆస్తుల పరిరక్షణ, మెరుగ్గా విపత్తు నిర్వహణ చర్యలు చేపట్టేందుకు ఎన్ఆర్ఎస్‌సీతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, ప్రభుత్వ, ప్రజావసర భూముల హద్దులు నిర్ధారించి, సాంకేతికంగా అందుబాటులోకి తెస్తే మున్ముందు ఆక్రమణలకు అవకాశముండదని రంగనాథ్ చెప్పారు. ఎవరైనా కబ్జా చేసినా.. ఎన్ఆర్ఎస్‌సీ శాటిలైట్ చిత్రాల ద్వారా సులువుగా గుర్తించవచ్చన్నారు. 1970లో సర్వే ఆఫ్ ఇండియా చేసిన టోపోషీట్లు, కెడస్ట్రల్ మ్యాపులు, రెవెన్యూ రికార్డులు, చెరువుల సమాచారంతో పాటు.. ఎన్ఆర్ఎస్‌సీ చిత్రాలతో సమగ్ర సమాచార వ్యవస్థను రూపొందిస్తున్నట్టు తెలిపారు. చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, పర్యావరణహిత నగరం రూపకల్పనకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని ప్రకాశ్ చౌహాన్ అన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన

» సీఎంను మార్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ యోచన

» ప్రధాన ప్రతిపక్షం ఫాంహౌజ్‌లో పడుకుంది:అర్వింద్



హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసమర్థ, అవినీతి, అబద్ధాల ప్రభుత్వం నడుస్తోందని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేని కాంగ్రెస్, ప్రజల దృష్టి మళ్లించడానికి కులగణన, పుష్ప, హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఇప్పుడు హెచ్‌సీయూ భూముల వివాదం సృష్టించిందన్నారు. రోజురోజుకు సీఎం రేవంత్ గ్రాఫ్ పడిపోతోందన్నారు. సీఎం రేవంత్‌ను మార్చేందుకు కాంగ్రెస్ హైకమాండ్ యోచిస్తోందని, అయితే ఆయన్ను మారిస్తే మరొకరు లేరని అర్వింద్ తెలిపారు. ఒక్క మంత్రి శ్రీధర్‌బాబు తప్ప విగతావారంతా అన్‌ఫిట్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షం ఫాంహౌజ్‌లో పడుకుందంటూ కేసీఆర్‌ను ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్షనేత హోదా ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు.

నకిలీ తీర్పు కాపీలతో 100 ఎకరాలు స్వాహా

» శంషాబాద్ పైగా విలేజ్ కేసులో ట్విస్ట్

» సిట్ దర్యాప్తుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ)కి కొంత మంది ప్రైవేటు వ్యక్తులకు మధ్య నడుస్తున్న వంద ఎకరాల భూ వివాదంలో కోర్టు నకిలీ తీర్పు కాపీలు కలకలం సృష్టించాయి. ఈ భూమి తమదేనని అంటున్న ప్రైవేటు వ్యక్తులు హైకోర్టుకు ఇచ్చింది నకిలీ తీర్పు కాపీలని ధర్మాసనం ప్రాథమికంగా గుర్తించింది. ఆ తీర్పు కాపీలపై పోలీసు దర్యాప్తునకు ఆదేశాలు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం శంషాబాద్ పైగా విలేజ్‌లోని 661, 662, 663, 664, 720, 721, 724, 725, 727, 729, 730, 731, 732, 775 తదితర సర్వే నంబర్లలో రూ.వందల కోట్ల విలువ చేసే దాదాపు 100 ఎకరాల భూ వివాదంలో సివిల్ కోర్టు హైదరాబాద్ జహానుమాకు చెందిన మహమ్మద్ తాహెర్ ఖాన్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ హెచ్ఎండీఏ హైకోర్టులో అప్పీల్ చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ పి.శ్రీసుధ ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్నవి హైకోర్టు నకిలీ తీర్పు కాపీలని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. ఆ తీర్పు కాపీల ఆధారంగా వారు యాజమాన్య హక్కులను కోరుతున్నారని సంశయించింది. సదరు తీర్పునకు సంబంధించి అసలు హైకోర్టులో పిటిషన్ నమోదైందా..? అన్నదానిపై విచారణ చేయాలని జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను ధర్మాసనం గతంలో ఆదేశించింది. రిజిస్ట్రార్ సీల్డ్ కవర్‌లో సమర్పించిన నివేదికను ధర్మాసనం శుక్రవారం కోర్టులో తెరిచింది. ఆ నివేదిక ప్రకారం.. ప్రైవేటు వ్యక్తులు సమర్పించిన తీర్పు కాపీ 1988 ఏప్రిల్ 29న జస్టిస్ ఎన్‌డీ పట్నాయక్ ఇచ్చినట్లు ఉంది. అయితే పట్నాయక్ 1988 డిసెంబర్ 28న జడ్జిగా ఎంపికయ్యారని ధర్మాసనం గుర్తించింది. దాంతోపాటు సదరు తీర్పు కాపీలో ఉన్న రిట్ పిటిషన్ నంబరు రిజిస్టర్ అయినట్లు హైకోర్టు రికార్డుల్లో ఎక్కడా లేదని తెలిసింది. దీంతో ఇది నకిలీ తీర్పు కాపీల ద్వారా కోర్టును మోసం చేయడమేనని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై జ్యుడీషియల్ రిజిస్ట్రార్.. పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించింది. ఇప్పటికే చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో నమోదై ఉన్న ఇలాంటి మరో రెండు ఎఫ్ఐఆర్‌లతో కలిపి ప్రస్తుత ఫిర్యాదును దర్యాప్తు చేయడానికి సిట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. సదరు వివాదాస్పద భూమి వ్యవహారంలో ఇరుపక్షాలు యథాతథ స్థితి(స్టేటస్ కో) కొనసాగించాలని స్పష్టం చేసింది.

22మంది మావోయిస్టుల లొంగుబాటు

» వీరిలో ఒకరిది ములుగు జిల్లా

» మిగతా వారిది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం

» లొంగిపోయిన వారిలో ఏడుగురు మహిళలు

» వివరాలు వెల్లడించిన ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ. శుక్రవారం 22మంది మావోయిస్టులు ములుగు ఎస్పీ శబరీశ్ ఎదుట లొంగిపోయారు. వీరిలో ఒకరు ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి చెందినవారు కాగా.. మిగతా వారంతా ఛత్తీస్‌గఢ్ వాసులు. లొంగిపోయిన వారిలో ఏడుగురు మహిళలున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శబరీశ్ లొంగిపోయిన వారి వివరాలు వెల్లడించారు. 'పోరుకన్న ఊరు మిన్న-మన ఊరికి తిరిగి రండి' అనే కార్యక్రమానికి స్పందించి 22 మంది మావోయిస్టులు లొంగుబాటను ఎంచుకున్నట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు ఏసీఎం క్యాడర్ సభ్యులు, ఒకరు పార్టీ సభ్యుడు కాగా, 18 మంది ఆర్పీసీ సర్కార్ కమిటీకి సంబంధించిన వారున్నారన్నారు. వెంకటాపురం మండలం యాకన్నగూడేనికి చెందిన మడవి మాస 2010లో పార్టీలో చేరి 2013లో ఏసీఎం క్యాడర్‌కు ఎదిగాడు. 2017లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధి కొత్తచెరువు వద్ద 12మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించిన ఘటనలో పాల్గొన్నాడు. అదే ఏడాది ఏప్రిల్‌లో బుర్కపాల్ వద్ద 25మంది జవాన్లు మరణించిన ఘటన, 2021లో టేకులగుర్మా వద్ద పోలీసులపై దాడిచేసి 24మంది డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ జవాన్లను హత్యచేసిన ఘటనలో కూడా పాల్గొన్నట్లు ఎస్పీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా మల్లంపేటకు చెందిన ముచ్చకి జోగారాం పామేడు ఏరియా కమిటీలో చేరి ప్రస్తుతం కోమటిపల్లి ఆర్‌పీసీ మిలీషియా చీఫ్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. తుమ్మిరిగూడకు చెందిన తాటి జోగ పువ్వర్తి ఎల్‌వోసీ డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్నాడని ఎస్పీ చెప్పారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై బాంబులు అమర్చామని ప్రజలను మావోయిస్టులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. మావోయిస్టులది అర్థంలేని పోరాటమని, జనజీవన స్రవంతిలో కలిస్తే ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పిస్తామన్నారు.

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో శుక్రవారం 43.7 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. రెబ్బెనలో 42.4, సిర్పూర్(టి)లో 42.3, కెరమెరి, పెంచికలపేట మండలాల్లో 42.2, ఆసిఫాబాద్‌లో 42.1, తిర్యాణి, కౌటాల మండలాల్లో 42.0, దహెగాంలో 41.6, వాంకిడిలో 41.0, కాగజ్‌నగర్‌లో 40.8, చింతలమానేపల్లిలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దౌత్య విజయం

ముంబై ఉగ్రదాడి నిందితుడు తహవ్వుర్ రాణా అమెరికా జైలు నుంచి ఎన్ఐఏ కస్టడీలోకి వచ్చాడు. 26/11 మారణకాండకు పదిహేడేళ్లవుతున్న తరుణంలో భారతదేశం ఇతడిని విచారించేందుకు సిద్ధపడుతోంది. అప్పగింతను అడ్డుకోవడానికి అమెరికాలో తనకున్న అన్ని అవకాశాలను ఆయన వాడుకున్నాడు. ఆ దేశాధ్యక్షుడితో పాటు అక్కడి న్యాయస్థానాలు కూడా సహాయనిరాకరణ చేయడంతో ఇతడు అంతిమంగా భారత్ చేరక తప్పలేదు. రాణాను హింసించబోమని, ప్రాణాలకు ప్రమాదం రానివ్వబోమని, కేసుకు పరిమితమై మర్యాదగా ప్రశ్నిస్తామని మాట ఇచ్చి తెచ్చుకున్నదానికి అనుగుణంగానే ఇక్కడి ఏర్పాట్లు కూడా ఉన్నాయి. అప్పగింతలు మొదలు, ఆయన ప్రయాణించిన విమానం, అది వచ్చిన దారి, ఇక్కడి న్యాయస్థానాల్లో ఎన్ఐఏ అభ్యర్థనలు ఇత్యాది వివరాలు విశేషాలతో టెలివిజన్ చానెళ్ళు హోరెత్తిపోతున్నాయి. రాణా చెప్పబోయేది ఏమిటి, విప్పబోయే గుట్టుతో పాకిస్థాన్ పని అయిపోయినట్టేనా, భారతదేశంలో సైతం కొందరికి సమస్యలు తప్పవా ఇత్యాది ప్రశ్నలతో మీడియా హడావుడిపడుతోంది. రాణాను రప్పించిన ఘనతమాదేనని, మోదీ ప్రభావ ప్రాభవాల వల్లే ఇది సాధ్యమైందని బీజేపీ నాయకులు అదే పనిగా అంటూండటంతో కాంగ్రెస్‌కు ఆగ్రహం కలిగింది. మన్మోహన్‌సింగ్ కాలంలోనే ఈ ప్రక్రియకు పునాదిపడిందని ఆ పార్టీ గుర్తుచేసింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికా పర్యటన ఆరంభించకముందే, ఆ దేశంనుంచి ఇంధన, ఆయుధ కొనుగోళ్ళకు, అమెరికా ఉత్పత్తులపై సుంకాల సడలింపులూ రాయితీలకు సిద్ధపడి, వాటికి బదులుగా ఈ వృద్ధ ఉగ్రవాదిని తెచ్చుకున్నారని గిట్టనివారు ఆడిపోసుకున్నారు కూడా. ఈ విమర్శలను అటుంచితే, 170మంది ప్రాణాలను బలితీసుకున్న ఒక ఉగ్రవాదిని ఇలా రప్పించి, ఈ దేశ చట్టాలకు అనుగుణంగా, ఈ భూమిమీద శిక్షించడానికి మార్గం సుగమం చేసుకోవడం కచ్చితంగా స్వాగతించాల్సిన అంశం.

తెలీదు, గుర్తులేదు అంటూ నిన్నటిమొన్నటి కేసుల్లోనే నిందితులు, సాక్షులు తేల్చేస్తూంటే తహవ్వుర్ రాణానుంచి ఇప్పుడు కొత్తగా రాబట్టగలిగేది, తవ్వితీయగలిగేది ఏమైనా ఉంటుందా అన్నది ప్రశ్న. ఉగ్రదాడుల కుట్రలు, పన్నాగాలకు సంబంధించి అదనంగా ఓ నాలుగు విషయాలు చెప్పగలిగినా ఆయన సహాయకుడు మాత్రమేనన్నది వాస్తవం. లష్కరే తోయిబా అధినేత హాఫీజ్ సయీద్, దాని కార్యకలాపాల అధినేత లఖ్వీ, డేవిడ్ హ్యాడ్లీ వంటివారు సూత్రధారులు, పాత్రధారులుగా సాగిన ఈ విధ్వంసంలో హ్యాడ్లీ నేరుగా సంభాషిస్తూ వచ్చిన ఐఎస్ఐ అధికారి ఇక్బాల్ కూడా కీలకభూమిక నిర్వహించిన విషయం తెలిసిందే. డేవిడ్ హ్యాడ్లీ అనే దావూద్ గిలానీ తన మిత్రుడైన రాణాను వాడుకొని పనిచక్కబెట్టుకున్న దశలో ఈయనకు అదనంగా తెలిసింది ఎంత, అందులో ఇప్పుడు చెప్పబోయేది ఎంత అన్నది చూడాలి. మొత్తం గొలుసుకట్టులో రాణా స్థానం ఎక్కడ అన్నది ప్రధానం. ఈ అపనమ్మకం కారణంగానే ఇతడిని బిర్యానీ ఖైదీ అని కూడా కొందరు తీసిపారేస్తున్నారు. అమెరికాకు నిజంగానే ముంబైఘోరం విషయంలో పట్టింపు, బాధిత కుటుంబీకులపట్ల సానుభూతి ఉండివుంటే భారత్‌కు అప్పగించబోనని హామీ ఇచ్చి డేవిడ్ హ్యాడ్లీతో ఒప్పందం చేసుకొనేది కాదు. ఇక, హాఫీజ్ సయీద్‌కు సంబంధించిన సమాచారానికి 2012లో భారీ పారితోషికం ప్రకటించిన అమెరికా ఆ తరువాత అతడు పాకిస్థాన్‌లో బహిరంగంగా తిరుగుతున్నా, సభల్లో ప్రసంగాలు చేస్తున్నా పట్టించుకోలేదు. ఆరుగురు అమెరికన్లతో సహా బాధితులందరికీ న్యాయం దక్కడానికి రాణా కీలకమని వ్యాఖ్యానిస్తూ ఆయనను పాకిస్థాన్ మూలాలున్నవాడిగా అమెరికా ఇప్పుడు ప్రత్యేకంగా గుర్తుచేస్తోంది. ఇరవైయేళ్ళుగా అతడితో తనకు సంబంధం లేదని విడుదల రోజునే పాకిస్థాన్ చేతులు దులిపేసుకుంది. ముంబై ఉగ్రదాడుల కుట్రలమీద గతంలో ఇచ్చిన విస్తృత సమాచారాన్ని కూడా అది అవహేళన చేసి, అటకెక్కించేసింది. రాణా భారత్ రాక, ఇక్కడి విచారణ పాకిస్థాన్‌మీద ఒత్తిడి పెంచి, హాఫీజ్ సయీద్ సహా లష్కర్ కమాండర్లను శిక్షించేందుకు దారితీస్తుందని కొందరి నమ్మకం. ముంబై ఉగ్రదాడి బాధిత కుటుంబాలవారికి ఇప్పటివరకూ దక్కిన ఉపశమనమల్లా అజ్మల్ కసబ్‌ను ప్రత్యక్షంగా పట్టుకొని, విచారించి, సంఘటన జరిగిన నాలుగేళ్ళలోనే మనం ఉరితీయగలగడం. ఎంతో కష్టపడి, ఇంతకాలానికి దేశానికి తెచ్చుకోగలిగిన తహవ్వుర్ రాణా విషయంలో మనం ఎంతవేగంగా, ఏ మాత్రం చేయగలుగుతామో చూడాలి.

జార్జి రెడ్డి జ్ఞాపకాలు

జార్జిరెడ్డితో నా పరిచయం, నేను ఎం.ఏ. మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు (1971–72లో). జార్జిని నాకు ఎవరు పరిచయం చేశారో సరిగా గుర్తు లేదు. కానీ, అతన్ని చాలా తరచుగా, ఉస్మానియా యూనివర్శిటీ, మెయిన్ లైబ్రరీలో చూసేవాణ్ణి. జార్జితో పరిచయం అయ్యాక, అతనూ, ఇంకో నలుగురమూ కలిసి, ఉస్మానియా యూనివర్శిటీ కాంపస్, పీజీ హాస్టల్‌లోని ఒకతని రూంలో, వారం పదిరోజులకు ఒకసారి కలుసుకునేవాళ్ళం. అది ఒక రకమైన 'స్టడీ సర్కిల్' లాంటిదనుకోవచ్చు.

జార్జి లైబ్రరీలో చదువుతూ కనిపించినప్పుడు, ఆ సమయానికి అతను చదువుతున్న పుస్తకం గురించి, చాలా క్లుప్తంగా మాట్లాడుకున్న సందర్భాలున్నాయి. ఒకసారి 'బకూనిన్' పుస్తకం ఒకటి చదువుతూ కనిపించాడు. అప్పటికి నేను మార్క్సిజానికి సంబంధించిన పుస్తకాలు ఏవో కొన్ని మాత్రమే చదివాను. కానీ, 'బకూనిన్' గురించి విన్నాను. అతను 'అరాచకవాద సిద్ధాంతకర్త' అనీ, పార్టీనీ, రాజ్యాంగ యంత్రాంగాన్నీ ఒప్పుకోడనీ, మార్క్సు ఎంగెల్సులు అతన్ని వ్యతిరేకించారనీ– ఇలా, ఏవో, ఎవరో రాసిన పుస్తకాల్లో, పైపైన చదివినట్టు గుర్తు. అదే మాట జార్జితో అంటే, 'కాదు. బకూనిన్ కూడా కార్మిక ఉద్యమకారుడే. కాకపోతే, అతని సిద్ధాంతం వేరు'– అని ఏదో క్లుప్తంగా చెప్పాడు. నాదంతా, పైపైన చదివిన, పరిమిత జ్ఞానమే కాబట్టి, నేనేమీ వాదించలేదు. అరకొర జ్ఞానంతో అయినా, కొన్ని రకాల ప్రశ్నలు వచ్చేవి. ఒకసారి జార్జి, కాంగ్రెస్ పార్టీ వాళ్ళు పెట్టిన 'సోషలిస్ట్ యూత్ ఫోరం' అనుకుంటా, ఆ మీటింగుకి వెళ్ళి మాట్లాడినట్టు తెలిసింది. 'అదేమిటీ, వాళ్ళు బూర్జువాలు గదా? వాళ్ళతో కలవడం ఏమిటీ?' అన్నాను. దానికి జార్జి, 'అవును, వాళ్ళు బూర్జువాలే. రేపు సమయం వచ్చినప్పుడు, వాళ్ళు తుపాకులు మనవైపు తిప్పుతారు. ఇప్పుడున్న ప్రధాన శత్రువుని ఎదుర్కోవడానికి వీళ్ళకి మన అవసరం ఉంది. అలాగే, మనకి వాళ్ళ అవసరం ఉంది'– అనే ధోరణిలో సాగింది జార్జి వివరణ.



జార్జి హత్య జరిగిన రోజున, చీకటి పడుతున్న వేళ, ఆరూ, ఆరున్నర ప్రాంతంలో, 'ఎ' హాస్టల్ మెస్సులో, అన్నం తిని, రోజూ లాగే లైబ్రరీకి బైల్దేరాను. లైబ్రరీ మెట్లు ఎక్కుతుండగా, జార్జి, ఇంకో అతనితో ఎదురుపడ్డాడు. 'ఎక్కడికి' అని నేను అడిగితే, 'ఇంజినీరింగు కాలేజీ హాస్టల్‌లో, మన కుర్రాళ్ళని, ఎన్నికల్లో అవతలి పక్షం వాళ్ళు బెదిరిస్తున్నారని తెలిసింది. అక్కడికి వెళ్తున్నా' అన్నాడు. లైబ్రరీలో చదువుకుంటూ, ఒక గంట గడిచిందో లేదో, ఒక స్నేహితుడు పరిగెత్తుకుంటూ వచ్చి, 'జార్జిని స్టాబ్ జేసింద్రంట!' అని చెప్పాడు.

జార్జి హత్య జరిగిన రోజున (14-4-1972), చీకటి పడుతున్న వేళ, ఆరూ, ఆరున్నర ప్రాంతంలో, 'ఎ' హాస్టల్ మెస్సులో, అన్నం తిని, రోజూ లాగే లైబ్రరీకి బైల్దేరాను. లైబ్రరీ మెట్లు ఎక్కుతుండగా, జార్జి, ఇంకో అతనితో ఎదురుపడ్డాడు. 'ఎక్కడికి' అని నేను అడిగితే, 'ఇంజినీరింగు కాలేజీ హాస్టల్‌లో, మన కుర్రాళ్ళని, ఎన్నికల్లో అవతలి పక్షం వాళ్ళు బెదిరిస్తున్నారని తెలిసింది. అక్కడికి వెళ్తున్నా' అన్నాడు.

లైబ్రరీలో చదువుకుంటూ, ఒక గంట గడిచిందో లేదో, ఒక స్నేహితుడు పరిగెత్తుకుంటూ వచ్చి, 'జార్జిని స్టాబ్ జేసింద్రంట!' అని చెప్పాడు. వెంటనే, ఇంజినీరింగు కాలేజీ వెనక వున్న ఒక హాస్టల్‌కి పరిగెత్తి కెళ్తే, అక్కడ కొందరు పోలీసులున్నారు. నేల మీద రక్తం పడివుంది. జార్జి వేసుకునే రబ్బరు స్లిప్పర్స్ పడి వున్నాయి. జార్జిని గాంధీ హాస్పటల్ కి తీసుకెళ్ళారని తెలిసింది. బస్సు పట్టుకుని గాంధీ హాస్పటల్‌కి వెళ్తే, ఉస్మానియా హాస్పటల్‌కి పరీక్ష కోసం తీసికెళ్ళారని చెప్పారు. అక్కణ్ణించీ ఉస్మానియా హాస్పటల్‌కి వెళ్తే, అక్కడ మొదట్లోనే, ఒక పోలీసు అవుట్ పోస్టో, మార్చ్యురీనో ఏదో ఉంది. అక్కడ, చూస్తే జార్జి మృతదేహం నేల మీద, అడుగున చాపలాంటిది కూడా లేకుండా, పడి వుంది. ద్వారం దగ్గిర, రాజకీయ నాయకుడి డ్రెస్సులో ఒకరున్నారు. అతనెవరంటే, అప్పటి కాంగ్రెస్ పార్టీలో, ఎమ్మెల్యేనో, కార్మిక శాఖామంత్రో అనుకుంటాను, టి.అంజయ్య. నేను పెద్దగా ఏడుస్తూ, అంజయ్యతో, 'మీరంతా ఏమి చేస్తున్నారు, ఇలా జరుగుతూవుంటే..' అని ఏదేదో అంటున్నాను. అక్కడున్న ఇతర స్టూడెంట్స్ కూడా, నినాదాలిస్తూ, ఆవేదనతో ఉన్నారు.

జార్జి హత్య తరవాత, అతని మిత్రులందరమూ తరచూ, కలుసుకుంటూ వుండేవాళ్ళం. జార్జిని హత్య చేసిన తర్వాత, ప్రత్యర్థులు, అతని సన్నిహిత అనుచరుల మీద కూడా దాడులు చేస్తూ ఉండేవారు. అలాంటి సందర్భాలలో, జార్జికి సన్నిహితంగా ఉండిన ఒకరిద్దరు, అవతలి పక్షాన్ని ఖండిస్తూ కరపత్రాలు ఇంగ్లీషులో రాస్తూ ఉండేవారు. నేను పుస్తకాలు ఎక్కువగా చదువుతాననీ, చలం గారి గురించీ, కమ్యూనిజం గురించీ, హాస్టల్లో, వాదప్రతివాదాలు చేస్తాననీ తెలిసి, అలాంటి కరపత్రాల్ని తెలుగులోకి అనువదించమని నన్ను అడిగేవారు.



1973లో, జార్జి హత్య జరిగి ఒక ఏడాది కావస్తూండడంతో, ఒక సంస్మరణ సంచిక, తెలుగులో తేవాలని, అతని సన్నిహిత మిత్రులందరూ అనుకుని, ఆ పని నాకు అప్పగించారు. దానికోసం, జార్జి గురించి బాగా తెలిసినవాళ్ళని, వ్యాసాలు రాసి ఇవ్వమని అడిగాను. తెలుగువాళ్ళెవ్వరూ, తెలుగులో రాసి ఇవ్వడానికి చొరవ చూపలేక పోయారు. ముగ్గురు ఇతర భాషల వాళ్ళు ఇంగ్లీషులో రాసిచ్చారు. వాటిని, నేను యథాతథంగా కాక, స్వేచ్ఛానువాదం చేశాను. మధ్య మధ్యలో శ్రీశ్రీ 'మహాప్రస్థానం' నించీ కొన్ని కవితా పంక్తుల్నీ, ఆ కవితా సంకలనానికి చలం గారు రాసిన 'యోగ్యతాపత్రం'లో నించీ కొన్ని పదబంధాల్నీ, ఆ సందర్భానికి అవసరం అనుకుని, వాటిని వాడుతూ అనువదించాను.

ఈ పుస్తకంలో ఒక ముందు మాటా, చిన్నవీ, పెద్దవీ కలిసి 5 వ్యాసాలూ ఉన్నాయి. 'జార్జి వ్యక్తిత్వం' అనే వ్యాసం, జార్జితో సన్నిహితంగా మెలిగిన 'విజయ్ కులకర్ణి' అనే అతను ఇంగ్లీషులో రాసిచ్చినట్టు గుర్తు. 'నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం' అన్న వ్యాసాన్నీ, 'విద్యార్థి ఉద్యమాలు' అన్న వ్యాసాన్నీ, టెక్నాలజీ కాలేజీకి చెందిన 'భాస్కర్' అనే అతను రాసిచ్చాడు. 'దోపిడీ వ్యవస్థలో స్త్రీలు' అనే వ్యాసాన్ని, ఆర్ట్స్ కాలేజీలో, లింగ్విస్టిక్స్ పాఠాలు చెప్పే మా లెక్చరర్ లక్ష్మీబాయి గారు రాశారు. ఈ పుస్తకంలో చివరిలో ఉన్న చిన్న వ్యాసం, 'ఏది హింస?' అన్నది నేను రాసినదే. ఆత్మరక్షణ కోసం ప్రజలు చేసే పోరాటాన్ని హింస అనకూడదనే వాదన ఉన్న ఈ వ్యాసానికి, ఎలాగోలా, అహింసావాదిగా పేరుపొందిన గాంధీని గుర్తు చెయ్యాలని, 'మోహన్ గాంధీ' అని ఆ వ్యాసకర్త పేరుగా పెట్టాను. 'ముందుమాట' కూడా నేనే రాశాను. దాన్నిండా, 'మహాప్రస్థానానికి' చలం గారు రాసిన ముందుమాటలో రాసిన మాటలే, భావాలే. ముందు అట్టమీద, జార్జి ఫోటో కింద, సందర్భానికి తగినట్టు ఉండాలని, శ్రీశ్రీ, తన మిత్రుడు 'కొంపెల్ల జనార్దనరావు' కోసం రాసిన, నివాళి కవితలో నించీ, కొన్ని మాటలు తీసి పెట్టాను. వెనక అట్టమీద, వరవరరావు గారు జార్జిరెడ్డి మీద, ఈ పుస్తకానికి అని కాకుండా, అంతకు ముందే రాసిన కవితని వేశాను.

ఇకపోతే, ప్రత్యేకంగా చెప్పవలసింది, ఈ పుస్తకంలో, ఇచ్చిన కొటేషన్ల గురించి. శ్రీశ్రీ, చలం గార్ల మాటల్ని ఇచ్చాను. అవి ఎక్కువగా ఇవ్వడానికి ముఖ్య కారణం, నేను బియ్యేలో ఉన్నప్పటి (1967–70) నించే, చలం గారి రచనల్లోనించీ, ఆయన కమ్యూనిజం గురించి అనుకూలంగానూ, అపార్థంగానూ చెప్పిన మాటల్ని, కొన్ని కాయితాల మీద రాసుకునే వాణ్ణి. కమ్యూనిజానికి సంబంధించిన పుస్తకాలేవీ అంతకు ముందు చదవకపోయినా, చలం గారి రచనల వల్లనే, 'కమ్యూనిజం' గొప్ప సిద్ధాంతం అనే అభిప్రాయం బియ్యేలోనే నాకు ఏర్పడింది. ఎంత గట్టిగా అంటే, కమ్యూనిజానికి వ్యతిరేకంగా, చలం గారు రాసిన మాటల్ని కూడా పట్టించుకోనంతగా, ఇష్టపడ్డాను. తర్వాత రోజుల్లో, చలం గారికి రాసిన ఉత్తరాల్లో, కమ్యూనిజం గురించీ, జార్జి రెడ్డి హత్య గురించీ, సాయుధ పోరాటం గురించీ, చాలా ప్రస్తావనలు వచ్చాయి. అవి చదివి, చలం గారు, 'ఇది వరకు నీ ఉత్తరాలలో, తెల్లగడ్డి పూలూ, కాంపస్ సౌందర్యమూ కనిపించేవి. ఈ మధ్య తెల్లగడ్డి పూలు పూయడం లేదా మీ కాంపస్‌లో? సాయుధ పోరాటం అంటున్నావు?' అనే రకంగా రాశారు, కొంత విమర్శతో.

○ బి.ఆర్. బాపూజీ

(ఏప్రిల్ 14: జార్జి రెడ్డి వర్ధంతి)

ట్రంప్ : మన కాలం పరాజితుడు!

నిఘంటువుల ప్రకారం 'టారిఫ్' (సుంకం) అనే పదం ఒక నామవాచకం. ఒక దేశంలోకి ఇతర దేశాల నుంచి వచ్చే సరుకులపై విధించే ఒక పన్ను. కొన్ని సమయాలలో ఎగుమతులపై కూడా ఒక పన్ను విధిస్తారు. చాలా అరుదుగా మాత్రమే 'టారిఫ్'ను ఒక క్రియగా ఉపయోగించడం జరుగుతుంది. అయితే ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ పుణ్యమా అని ఆ పదాన్ని క్రియగా ఉపయోగించడం అధికమయింది. కేవలం పెంగ్విన్ పక్షులు మాత్రమే ఉండే హేయర్డ్, మెక్ డోనాల్డ్ అనే దీవులతో సహా ప్రపంచ దేశాలు అన్నిటినీ ట్రంప్ మహాశయుడు దిగ్భ్రాంతికరంగా సుంకాలకు గురి చేశారు. పెంగ్విన్ పక్షులు అమెరికాకు ఎగుమతి చేసేవి ఏమి ఉంటాయని అవి ఉండే దీవులపై ట్రంప్ సుంకాలు విధించాడు? ప్రపంచ ప్రజలు నవ్వుకుంటున్న ట్రంప్ చర్య ఇది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు


అమెరికాకు దిగుమతి అయ్యే సరుకులపై కఠిన, భారీ సుంకాలు అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా రూపొందిస్తాయని (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఏప్రిల్ 2, 2025న సకల దేశాలపై విధించిన సుంకాల వివరాలను ట్రంప్ ప్రకటించారు. సుంకాలను ప్రకటిస్తున్న సమయంలో ఆయన ఒక పెద్ద చార్ట్‌ను చూపించారు. సుంకాల సూక్ష్మాలు వెర్రిబాగులవాళ్లకు కూడా అర్థమయ్యే విధంగా ఒక సరళ సూత్రం ప్రాతిపదికన ఆ సుంకాలను అంచనా కట్టి ఉంటారని స్పష్టమయింది. సదరు సూత్రం ఏదైనా దేశంతో అమెరికాకు ఉన్న వాణిజ్య లోటును లెక్కించారు. ఆ వాణిజ్య లోటును ఆ దేశం నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువుల మొత్తం విలువతో భాగించారు. ఆ వచ్చిన సంఖ్యను రెండుతో భాగించగా వచ్చిన ఫలితమే ట్రంప్ విధించిన సుంకం. కాగా కొన్ని దేశాల విషయంలో ఈ సరళ సూత్రాన్ని ఉపయోగించలేదు.

2024 అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలలో ఒక ప్రశ్నకు ఎనలేని ప్రాధాన్యం లభించింది: ఏడు స్వింగ్ స్టేట్స్‌నూ లేదా వాటిలో ఎక్కువ రాష్ట్రాలను ఎవరు గెలుచుకుంటారు? ఇవీ ఆ ఏడు రాష్ట్రాలు: అరిజోనా, జార్జియా, మిచిగాన్, నేవడా, ఉత్తర కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్. ఈ ఏడు రాష్ట్రాలనూ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ గెలుచుకున్నారు. తద్వారా 93 ఎలెక్టోరల్ ఓట్లను ఆయన స్వాయత్తం చేసుకున్నారు. ఈ ఏడు రాష్ట్రాలలో గెలుపు డోనాల్డ్ ట్రంప్ రెండో రాకడకు విశేషంగా దోహదం చేసింది. ఈ ఏడు రాష్ట్రాలకూ కొన్ని ఉమ్మడి లక్షణాలు ఉన్నాయి. అవి పారిశ్రామిక కార్యకలాపాలు చెప్పుకోదగిన స్థాయిలో లేకపోవడం, నిరుద్యోగిత భారీగా ఉండడం, ప్రజా చర్చలు అన్నీ ద్రవ్యోల్బణం వలసలు తదితర అంశాల పైనే జరగడం. ఈ ఏడు రాష్ట్రాలలోనూ తిరుగులేని విజయం సాధించిన ట్రంప్, ఆ రాష్ట్రాల ప్రజలను కలవర పెడుతున్న సమస్యలే సమస్త అమెరికా ప్రజలను చికాకు పరుస్తున్నాయని భావించారు. ఈ కారణంగా ఆయన ఆ సమస్యలను తొలగించేందుకు సంకల్పించారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధం ముగిసి ఎనభై సంవత్సరాలు గడిచి పోయాయి. ఈ ఎనిమిది దశాబ్దాలలో కార్మిక శ్రేణుల, సరుకుల, సేవల స్వేచ్ఛా గమనం వల్ల ప్రపంచం బాగా లబ్ధి పొందింది. ఇతోధికంగా ప్రయోజనం పొందిన దేశం నిస్సందేహంగా అమెరికాయే. అమెరికా మహా సంపన్న దేశం. మహాశక్తిమంతమైన దేశం. వైజ్ఞానిక, సాంకేతిక నవకల్పనలు అన్నీ ఆ దేశ ప్రతిభా ఫలాలే. ప్రపంచ అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ప్రయోగశాలలు, ఉత్కృష్ట కంపెనీలు అమెరికా లోనే ఉన్నాయి. అమెరికా డాలర్ రిజర్వ్ కరెన్సీగా ప్రపంచ దేశాల ఆమోదం పొందింది. అమెరికా గ్రీన్ కార్డ్, అమెరికా పాస్‌పోర్ట్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది ఆకాంక్షిస్తున్న డాక్యుమెంట్లు. చైనా, ఇండియాతో సహా అనేక దేశాలు తమ విదేశ మారక ద్రవ్య నిల్వలలో అత్యధిక భాగాన్ని అమెరికా బాండ్ల రూపంలో భద్రపరచుకుంటున్నాయి. ప్రపంచంలో ద్రవ్యలోటు లేని ఏకైక దేశం అమెరికాయే గనుక ఆ దేశ బాండ్లు తమకు ఆర్థిక భద్రత సమకూరుస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. దురదృష్టవశాత్తు ఈ ఉత్కృష్ట ఘనతలు ఏవీ తమ జీవితాలకు ఎలాంటి లబ్ధిని సమకూర్చడం లేదని ట్రంప్‌ను గెలిపించిన ఏడు రాష్ట్రాల ప్రజలు భావిస్తున్నారు. ట్రంప్ మహాశయుడు వాస్తవాలను ఉపేక్షించి అతన విజయానికి దోహదం చేసిన ఆ ఏడు రాష్ట్రాల ఓటర్లను విశ్వసించారు.

అమెరికా అధ్యక్షుడుగా రెండో సారి పదవీ ప్రమాణ స్వీకారం చేసిన తరువాత డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, చర్యలు సంచలనం కలిగిస్తున్నాయి. వాటి పర్యవసానాలు సుదీర్ఘకాలం అమెరికా సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నాయి. దేశదేశాల నుంచి ప్రతిభావంతుల వలసలు అమెరికాకు నిలిచిపోనప్పటికీ తగ్గుముఖం పడతాయి. సరుకుల వాణిజ్యానికి గణనీయమైన విఘాతం కలుగుతుంది. సరఫరా గొలుసుల అంతరాయాలు పెరుగుతాయి. సేవల వాణిజ్యానికి సైతం కనీసం తాత్కాలికంగా నష్టం వాటిల్లుతుంది పెట్టుబడుల ప్రవాహాలు కొత్త సుంకాలు, ప్రతి సుంకాలకు అనుగుణంగా సర్దుబాటు అయ్యేందుకు కొంత కాలం పడుతుంది.

ట్రంప్ విధానాల పర్యవసానాలను ఎదుర్కోవడంలో చాలా సంపన్న దేశాలు చాలా సంయమనంతో వ్యవహరిస్తున్నాయి. ట్రంప్ ఏవో భ్రమలతో దబాయిస్తున్నారని అందరికీ అర్థమవుతుంది. అమెరికాలోకి దిగుమతి అవుతున్న సరుకులపై భారీ సుంకాలతో సంభవించే ధరల పెరుగుదలను అమెరికా ప్రజలు భరించలేరు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. లక్షలాది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమున్నది. ఇటువంటి పరిస్థితులను అమెరికా ప్రజలు సహించరు. మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్‌ను విశ్వసిస్తున్న అమెరికన్లు కూడా ద్రవ్యోల్బణం తాకిడికి తీవ్రంగా గురవుతారు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా అన్ని పెద్ద నగరాలలోను వేలాది



ట్రంప్ సుంకాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఇండియా పరిస్థితి ఏమిటి? మాంద్యం, ద్రవ్యోల్బణం, ఎగుమతుల తగ్గుదల, తక్కువ ఎఫ్‌పిఐ, ఎఫ్‌డిఐ ఒకేసారి సంభవిస్తే వాటిల్లే హాని కంటే అధికంగా మన ఆర్థిక వ్యవస్థ అధ్వానమవుతుంది. అంతిమంగా అర్థ శాస్త్ర సూత్రాలు ట్రంప్ విధానాలను ఓడిస్తాయి. ఆ విజయోత్సవ వేళ, భారత్ పరాజితుడి పక్షాన నిలిచిందనే భావన ఎవరికీ కలగ కూడదు.

ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పెరిగినప్పుడు (ఇది ఖాయం) మరింత మంది ప్రజలు వీధుల్లోకి వెల్లువెత్తుతారు. అమెరికా ప్రజల ఆగ్రహావేశాలకు ట్రంప్ ఎలా ప్రతిస్పందించనున్నారు? తన విధానాల కొనసాగింపుపై వెనకడుగు వేస్తారు, సందేహం లేదు. ఏప్రిల్ 9న సుంకాల అమలును నిలిపివేసినట్టే ఇదీ జరుగుతుంది. కొన్ని అనూహ్య పరిణామాలు కూడా చోటు చేసుకునే అవకాశమున్నది మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ సిద్ధాంతాన్ని సమర్థిస్తున్న వారు సుంకాల పర్యవసానాలకు ఎలా ప్రతిస్పందిస్తారు, అమెరికా బాండ్లపై వడ్డీ రేట్ల తీరుతెన్నులను ఆయన తప్పక పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది.

సరే, ట్రంప్ సుంకాల దెబ్బను ముఖ్యమైన దేశాలు కొన్ని ఎలా ప్రతి స్పందిస్తున్నాయో చూద్దాం. కెనడా, యూరోప్ గట్టిగా నిలబడ్డాయి, దృఢంగా ప్రతిఘటిస్తున్నాయి. అదే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నాయి. అమెరికాపై భారీ సుంకాలు విధించేందుకు చైనా గట్టి పట్టుదలతో ఉన్నది. సుంకాల సమరాన్ని అమెరికా అనివార్యం చేస్తే, చైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. రాజీ లేని పోరుకు బీజింగ్ సమాయత్తమై ఉన్నది. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంపై భారత్ ఇంతవరకూ ఎటువంటి వ్యాఖ్య చేయలేదు. అమెరికాతో ఒక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. మంచిదే. అయితే ట్రంప్ ధాటికి ఇండియా హడలి పోతున్నదనే భావన ప్రపంచానికి కలిగించ కూడదు. మోదీ ప్రభుత్వం ఈ విషయమై జాగరూకతతో వ్యవహరించాలి. ట్రంప్ సుంకాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏమి సంభవించినా తాము కలత చెందమనే భావంతో ఉండి పోకూడదు. ట్రంప్ నిర్ణయాలు, చర్యలపై న్యూఢిల్లీ కచ్చితంగా ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాలి. యూరోపియన్ నాయకులు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, కెయిర్ స్టార్మెర్, కెనడా ప్రధానమంత్రి కార్నే తదితర నాయకులు అనుసరిస్తున్న విధానాలను స్ఫూర్తిగా తీసుకోవాలి. వారితో కలిసి నడవడం శ్రేయస్కరం.

ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో అందరూ సంతోషిస్తున్నారు. ఈ యుద్ధ విరామంతో, ఆయనను ఆర్థిక వివేకం ప్రభావితం చేయగలదనే ఆశాభావం ఎంతైనా కలుగుతోంది. అయితే ఈ 'నిలిపివేత'ను ఉపసంహరించి, ఏప్రిల్ 2న ప్రకటించిన సుంకాలను ట్రంప్ మళ్లీ విధిస్తే జరిగేదేమిటి? ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తలకిందులు అవుతుంది, సందేహం లేదు. ట్రంప్ విధానాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక మాంద్యం ముంచుకు వస్తోందని కూడా పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇండియా పరిస్థితి ఏమిటి? మాంద్యం, ద్రవ్యోల్బణం, ఎగుమతుల తగ్గుదల, తక్కువ ఎస్‌పిఐ (విదేశీ ప్రైవేట్ పెట్టుబడులు), తక్కువ ఎఫ్‌డిఐ (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) ఒకేసారి సంభవిస్తే వాటిల్లే హాని కంటే కూడా మన ఆర్థిక వ్యవస్థ అధ్వానమవుతుంది. భారత్ తన మిత్ర దేశాలను ఎంపిక చేసుకోవాలి. వాటితో వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవాలి అంతిమంగా అర్థ శాస్త్ర సూత్రాలు ట్రంప్ విధానాలను ఓడిస్తాయి. ఆ విజయోత్సవ వేళ, భారత్ పరాజితుడి పక్షాన నిలిచిందనే భావన ఎవరికీ కలగ కూడదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

చైతన్యఝరి 'ఓయూ'పై ఆంక్షలొద్దు!

ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అన్ని రకాల ఆందోళనలను నిషేధించిన అధికారులు, ఆ చర్యకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలను ఏమాత్రం పరిగణన లోకి తీసుకోకుండా, మరొక్క అడుగు ముందుకు వేసి, ఇకముందు కాంపస్ పరిధిలో నిర్వహించ తలపెట్టిన సదస్సులకు అతిథులుగా ఆహ్వానం అందుకునే వారి విషయంలోను, ఆ కార్యక్రమ సమయపాలన విషయం లోను, వాటి పత్రికా ప్రకటనలపై పోస్టర్లపై ముద్రించే పేర్ల విషయంలోను కొన్ని అసంబద్ధమైన ఆంక్షలు విధించడం దురదృష్టం.

ఉస్మానియా యూనివర్శిటీ భారత విద్యా, రాజకీయ చరిత్రలో చెరగని ముద్రవేసిన విద్యా వ్యవస్థ. ఇక్కడి విద్యార్థి ఉద్యమాలు, మేధో చర్చలు ఎందరో నాయకుల ఆవిర్భావానికి దారితీశాయి. ఇక్కడ నుండి ఉద్భవించిన విద్యార్థి నాయకులు నాయకత్వంలో లెక్కలేనన్ని విద్యార్థి ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం తొలి, మలి దశల్లో ఓయూ కీలక పాత్ర పోషించింది.

ఆర్ట్స్ కళాశాలలోని 57 నంబర్ గదికి ఓయూ చరిత్రలో ఓ ప్రత్యేక అధ్యాయం ఉంటుంది. ఎందరో రచయితలు, కవులు, సామాజిక-సాంస్కృతిక మేధావులు విద్యార్థులతో అనుభవాలను పంచుకుని మమేకమయ్యారు. వివిధ సిద్ధాంతాలలో నిష్ణాతులైన మేధావుల ఉపన్యాసాలకు, తదనంతర మేధో చర్చలకు కేంద్రంగా పేరుగాంచింది ఈ గది. ప్రముఖ విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు, తత్త్వవేత్తలు, ఆలోచనాపరులు, భాషావేత్తలు తదితరులు తమ సిద్ధాంతాలను -ధోరణులను ఎలాంటి ఆంక్షలూ లేకుండా విద్యార్థులతో పంచుకున్నారు. పీవీ నరసింహారావు, కుష్వంత్ సింగ్, జార్జ్ ఫెర్నాండెజ్, రామ్ మనోహర్ లోహియా వంటి మహనీయులు వారిలో కొందరు. 57 నంబర్ గది కేవలం తరగతి గది మాత్రమే కాదు; అది సామాజిక రాజకీయ అంశాలకు, సాహిత్యానికి, తాత్విక చర్చలకు వేదికగా మారిన ఫోరం. ఇక్కడ జరిగిన చర్చలు, చైతన్య ప్రసంగాలు విద్యార్థుల్లో కొత్త దిశలను మలిచాయి.

1960ల మధ్యకాలంలో న్యూ సైన్స్ కళాశాలలో బీఎస్సీ, 1970ల ప్రారంభంలో ఓయూ క్యాంపస్‌లో లైబ్రరీ సైన్స్ చదివేటప్పుడు నేను తరచుగా ఓయూ బి-హాస్టల్‌కు వెళ్ళేవాడిని. ఈ హాస్టల్ గురించి నెహ్రూ ఒకప్పుడు ఎంతో ఆసక్తికరంగా ప్రస్తావించారు. విద్యార్థుల ఉత్సాహాన్ని అభినందిస్తూ, భవిష్యత్ భారత నాయకులు ఇక్కడ నుంచే తయారవుతారని చెప్పారు. బి-హాస్టల్‌ను బ్రిటన్‌లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌తో పోల్చారు. ఓయూ ఎ-హాస్టల్ కూడా సామాజిక-రాజకీయ చర్చలకు కీలక వేదికగా నిలిచింది. తొలి, మలి దశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలతో పాటు, జాతీయ స్థాయిలో జరిగిన అనేక ఉద్యమాల్లో ఇక్కడి విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థి నాయకత్వం, ఉద్యమాలు, ప్రగతిశీల ఆలోచనల కేంద్రంగా మారిన ఈ హాస్టల్ ప్రాంతీయ, జాతీయ రాజకీయాలపై దీర్ఘకాల ప్రభావం చూపింది. ఈ రెండు హాస్టళ్లలో వెల్లువెత్తిన వామపక్ష, అతివాద, మితవాద, మధ్యేవాద రాజకీయ సిద్ధాంతాలు విద్యార్థి సంఘాల ఎన్నికలను ప్రభావితం చేశాయి.

విశ్వవిద్యాలయ విద్యార్థి రాజకీయాలు సిద్ధాంతాల ప్రాతిపదికగా, మేధోపరంగా తీవ్రంగా సాగేవి. వామపక్ష కమ్యూనిస్టు (ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ) విద్యార్థి సంఘాలు సమాజవాద సిద్ధాంతాలతో అనుసంధానమై సామాజిక న్యాయం, విద్యార్థి హక్కులు, సామ్రాజ్యవాద వ్యతిరేకత వంటి అంశాలను ముందుకు తెచ్చేవి. మరోవైపు ఏబీవీపీ (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్) అనుబంధ మితవాద విద్యార్థి సంఘం జాతీయవాదం, సాంస్కృతిక పరంపర తదితర విలువలకు మద్దతుగా ఉండేది. విద్యార్థి సంఘాల ఎన్నికలు తరచుగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ – ఏబీవీపీ మధ్య తీవ్ర పోటీతో సాగేవి. ఇవి కేవలం క్యాంపస్ పరిధిలో మాత్రమే కాకుండా, దేశ వ్యాప్తంగా ఉన్న రాజకీయ పోరాటాల ప్రతిబింబంగా ఉండేవి.

ఓయూలో ప్రతిభావంతమైన విద్యార్థి నాయకుడిగా వెలుగొందిన ఎస్. జైపాల్ రెడ్డి సూక్ష్మ రాజకీయ అవగాహన, ఆకర్షణీయమైన ప్రసంగశైలి ద్వారా విద్యార్థి రాజకీయాల్లో గొప్ప శక్తిగా మారాడు. ఆ తర్వాత భారత రాజకీయాల్లో అగ్రస్థాయికి ఎదిగి కేంద్ర మంత్రిగా, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పునాదుల పరిరక్షకుడిగా గుర్తింపు పొందాడు. కె. కేశవరావు ఇక్కడి నుంచే మరో ప్రభావశీల విద్యార్థి నాయకుడిగా వెలుగొందాడు. ఆయన రాజకీయ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు విద్యార్థి దశలోనే స్పష్టమయ్యాయి. సామాజిక, రాజకీయ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన, భారత జాతీయ కాంగ్రెస్‌లో కీలక వ్యూహకర్తగా ఎదిగి, అనంతరం బీఆర్ఎస్‌లో ముఖ్య నేతగా మారాడు. రాజ్యసభ సభ్యుడిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించాడు. ఓయూ విద్యార్థి ఉద్యమస్ఫూర్తి, మేధోసామర్థ్యం రాజకీయాల్లో ఎలా ప్రభావం చూపిస్తుందో వీరి ఎదుగుదల స్పష్టంగా చూపిస్తోంది.



మేధో చర్చలు, రాజకీయ వాదనలు, న్యాయ సంరక్షణకు జరిపిన పోరాటాలు కాలాన్ని దాటి తరతరాలకు గుర్తుండే వారసత్వంగా మారతాయి. వాటిని హ్రస్వ దృష్టితో వీక్షించవద్దు. అలా చేస్తే సమాజం నష్టపోతుంది. ఉస్మానియాలో విద్యార్థి హక్కులను అణచివేసే నేటి ప్రయత్నాలు మాని, చరిత్ర నుంచి పాఠాలను నేర్చుకోవాలి.

ఇక జార్జ్ రెడ్డి ఉస్మానియా యూనివర్శిటీ విప్లవాత్మక చరిత్రలో ఒక సువర్ణాక్షరం. సామాజిక న్యాయంపై ప్రగాఢమైన నమ్మకంతో ఆయన విద్యార్థులను సాధికారత వైపుగా, అసమానతలు, కుల వివక్షలకు వ్యతిరేకంగా ఐక్యం చేశారు. అయితే, ఆయన విప్లవ భావజాలం, విద్యార్థుల్లో పెరిగిన ఆదరణ మితవాద విద్యార్థి సంఘాలకు నచ్చలేదు. ఈ నేపథ్యంలో, 1972 ఏప్రిల్ 14న ఓయూ క్యాంపస్‌లో ఆయన దారుణ హత్యకు గురయ్యాడు. మరో మేధావి నేతగా నిలిచిన పూటుకూరి వరప్రసాద్ ఒకప్పటి ఆర్ట్స్ కాలేజ్ అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. యువజన నాయకత్వం ఎదుగుదలలో విశేషంగా దోహదపడ్డారు. 86 ఏళ్ల వయసులో ఆధ్యాత్మికవేత్తగా శేషజీవితాన్ని నిరాడంబరంగా గడుపుతున్నారు.

ఓయూ రూపొందించిన గౌరవనీయ వ్యక్తుల్లో ప్రొఫెసర్ జి. హరగోపాల్, ప్రొఫెసర్ రాఘవేంద్రరావు, వాసిరెడ్డి శివలింగ ప్రసాద్, డాక్టర్ ఎం. శ్రీధర్ రెడ్డి తదితరులు తమ రంగాల్లో విశేష కృషి చేశారు. ముఖ్యంగా హరగోపాల్ నిస్వార్థ నాయకత్వంతో, నిబద్ధతతో పౌరహక్కుల ఉద్యమంలో ఎంతో ఎత్తుకు ఎదిగారు. ప్రొఫెసర్ రాఘవేంద్రరావు సామాజిక శాస్త్రాలలో విశేష ప్రతిభ కలిగిన మేధావిగా (విద్యార్థిగా–అధ్యాపకుడిగా) విశ్వవిద్యాలయంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించారు. ప్రొఫెసర్ వి.ఎస్ ప్రసాద్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ పీహెచ్‌డీ పూర్తిచేసి సమాజ శాస్త్రవేత్తగా తన విద్యాజీవితం ప్రారంభించారు. నాలుగు దశాబ్దాలకు పైగా విద్యారంగంలో వివిధ హోదాల్లో సేవలందించారు. ప్రొఫెసర్‌గా, విద్యా పరిపాలనాధికారిగా, చివరికి వైస్ ఛాన్సలర్ హోదాలో ఆయన విద్యా వ్యవస్థకు విశేషంగా తోడ్పడ్డారు. తెలంగాణ చరిత్రలో ఓ కీలక సమయంలో డాక్టర్ ఎం. శ్రీధర్ రెడ్డి ఆశాజ్యోతిగా నిలిచారు. ఓయూలో విద్యార్థి నాయకుడిగా, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తొలి దశకు నాంది పలికిన ఘనత ఆయన సొంతం. ఓయూ ఎ-హాస్టల్ నుంచి ఆందోళన జ్వాలలు రేగినప్పుడు, ఆయన ఉద్యమాన్ని ముందుండి నడిపారు. అదే సమయంలో, ఓయూ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఉన్న మల్లికార్జున్ కూడా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తర్వాత ఆయన కేంద్ర మంత్రిగా ఎదిగారు.

విద్యార్థి రాజకీయాలు, నిరసన కార్యక్రమాలు, వాదప్రతివాదాలు నేటి యువతకు, భవిష్యత్ యువతకు అమూల్యమైన పాఠాలను అందిస్తాయి. ఓయూలో ఈ తరతరాల చరిత్ర వ్యక్తిగత, సామాజిక, మేధో విప్లవాలుగా మారిన తీరు స్పష్టమైన సందేశాన్ని అందిస్తోంది. మేధో చర్చలు, రాజకీయ వాదనలు, న్యాయ సంరక్షణకు జరిపిన పోరాటాలు కాలాన్ని దాటి తరతరాలకు గుర్తుండే వారసత్వంగా మారతాయి. వాటిని హ్రస్వ దృష్టితో వీక్షించవద్దు. అలా చేస్తే సమాజం నష్టపోతుంది. ఉస్మానియాలో విద్యార్థి హక్కులను అణచివేసే నేటి ప్రయత్నాలు మాని, చరిత్ర నుంచి పాఠాలను నేర్చుకోవాలి.

■ వనం జ్వాలానరసింహారావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.7 కనిష్ఠం 23.3



ధగధగలాడుతున్న తాడ్‌బండ్ ఆలయం

శోభాయమానం

హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి. ఆలయాల్లో నేడు ప్రత్యేక పూజలు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లోనూ శనివారం వీర హనుమాన్ శోభాయాత్రలు జరగనున్నాయి.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్.

పరిపూర్ణమైన వ్యక్తులంటూ ఎవరూ ఉండరు..

- నేనూ డిస్లెక్సియాతో బాధపడ్డా..
- అమ్మ సహకారంతోనే సమస్యను అధిగవిఎంచా..
- నోట్లో రాళ్లు పెట్టుకుని మరీ మాట్లాడేందుకు ప్రయత్నించా
- యంగ్ ఫిక్కీ లేడీస్ సదస్సులో నటుడు బొమన్ ఇరానీ



పల్లవి, బొమన్ ఇరానీ

8



కఠోర కసరత్తు

మైదానంలో సన్‌రైజర్స్ టీం కసరత్తు

ఉప్పల్ స్టేడియంలో ఈ సీజన్ నాలుగో ఐపీఎల్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. శనివారం పంజాబ్ కింగ్స్‌తో స్థానిక జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో ఇరు జట్లు కఠోరంగా సాధన చేశాయి.

పెట్టుబడుల పేరుతో మోసం ఇద్దరు నేరగాళ్ల అరెస్టు

ఒకరిపై దేశవ్యాప్తంగా 88 కేసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్‌లో అధిక లాభాల పేరుతో దేశవ్యాప్తంగా కోట్లు కొల్లగొడుతున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వేర్వేరు కేసుల్లో నిందితులైన వీరిలో ఒకరు ఢిల్లీకి చెందిన సైబర్ క్రిమినల్ కాగా, మరొకరు తెలంగాణకు చెందిన వ్యక్తి కావడం గమనార్హం. సైబర్ క్రైమ్ డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన వ్యక్తి తనకు తెలిసిన స్నేహితుడి ద్వారా కోస్టల్ వెల్ గ్రీన్ అనే వెబ్‌సైట్ లింకు రావడంతో దాన్ని క్లిక్ చేశాడు. ఆ తర్వాత కొంతమంది వ్యక్తులు లైన్‌లోకి వచ్చి పలు సంస్థల్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. ప్రారంభంలో మంచి లాభాలు వచ్చినట్లు చూపించి వాటిని విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. ఆ తర్వాత రూ.6.16 లక్షలు పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించి విత్‌డ్రా ఆప్షన్ క్లోజ్ చేశారు. ఇదేంటని అడిగితే మరింత ఎక్కువ పెట్టుబడి పెట్టాలని కండీషన్ పెట్టారు. ఇదేదో మోసమని భావించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఢిల్లీకి చెందిన సైబర్ ముఠా ఈ మోసానికి పాల్పడినట్లు టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా పోలీసులు గుర్తించారు. ప్రత్యేక టీమ్ అక్కడకు వెళ్లి నీజర్ అనే నిందితున్ని అదుపులోకి తీసుకుంది. అతడి వద్ద ఒక ల్యాప్‌టాప్, ఆరు మొబైల్స్, 26 చెక్‌బుక్‌లు, 3 పాస్‌బుక్‌లు, 6 డెబిట్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నీరజ్‌పై దేశవ్యాప్తంగా 88 సైబర్ క్రైమ్ కేసులు, తెలంగాణలో ఏడు కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.



నిందితులు నీరజ్, ఉమామహేశ్వర్

మరో కేసులో..

మరో సైబర్ మోసం కేసులో సదాశివపేటకు చెందిన దర్శి ఉమామహేశ్వర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గతేడాది జూలైలో నగరానికి చెందిన వ్యాపారిని బురిడీ కొట్టించి రూ.10.5 లక్షలు పెట్టుబడి పెట్టించి మోసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఉమామహేశ్వర్‌ను అరెస్టు చేశారు. వాట్సాప్, టెలీగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను అడ్డాగా చేసుకొని ఇలాంటి సైబర్ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

బిడ్‌లు లెస్.. క్వాలిటీ తుస్!

25 నుంచి 40 శాతం తక్కువకు టెండర్లు


- బీటీ, సీసీ రోడ్ల పనులకు 30 శాతానికి పైగా..
- నాలాల పూడికతీత మరీ ఘోరం
- జీహెచ్‌ఎంసీలో వింత పరిస్థితి
- నిర్మాణ పనుల్లో ఆ ప్రభావం
- నియంత్రణలో 'క్వాలిటీ' కంట్రోల్ విభాగం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ పరిధిలోని ఓ సర్కిల్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.39 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించగా.. రూ.28.82 లక్షలు (26.10) శాతం తక్కువకు బిడ్ దాఖలు చేసిన సంస్థను ఎంపిక చేశారు. చార్మినార్ జోన్ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.45 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలవగా 32 శాతం తక్కువకు బిడ్ దాఖలు చేసి ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. నాలాల పూడికతీత పనులకు అంచనా వ్యయం కంటే ఏకంగా 35 శాతం నుంచి 40 శాతం తక్కువకు బిడ్‌లు దాఖలవుతున్నాయి. ఎందుకిలా? అంచనా వ్యయంతో పోలిస్తే 25శాతం నుంచి 40 శాతం తక్కువకు బిడ్‌ల దాఖలుకు కారణమేంటి? ఇంజనీరింగ్ అధికారుల ప్రతిపాదనల్లో లోపమా? పనులు ఎలా చేసినా చెల్లుబాటవుతుంది.. నాణ్యత పరీక్షించేదెవరు? అని కాంట్రాక్టర్ల దీమానా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మొత్తంగా గ్రేటర్‌లోని ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ విభాగం చేపడుతోన్న కొన్ని పనులు వివాదాస్పదంగా మారుతున్నాయి. నాణ్యత, మన్నికకు తావు లేకుండా కొన్ని కాంట్రాక్ట్ ఏజెన్సీలు ఇష్టానికి పని చేస్తుండగా, కొందరు

మిగతా 6వ పేజీలో..



చార్మినార్ జోన్ పరిధిలో ఇటీవల వేసిన సీసీ రోడ్డు పరిస్థితి



ఓ సర్కిల్‌లో 26.10% తక్కువకు దాఖలైన బిడ్

25 నుంచి 45 శాతం వరకు..

బీటీ, సీసీ రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, నాలాల పూడికతీత.. ఇలా ఏ పనైనా స్టాండ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) ప్రకారం ఇంజనీర్లు ప్రతిపాదనలు రూపొందిస్తారు. పనుల విలువను బట్టి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (ఏఈఈ) రూపొందించే ప్రతిపాదనలను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ), చీఫ్ ఇంజనీర్ (సీఈ) స్థాయి అధికారులు పరిశీలిస్తారు. వారి ఆమోదం తర్వాతే టెండర్ నోటిఫికేషన్ ప్రకటిస్తారు. సీసీ, బీటీ రోడ్లకు సంబంధించి మెజార్టీ పనులకు 20 నుంచి 32 శాతం వరకు, కొన్ని సర్కిళ్లలో అంతకంటే ఎక్కువ లెస్‌కు బిడ్‌లు దాఖలవుతున్నాయి. నాలాల పూడికతీత పనుల్లో మరీ ఘోరం. గరిష్ఠంగా 40 శాతం కూడా తక్కువకు కోట్ చేసిన దాఖలాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అంచనా వ్యయంలో దాదాపు సగం మొత్తానికి పనులు చేసేందుకు కాంట్రాక్ట్ ఏజెన్సీలు ముందుకు వస్తుండడం గమనార్హం. అలాంటి పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. చార్మినార్ జోన్‌లోని పాత ఎంసీహెచ్ కార్యాలయం ముందు కొన్నాళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు అధ్వానంగా మారింది. ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లలో నిర్మించిన ఫుట్‌పాత్‌లు మూన్నాళ్లకే అధ్వానంగా మారి పాదచారులు నడిచే పరిస్థితి లేదు. సాధారణంగానే బీటీ రహదారులు నిర్మించిన మూన్నాళ్లకే పాడవుతాయి. ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లదీ అదే దుస్థితి.

విద్యుత్ డిమాండ్‌పై అప్రమత్తం

- సిబ్బందికి ఉన్నతాధికారుల ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమ్మర్‌లో పెరిగే విద్యుత్ డిమాండ్‌పై క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఏప్రిల్, మే నెలల్లో 24 గంటలు విధుల్లో ఉండాలని అధికారులకు చీఫ్ ఇంజనీర్లు (సీఈ)లు, సర్కిళ్ల ఎస్ఈలు ఆదేశాలు జారీ చేశారు. గ్రేటర్ పరిధిలోని మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలోని 10 సర్కిళ్ల ఎస్ఈలు సీఎండీ ఆదేశాలతో క్షేత్రస్థాయి పరిస్థితులపై శనివారం సమీక్షలు నిర్వహించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే నిమిషాల్లో సంఘటనా స్థలానికి ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది చేరుకోవాలని, ప్రతి ఫోన్‌కూ స్పందించాలని సిబ్బందిని ఆదేశించారు. డివిజన్లలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించే సమయంలో డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు ఆ సమాచారం వెంటనే ఉన్నతాధికారులకు చేరవేయాలని అన్నారు.

చదివింది బీఎస్సీ.. చేసేది స్మగ్లింగ్

- స్నేహితుడితో కలిసి హాషిష్ ఆయిల్ రవాణా
- అనకాపల్లికి చెందిన ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు
- రూ.80 లక్షల విలువైన ఆయిల్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న హాషిష్ ఆయిల్‌ను చూపుతున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ రమణారెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీఎస్సీ చదివిన యువకుడు ఈజీ మనీకి అలవాటుపడి గంజాయి స్మగ్లర్‌గా మారాడు. స్నేహితుడితో కలిసి ముఠాగా ఏర్పడి హైదరాబాద్ సహా పలు ప్రాంతాలకు హాషిష్ ఆయిల్ (గంజాయి నూనె) సరఫరా చేస్తున్నాడు. చివరకు రాచకొండ పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. భువనగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని అనంతారం సర్వీసు రోడ్డులో ఇద్దరు వ్యక్తులు కాలేజీ బ్యాగులు వేసుకొని అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు ఎస్‌వోటీ మల్కాజిగిరి టీమ్‌కు సమాచారం అందింది. భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఎస్‌వోటీ రమణారెడ్డి, అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ అంజయ్య పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి టీమ్ వారిపై నిఘా పెట్టింది. భువనగిరి రూరల్ పోలీసులతో కలిసి సంయుక్తగా దాడి చేసి ఇద్దరు నిందితులను పట్టుకుంది. వారి నుంచి రూ.80 లక్షల విలువైన నాలుగు కేజీల హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుంది. ఒక్క కేజీ హాషిష్ ఆయిల్‌ను తయారు చేయాలంటే సుమారు 50 కేజీల గంజాయిని మరపట్టాల్సి ఉంటుందని, 200 కేజీల గంజాయిని మరపట్టి 4 కేజీల హాషిష్ ఆయిల్‌ను తయారు చేశారని సీపీ వెల్లడించారు. నిందితులిద్దరు అనకాపల్లి నర్సీపట్నానికి చెందిన పేట్ల శేఖర్, అనిమిరెడ్డి దుర్గారావుగా నిర్ధారించారు.

ఉన్నత చదువు చదివి..

పేట్ల శేఖర్ నర్సీపట్నంలో బీఎస్సీ కెమెస్ట్రీ పూర్తి చేశాడు. ఉద్యోగం చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో అతనికి స్థానికంగా గంజా దుర్గ అనే యువకునితో పరిచయం ఏర్పడింది. అతను హైదరాబాద్‌తో పాటు నగర చుట్టపక్కల శివారు ప్రాంతాలకు గంజాయి, హాషిష్ ఆయిల్‌ను సరఫరా చేస్తూ డబ్బులు సంపాదిస్తాడు. శేఖర్ అతనితో చేతులు కలిసి గంజాయి స్మగ్లర్‌గా మారాడు. ఈ నేపథ్యంలో అతని చిన్ననాటి స్నేహితుడైన దుర్గారావుకు విషయం చెప్పి తన ముఠాలో చేర్చుకున్నాడు. స్నేహితులిద్దరూ కలిసి గంజా దుర్గ వద్ద హాషిష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి హైదరాబాద్, శివారు ప్రాంతాల వినియోగదారులకు సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. కొంతకాలంగా కాలేజీ బ్యాగుల్లో హాషిష్ ఆయిల్‌ను పెట్టుకొని, రైలు మార్గంలో హైదరాబాద్‌కు చేరుకుని విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులిద్దరినీ భువనగిరి రూరల్ పోలీసులు రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న గంజా దుర్గను త్వరలోనే పట్టుకుంటామని సీపీ తెలిపారు.



పట్టాలు పొందిన వైద్య విద్యార్థులతో దామోదర రాజ నర్సింహ

వైద్య వృత్తి భిన్నమైనది

- సామాజిక దృక్పథంతో సేవలందించాలి
- ఉస్మానియా వైద్య కళాశాల స్నాతకోత్సవంలో దామోదర

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ఇతర రంగాలతో పోలిస్తే వైద్య వృత్తి భిన్నమైనదని, మరొకరి ప్రాణాలు కాపాడే అవకాశం వైద్యులకు మాత్రమే దక్కుతుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన స్నాతకోత్సవంలో వైద్య విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఆయన పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉస్మానియా కాలేజీ, ఆస్పత్రికి ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరుందని, కోట్లాది మంది నిరుపేదలకు ఆస్పత్రి ఆశాదీపం అన్నారు. ఇక్కడ చదివిన ఎంతోమంది ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ ఆస్పత్రులను లీడ్ చేస్తున్నారని చెప్పారు. పట్టాలు పొందిన విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

నల్లాలకు బిగించిన మోటర్లు సీజ్

పలు ప్రాంతాల్లో విజిలెన్స్ తనిఖీలు



శాలివాహన నగర్‌లో మోటరును స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లాలకు మోటర్లను బిగించడంపై వాటర్‌బోర్డు విజిలెన్స్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. శుక్రవారం నగరంలోని మూసారాంబాగ్ సెక్షన్ పరిధి శాలివాహన నగర్ రోడ్‌లో నీటి సరఫరా సమయంలో తనిఖీలు నిర్వహించారు. రోడ్డు నంబర్ 12, 13, 14 ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. నల్లా పైపులైనుకు నేరుగా మోటార్లు బిగించి నీటిని అక్రమంగా తోడుతున్న వినియోగదారులను గుర్తించారు. వారికి చెందిన 8 మోటర్లను స్వాధీనం చేసుకున్నారు. మోటర్ల వినియోగం వల్ల పలు ప్రాంతాల్లోని వినియోగదారులకు లో ప్రెషర్‌తో నీటి సరఫరా అవుతున్న నేపథ్యంలో విజిలెన్స్ బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 15వ తేదీ నుంచి వాటర్‌బోర్డు క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారులు కూడా రంగంలోకి దిగనున్నారు. ఎవరైనా వినియోగదారులు ఇలా తమ నల్లాలకు మోటార్లు బిగించి పట్టుబడితే.. వారిపై వాటర్‌బోర్డు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు మోటార్లు సీజ్ చేస్తారు. రెండోసారి మోటార్లు బిగిస్తే రూ.5వేలు జరిమానా విధించి కేసులు నమోదు చేస్తారు. వినియోగదారులెవరూ నల్లాకు మోటార్లు బిగించొద్దని వాటర్‌బోర్డు విజ్ఞప్తి చేస్తోంది. లో ప్రెషర్ సమస్యలు తలెత్తితే దగ్గరలోని సంబంధిత బోర్డు మేనేజర్, డీజీఎం, జీఎం అధికారులను సంప్రదించాలని, లేకుంటే కస్టమర్ కేర్ నంబరు 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ కరెన్సీ కట్టలు

బంగారానికి ఫేక్ కరెన్సీ

- వ్యాపారులకు కుచ్చుటోపీ
- ఇద్దరు అంతర్రాష్ట్ర మోసగాళ్ల అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీని అంటగట్టి బంగారంతో ఉడాయిస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ఆట కట్టించారు సీసీఎస్ పోలీసులు. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు క్రిమినళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.60 లక్షల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన ఇంద్రజిత్ అలియాస్ విరాట్, మంగీలాల్ ఇద్దరూ దృష్టి మళ్లించి మోసాలు చేయడంలో ఆరితేరిన నిందితులు. వ్యాపారులను లక్ష్యంగా చేసుకుంటున్న ఇద్దరూ ముందుగా ఆర్డర్‌పై బంగారు ఆభరణాలు చేయిస్తారు. డబ్బులు చెల్లించే క్రమంలో ఒరిజినల్ కరెన్సీతో పాటు, ఎక్కువ మొత్తంలో నకిలీ కరెన్సీని అంటగట్టి బంగారంతో ఉడాయిస్తారు. ఇటీవల

మిగతా 6వ పేజీలో..

సమష్టి కృషితోనే రికార్డు

- ఆస్తిపన్ను వసూళ్లపై సిబ్బందికి ఇలంబరిది అభినందనలు



కమిషనర్ నుంచి జ్ఞాపికలు అందుకుంటున్న సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, చీఫ్ వాల్యూయేషన్ ఆఫీసర్ కులకర్ణి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే పూర్వ ఎంసీహెచ్, ప్రస్తుత జీహెచ్‌ఎంసీ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయి ఆస్తి పన్ను వసూలైందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరిది అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,038 కోట్ల పన్ను వసూలైన నేపథ్యంలో శుక్రవారం బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఇలంబరిది మాట్లాడుతూ ఎంత ఎక్కువగా పన్ను వసూలైతే పౌర సేవలు, నగర అభివృద్ధి అంత అధికంగా జరిగే అవకాశముంటుందన్నారు. వన్ టైం స్కీమ్ (ఓటీఎస్)తో దీర్ఘకాలిక బకాయిలు వసూలయ్యాయని తెలిపారు. 2023-24తో పోలిస్తే 2024-25లో రూ.121 కోట్లు అదనంగా పన్ను వసూలైందని, ఎస్టేట్ విభాగం నుంచీ ఈ ఏడాది ఆదాయం పెరగడం శుభ సూచక అని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.3 వేల కోట్ల పన్ను వసూలు లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆస్తి యావతో కుమార్తెను చంపిన సవతి తల్లి

- మరో ఇద్దరి సహకారంతో గొయ్యితీసి పూడ్చివేత
- 2నెలల తర్వాత వెలుగులోకి ఘోరం



మహేశ్వరి(ఫైల్)

8

45 రోజుల్లో 1,060 ఫోన్లు స్వాధీనం

- బాధితులకు అందజేసిన సైబరాబాద్ పోలీసులు

6

చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

6

చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్


ఇన్‌స్పెక్టర్ రాజు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజును సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో చార్మినార్ డీఐగా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మమురళిని చాదర్‌ఘాట్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఇన్‌స్పెక్టర్ రాజు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, పోలీసు కస్టడీలో ఉన్న బైక్ చోరీ అయినా గుర్తించకపోవడం, ఓ కేసు విషయంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. అంతర్గత విచారణకు ఆదేశించిన సీపీ.. ఇన్‌స్పెక్టర్‌పై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెన్షన్ వేటు వేశారు.


బాధితులకు ఫోన్‌లు అందజేస్తున్న డీసీపీ ఎల్.సి. నాయక్

45 రోజుల్లో 1,060 ఫోన్లు స్వాధీనం

● బాధితులకు అందజేసిన సైబరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): చోరీ అయిన, పోయిన 1,060 ఫోన్‌లను సైబరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 3.18 కోట్లు ఉంటుందన్నారు. బాధితులకు శుక్రవారం ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ క్రైమ్స్ ఎల్.సి. నాయక్ మాట్లాడుతూ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్)పోర్టల్ ద్వారా 45 రోజుల్లో ఆరు దశల్లో 1,060 ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఫోన్‌లు పోగొట్టుకున్న వారు సమీపంలోని పోలీస్‌స్టేషన్ లేదా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. సీసీఎస్ మాదాపూర్ పోలీసులు 245, సీసీఎస్ బాలానగర్ 225, సీసీఎస్ మేడ్చల్ 200, సీసీఎస్ రాజేంద్రనగర్ 205, సీసీఎస్ శంషాబాద్ పోలీసులు 185 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారని డీసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీఎస్ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, మాదాపూర్, రాజేంద్రనగర్, శంషాబాద్, బాలానగర్, మేడ్చల్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, ప్రశాంత్, పవన్, రాజు, దాలినాయుడు, సోషల్‌మీడియా ఎస్ఐ శశిధర్ తదితరులు పాల్గొన్నారు. పోయిన ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకొని తమకు అప్పగించడంపై పలువురు బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

మోసం చేయొద్దు.. విశ్వాసంతో పనిచేయండి

● ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు జేఎన్‌టీయూ వీసీ పిలుపు
● అనుబంధ ప్రక్రియపై ఇంటరాక్షన్


సమావేశంలో మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ టీకేకే రెడ్డి, వేదికపై రెక్టార్, రిజిస్ట్రార్, డైరెక్టర్లు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): "విద్యా వ్యవస్థను మోసం చేయొద్దు.. విశ్వాసంతో కలిసి పనిచేసేలా ముందుకు రండి" అని జేఎన్‌టీయూ ఉపకులపతి డాక్టర్ కిషన్‌కుమార్ రెడ్డి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు పిలుపునిచ్చారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ప్రైవేటు కళాశాలలు అనుసరించాల్సిన అఫిలియేషన్ విధానాలపై శుక్రవారం జేఎన్‌టీయూలో ఇంటరాక్షన్ సమావేశం నిర్వహించారు. వీసీ కిషన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు కళాశాలల యాజామాన్యాలు.. అనుబంధ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా జేఎన్‌టీయూ అధికారులకు సహకరించాలని సూచించారు.

అన్యాయంగా వ్యవహరిస్తే చర్యలు

అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీలు ఇస్తున్న ఫలితాల్లో అన్యాయమైన పద్ధతులు కనిపిస్తున్నాయని, పద్ధతులు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వీసీ హెచ్చరించారు. విద్యార్థులకు వస్తున్న డిస్టింక్షన్‌ల సంఖ్యలో 25% వరకు వ్యత్యాసాలు ఉన్నందునే కొన్ని కాలేజీల ఫలితాలను తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. త్వరలోనే ఆయా కాలేజీలతో సంప్రదింపులు జరిపి సరైన ఫలితాలు వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు నైపుణ్యాభివృద్ధిని అందించడం చాలా ముఖ్యమని కాలేజీల యాజమాన్యాలకు వీసీ సూచించారు.

విద్యా ప్రమాణాల పరిరక్షణలో బాధ్యత వహించాలి

విద్యా ప్రమాణాల పరిరక్షణలో అనుబంధ కళాశాల పాలకులు, అధ్యాపకులు బాధ్యత వహించాలని వర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి కళాశాలల ప్రతినిధులకు సూచించారు. అఫిలియేట్ కాలేజెస్ డైరెక్టర్ తారా కళ్యాణి మాట్లాడుతూ కొత్త విద్యా సంవత్సరానికి అనుబంధ ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయం ప్రమాణాలను మరింత బలోపేతం చేసేందుకు అన్నివర్గాల నుంచి సహకారం అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, అటానమస్ కాలేజెస్ అఫైర్స్ డైరెక్టర్ రవీంద్రారెడ్డి, వర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలల చైర్మన్లు, సెక్రటరీలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పరిశోధనకు ప్రాధాన్యం

ప్రైవేటు కాలేజీల్లోని రీసెర్చ్ సెంటర్లలో స్కాలర్స్‌కు గైడ్‌ల ఎంపిక ప్రక్రియను సులభతరం చేస్తున్నామని, ఎన్ఐటీలు, ఐఐటీలతో పాటు కేంద్రీయ విశ్వవిద్యాలయాల నుంచి పీహెచ్‌డీ పొందినవారికి నేరుగా గైడ్‌గా అవకాశం కల్పిస్తామన్నారు. అనుబంధ, అటానమస్ కళాశాలల నుంచి అందిన వనరులతో జేఎన్టీయూలో 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. డిమాండ్ ఆధారిత పరిశోధనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలని పరిశోధకులకు పిలుపునిచ్చారు. జాతీయ విద్యా విధానంతో భవిష్యత్తులో ఎన్నో మార్పులు వచ్చే అవకాశం ఉందని, దేశవ్యాప్తంగా టీచింగ్ యూనివర్సిటీలు, రీసెర్చ్ యూనివర్సిటీలు, మల్టీ డిసిప్లీనరీ డిగ్రీ-గ్రాంటింగ్ యూనివర్సిటీలు రాబోతున్నాయని చెప్పారు. ఒకే రకమైన కోర్సుకు వేర్వేరు కళాశాలల్లో రూ.40,000 నుంచి రూ. 2 లక్షల వరకు ఫీజు వసూలు చేయడం వంటి అంశాలను ఆర్టికల్ 14 కింద ఉల్లంఘనగానే పరిగణించాల్సి వస్తుందన్నారు.

బిడ్‌లు లెస్.. క్వాలిటీ తుస్!

(5వ పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ అధికారులు గుడ్డిగా బిల్లులపై సంతకం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

కంట్రోల్ తప్పిన 'క్వాలిటీ'

జీహెచ్ఎంసీలోని క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఇంజనీర్లు, కాంట్రాక్ట్ ఏజెన్సీలు నియంత్రిస్తున్నాయి. పనుల్లో నాణ్యత పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిన ఈ విభాగంలోని కొందరు అధికారులు తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. థర్డ్ పార్టీ, ఫోర్త్ పార్టీ పేరిట నాణ్యత పరిశీలన జరుగుతున్నా, కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పనులు అధ్వానంగా ఉంటున్నాయి. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) ప్రమాణాల ప్రకారం రహదారుల నిర్మాణం జరిగిందా? వాటి నాణ్యత ఎలా ఉందన్నది నమూనాలు సేకరించి ల్యాబ్‌లో పరీక్షించిన అనంతరం నివేదిక ఇవ్వాలి. సంస్థలోని ఇంజనీరింగ్ అధికారులు, థర్డ్, ఫోర్త్ పార్టీల నివేదికలు పరిశీలించాకే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. నాణ్యతగా పనులు జరగలేదని భావిస్తే బిల్లుల చెల్లింపులో కోత విధించాలి. పనుల్లో నాణ్యత అంతగా పట్టించుకోకుండా మెరుగ్గా ఉన్నట్టు నివేదికలు ఇస్తున్నారు. జీహెచ్ఎంసీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పనులు చేసిన అనంతరం బిల్లులు ఎప్పుడు వస్తాయో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. రూ.800 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అయినా తక్కువకు పనులు చేసేందుకు కొందరు ముందుకు వస్తుండడం గమనార్హం.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

● యువకుడి హత్య కేసులో సోదరి సహా ఐదుగురు నిందితుల అరెస్ట్

సంతోష్‌నగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి సోదరుడిని హత్య చేసిన సంఘటనలో ఐదుగురు నిందితులను సంతోషనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కత్తులు, నాలుగు సెల్ ఫోన్లు, మూడు చక్రాల వాహనం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రియాసత్ నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ఫైజల్ (19) ఆటో డ్రైవర్. ముగ్గురు పిల్లలు ఉన్న ఓ మహిళ అతడితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తోంది. విషయం తెలుసుకున్న సోదరుడు ఆమెను హెచ్చరించాడు. ఆ మహిళ విషయాన్ని ప్రియుడికి చెప్పింది. సోదరుడు తన వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని హత్య చేయడానికి ప్రియుడు, ఆమె పథకం వేశారు. ఈనెల 7వ తేదీన ఫైజల్, మహ్మద్ మునీర్, సయ్యద్ ఫిర్దోస్, సయ్యద్ ఫజల్ మద్యం తాగేందుకు మహిళ సోదరుడిని సంతోష్ నగర్ డీబీ షా దర్గా సమీపంలో శ్మశానవాటికకు పిలిపించారు. అతడు మద్యం తాగిన తర్వాత పథకం ప్రకారం కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశారు.

కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మహిళ, నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

బంగారానికి ఫేక్ కరెన్సీ

(5వ పేజీ తరువాయి)

నగరంలో బంగారు నగల వ్యాపారిని మోసం చేసి రూ. 60 లక్షలు నకిలీ కరెన్సీ అంటగట్టి కుచ్చుటోపీ పెట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. డీసీపీ శ్వేత ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి పర్యవేక్షణలో రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ భిక్షపతి నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు ఇంద్రజిత్‌పై రాజస్థాన్ రాష్ట్రం బికనీర్ జిల్లాలో 15కు పైగా దృష్టి మళ్లించి మోసం చేసిన కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది.


జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

కుల వివక్ష తొలగిపోవాలి

● వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కుల వివక్ష తొలగిపోవాల్సిన అవసరం ఉందని, మనుషుల మనసుల్లో పేరుకుపోయిన వివక్షను ఎవరికి వారే తొలగించుకోవడమే మహాత్మ జ్యోతిరావు పూలేకు అసలైన నివాళి అని వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. అశోక్‌రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అంటరానితనం నిర్మూలన, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. ఆడపిల్లల చదువు కోసం పూలే దంపతులు విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, సుదర్శన్, అమరేందర్ రెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ఫిల్లింగ్ సెంటర్‌ను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఈడీ మయాంక్ మిట్టల్

కొండాపూర్‌లో ట్యాంకర్లకు డిమాండ్

● వాటర్ ఫిల్లింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన ఈడీ మయాంక్ మిట్టల్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ అధికంగా ఉంది. ప్రతీరోజూ 300లకు పైగా ట్యాంకర్లు బుకింగ్ అవుతున్నాయి. కొండాపూర్‌లో ట్యాంకర్లలో నీటిని నింపేందుకు రెండు ఫిల్లింగ్ పాయింట్లున్నాయి. డెలివరీ చేసేందుకు 28 ట్యాంకర్లున్నాయి. రోజురోజుకు ఎండలు ముదురుతుండడంతో బుకింగ్ పెరుగుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్లను డెలివరీ చేయడం వాటర్‌బోర్డు అధికారులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఫిల్లింగ్ సెంటర్‌ను ఈడీ మయాంక్‌మిట్టల్ శుక్రవారం తనిఖీ చేశారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని బుక్ అవుతున్నాయి?, ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలను పరిశీలించారు. అనంతరం వాటర్ సప్లయ్, సివరేజీ పనులు, రెవెన్యూ బిల్లింగ్, కలెక్షన్, ఎంసీసీ ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీజీఎం నారాయణ, జీఎం బ్రిజేష్, డీజీఎం ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతో

సామాజిక న్యాయం

● బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ జాతీయ విధానాల్లో భాగంగా తెలంగాణలో కులగణనతో 56.36 శాతం బీసీల లెక్క తేల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాజికన్యాయం లక్ష్యంతో పనిచేస్తోందని బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన బిల్లును అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడంలో సీఎంగా రేవంత్‌రెడ్డి కృషి అభినందనీయమ అన్నారు. కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్ మేరకు బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కాంగ్రెస్ సర్కార్ పకడ్బందీగా కులగణన చేపట్టి విజయవంతం చేసిందన్నారు. న్యాయపరమైన అంశాలలో నిలబడేలా డెడికేటెడ్ కమిషన్, డాక్యుమెంటేషన్ ద్వారా బిల్లులను ఆమోదించిన ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పట్ల నిబద్ధతను చాటుకుందన్నారు. అడ్డంకులకు ఆస్కారం లేకుండా కమిషన్ ఏర్పాటు చేసి వ్యూహాత్మకంగా వ్యవహరించిందన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి చిత్తశుద్ధితో పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు.


ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీఏ నాయకులు

మేనేజ్‌మెంట్ రంగంలో నాయకత్వాన్ని తీర్చిదిద్దాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తన దిశగా మేనేజ్‌మెంట్ రంగంలో భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి పిలుపునిచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నిర్వహిస్తున్న రెండు రోజుల బ్లిట్జ్ క్రిగ్-2025 కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాపార నాయకత్వం, ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తన, పరిశ్రమల స్థాపన ప్రాధాన్యతలను వివరించారు. ఉద్యోగాలు చేయటం కాదని.. పది మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా యువత ముందడుగు వేయాలని ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం అన్నారు. మొదటి రోజు వ్యాపార క్విజ్‌లు, ఐడియా పిచింగ్ పోటీలు, బ్రాండింగ్ యుద్ధాలు, నిర్వహణ అనుకరణలతో సహా పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమ సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో చేపట్టబోయే ప్రొఫెసర్ల పోస్టుల భర్తీలో యూజీసీ-2018 గైడ్‌లైన్స్ అమలు చేయాలని ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు తెలంగాణ డాక్టోరేట్స్ అసోసియేషన్(టీడీఏ) అధ్యక్షుడు డాక్టర్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.


రాజేంద్రనగర్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, చిత్రంలో శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేశ్ తదితరులు


రాజేంద్రనగర్‌లో జరిగిన పూలే జయంతిలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్. చిత్రంలో మాజీ కౌన్సిలర్ కె.ఎస్.దయానంద్, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోరని సదానంద్ తదితరులు


రాజేంద్రనగర్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి పి.సబితారెడ్డి, కార్పొరేటర్ పి.అర్చనజయప్రకాశ్, బీఆర్ఎస్ నాయకులు

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే

- ఘనంగా జయంతి
- చిత్రపటానికి, విగ్రహానికి నివాళులు

సంఘ సంస్కర్త, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే అని పలువురు పేర్కొన్నారు. అన్నివర్గాలకు ఆదర్శనీయుడని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జయంతి సందర్భంగా పలుచోట్ల చిత్రపటానికి, విగ్రహానికి నివాళులర్పించారు.

● జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి

● రాజేంద్రనగర్ సర్కిల్ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బండారి శంకర్, ప్రధాన కార్యదర్శి ముదుమాల శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతురావు, మాజీ మంత్రి పి.సబితారెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు అచారి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కార్పొరేటర్లు పి.అర్చనజయప్రకాశ్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మొంద్ర సంగీతగౌరీశంకర్, నార్సింగ్ మార్కెట్ చైర్మన్ వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్, పూలే విగ్రహ దాత పోతురాజు యాదయ్య మాదిగ, నిర్వాహకులు కనకమామిడి జంగయ్య, డాక్టర్ వి.శ్రీరాములు, క్యాసారం శంకర్‌రావు పాల్గొన్నారు.


బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్వాన్ శారదానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, తదితరులు


రాజేంద్రనగర్‌లో నివాళులర్పిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతురావు. చిత్రంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ నాయీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు


నివాళులర్పిస్తున్న పూలే విగ్రహదాత పోతురాజు యాదయ్య మాదిగ, కమిటీ సభ్యులు కనకమామిడి జంగయ్య, డాక్టర్ శ్రీరాములు, క్యాసారం శంకర్‌రావు


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి


పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మైలార్‌దేవుపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి


హైదర్‌గూడ చౌరస్తాలో పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న జాతీయ ఓబీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ తదితరులు


సింగరేణి భవన్‌లో నివాళులర్పిస్తున్న సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, అదర్శ సుభాని, డీజీఎం చౌటపల్లి ప్రభాకర్ తదితరులు


గాంధీభవన్‌లో నివాళులర్పిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ చైర్మన్ ప్రేమలత అగర్వాల్, టీపీసీసీ కార్యదర్శి మనీలాల్ షా, నాయకులు బాబురావు, గోపీలాల్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు


పూలే జయంతి వేడుకలో బీసీ ఐక్యవేదిక డైరీని ఆవిష్కరిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, శ్రీకాంత్‌గౌడ్


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ తదితరులు


సిటీ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ పసునూరి రవీందర్

మహనీయుల స్ఫూర్తితో ముందడుగు వేయాలి

చార్మినార్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సర్వతోముఖ అభివృద్ధికి తమ జీవితాన్ని ధారపోసిన మహనీయుల స్ఫూర్తితో విద్యార్థులు ముందడుగు వేయాలని కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పసునూరి రవీందర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో జరిగిన 'మహనీయుల స్మరణ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌లు జీవితంలో అనేక కష్టనష్టాలు భరించి జాతిలో విజ్ఞాన దీపాన్ని వెలిగించారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి, డా.శంకర్, డా.కృష్ణవేణి, డా.కె.భాస్కర్, డా.శ్రీనివాస్, డా.తిరుపతి, డా. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కార్వాన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిబాలాజీనగర్, ఇండస్‌వ్యాలీ, కేకేనగర్‌కు హిమాయత్‌సాగర్‌లో శుద్ధి చేసిన నీరు వస్తుందని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు నేడు ఏం చెబుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పలు కాలనీలవాసులు నేరుగా జలమండలి మేనేజర్‌ను పిలిపించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ బండ్లగూడ జాగీర్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రంగునీళ్లు వస్తున్నాయని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడితే తమపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు వాదించారని, ఇప్పుడు ఏం చెబుతారని ప్రశ్నించారు. జలమండలి మేనేజర్ మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

13న వక్ఫ్ బచావో మార్చ్

బర్కత్‌పుర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఈనెల 13న అన్ని సంఘాలతో కలిసి వక్ఫ్ బచావో మార్చ్ నిర్వహిస్తున్నట్లు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్, గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ రాజేష్‌నాయక్ తెలిపారు. లోయర్ ట్యాంక్‌బండ్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద సాయంత్రం 3 గంటలకు ఈ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మార్చ్ కరపత్రాన్ని ఆవిష్కరించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఐతరాజు అంబేడ్కర్, మార్చ్ కో-ఆర్డినేటర్ ఖదీర్, బహుజన స్టూడెంట్ ప్రొటెక్షన్ కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

14న జూపార్కుకు సెలవు లేదు

మదీన, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో జూపార్కు యథావిధిగా తెరిచి ఉంటుందని క్యూరేటర్ జె.వసంత తెలిపారు. సాధారణంగా ప్రతీ సోమవారం జూపార్కుకు వారాంతపు సెలవు ఉంటుంది. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెలవును రద్దు చేసి సందర్శకుల కోసం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జూపార్కు తెరిచి ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ ప్రతినిధులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ కుమార్, డాక్టర్ పాండయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నిజాం కళాశాల గేట్ వద్ద నిరసన తెలిపి ఉస్మానియా యూనివర్సిటీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో కాంట్రాక్ట్ అధ్యాపకులు 1256 మంది 30 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అధ్యాపకుల నియామకానికి తాము వ్యతిరేకం కాదని, కాంట్రాక్ట్ అధ్యాపకులను వదిలిపెట్టి మిగతా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 21ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, 7వ పే స్కేల్‌ను అమలు చేయాలని, కాంట్రాక్ట్ అధ్యాపకులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజాం కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు తమకు కేటాయించిన అదనపు బాధ్యతలకు రాజీనామా చేసి నిరసన తెలిపారు.



నిజాం కళాశాల గేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజేంద్రనగర్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ మండలం హైదర్‌గూడ ఎర్రబోడ సర్వే నెంబర్.7లోని ప్రభుత్వ భూమిలో 1200 గజాల స్థలాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు నకిలీ పత్రాలను సృష్టించి ప్రహరీతో పాటు గదిని నిర్మించడంతో శుక్రవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం అధికారులు కూల్చివేశారు. వివరాలోకి వెళ్తే.. హైదర్‌గూడ సర్వే నెంబర్.7లో ప్రభుత్వ భూమి ఉండేది. ఇందులో స్థానికులు శ్రీ సప్తగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించగా, మరి కొంత స్థలాన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కేటాయించారు. ఇదే ప్రాంతంలో హైదర్‌గూడ దళితులకు శ్మశానవాటిక కోసం స్థలం కావాలని అప్పట్లో టీడీపీ రాజేంద్రనగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కే ఎస్ రత్నం 1997లో రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. దళితుల శ్మశానవాటికకు స్థలం కేటాయించకపోతే ఒక దశలో ఆయన పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని అధికారులను హెచ్చరించారు. దీంతో అదే రోజున రంగారెడ్డి కలెక్టర్ దళితుల శ్మశానవాటికకు ఎర్రబోడ సర్వే నెంబర్.7లో రెండెకరాల స్థలాన్ని కేటాయిస్తూ జీవో విడుదల చేశారు. అక్కడ శ్రీ సప్తగిరి వేంకటేశ్వర స్వామి ఆలయం ఉండడంతో శ్మశానవాటికగా ఆ స్థలాన్ని ఎవరూ ఉపయోగించలేదు. అదే స్థలానికి సమీపంలో ఉన్న 1200 గజాల స్థలాన్ని నకిలీ పత్రాలతో కొందరు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ బి.రాములు ఆధ్వర్యంలో తొలగించారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ ప్రత్యేక చొరవ తీసుకుని ఎర్రబోడ భూములను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


ఎర్రబోడ సర్వే నెంబర్.7లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

గిరిగిరిగడ్డలో..

నార్సింగ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ మున్సిపాలిటీలోని గిరిగిరిగడ్డలో అనుమతి లేకుండా నిర్మించిన అదనపు అంతస్తును మున్సిపల్ అధికారులు శుక్రవారం సాయంత్రం కూల్చివేశారు. స్థానికులు ఫిర్యాదు చేయగా, అధికారులు కూల్చివేశారు.


అదనపు అంతస్తును కూల్చివేస్తున్న సిబ్బంది

ఇండియన్ బ్యాంక్‌లో ఖాళీలను భర్తీ చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్యాంక్‌లో ఖాళీగా ఉన్న క్లరికల్, సబ్‌స్టాఫ్, స్వీపర్లు, డ్రైవర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎఫ్ఐబీఈయూ సెక్రటరీ జనరల్ అరుణాచలం, ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణరావు డిమాండ్ చేశారు. ఇండియన్ బ్యాంక్‌లో అలహాబాద్ బ్యాంక్‌ను విలీనం చేసిన తర్వాత ఉద్యోగులకు ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌ఫర్ పాలసీని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం లిబర్టీ చౌరస్తా వద్ద గల ఇండియన్ బ్యాంక్ కార్యాలయం ముందు ఎఫ్ఐబీఈయూ పిలుపు మేరకు ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాత్కాలిక ఉద్యోగులకు కనీస వేతనం, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న అన్ని జోనల్ కార్యాలయాల ముందు ధర్నా, 25న బ్యాంక్ ఉద్యోగుల సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్, జాయింట్ జనరల్ సెక్రటరీ నల్లపరెడ్డి, మహిళా కౌన్సిల్ కన్వీనర్ పద్మ పాల్గొన్నారు.



లిబర్టీ చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఇండియన్ బ్యాంకు ఉద్యోగులు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Dip8JTFలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


పుస్తకాలను బహూకరిస్తున్న యునైటెడ్ వే హైదరాబాద్ ప్రతినిధులు

పుస్తకాల బహూకరణ

చార్మినార్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సిటీ కళాశాల, గ్రంథాలయ శాఖ విభాగానికి లక్ష రూపాయల విలువ చేసే కంప్యూటర్ శాస్త్ర పుస్తకాలను 'యునైటెడ్ వే హైదరాబాద్' సంస్థ ప్రతినిధులు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద శుక్రవారం ఉచితంగా అందజేశారు. టీఎస్ కేఎస్‌సీ విభాగానికి రెండు కంప్యూటర్లను బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి, డా.మల్లికార్జున్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శారద, సంతోష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

కార్వాన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని లంగర్‌హౌజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 105 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. సిద్ధిపేట ప్రాంతానికి చెందిన అశోక్(30) తన మిత్రుడు గణేశ్‌తో కలిసి కొంతకాలంగా రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్సుల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. శుక్రవారం లంగర్‌హౌజ్ బాపూఘాట్ ప్రాంతంలో అశోక్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా, లంగర్‌హౌజ్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా, సెల్‌ఫోన్ దొంగతనాలకు తన మిత్రుడు గణేశ్‌తో కలిసి పాల్పడుతున్నట్లు తెలిపాడు. దీంతో అతడి నుంచి 105 సెల్‌ఫోన్‌లు రికవరీ చేశారు. మరో నిందితుడు గణేశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరు నకిలీ ఐటీ ఉద్యోగులు..

నార్సింగ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఐటీ ఉద్యోగులమని నకిలీ ఐడీ కార్డులు, పత్రాలు డ్యాక్యుమెంట్లు సృష్టించి ఓ బ్యాంక్‌ను మోసం చేసిన సంఘటనలో నార్సింగ్ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు నరేశ్, ధారావత్ కిషన్ ఎస్‌బీఐ అల్కాపూర్ టౌన్‌షిప్ బ్రాంచిలో ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ కార్డు లోన్స్ కింద రూ.25 లక్షల లోన్ తీసుకున్నారు. వీరు ఫేక్ ఐడీ ఫోర్జరీ, పేస్లిప్ మహేంద్ర కంపెనీది తయారీ చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను కూడా తయారు చేశారు. అయితే, వీరు తప్పించుకొని తిరుగుతుండడంతో విచారణలో అసలు విషయం బయటపడింది. బ్యాంక్ అధికారులు నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారించి ఇద్దరినీ అరెస్ట్ చేశారు. వీరికి సహకరించిన కార్తీక్ అనే వ్యక్తి తప్పించుకు తిరుగుతున్నాడని త్వరలో అరెస్ట్ చేస్తామని నార్సింగ్ పోలీసులు తెలిపారు.

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు అదృశ్యం


పూజా

మంగళ్‌హాట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు సంఘటనల్లో ఓ మహిళ, మరో వ్యక్తి అదృశ్యమయ్యారు. మంగళ్‌హాట్‌కు చెందిన పూజా(29) ఈనెల 9వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


యాదగిరి

మరో వ్యక్తి...

మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివలాల్‌నగర్ ప్రాంతానికి చెందిన రాజయ్య కుమారుడు యాదగిరి(48) ఈనెల 1వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘరానా దొంగ అరెస్ట్

మదీన, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఓ ఘరానా దొంగను బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి 35 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్‌కుమార్, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌సాబ్‌కుంట సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన మహ్మద్ సలీమ్ అలియాస్ సునీల్ శెట్టి అలియాస్ ఇబ్రహీం అలియాస్ శెట్టి సలీమ్(51) వాల్‌పెయింటర్. జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఇప్పటి వరకు ట్రై కమిషనరేట్ పరిధిలో 150 కేసుల్లో నిందితుడు. 25 సార్లు అరెస్టయ్యాడు. తాజాగా, రెండు దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్నాడు. శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా, సలీమ్ ఎక్కువగా పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే పాతబస్తీలోనే దొంగతనాలు చేస్తుంటాడు. వచ్చిన డబ్బుతో పర్యాటక ప్రాంతాల్లో ఎంజాయ్ చేస్తుంటాడు.

సామాజిక న్యాయానికి బీసీ కులగణన అవసరం

● ఢిల్లీ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగ విశ్రాంత ప్రొ.తిరుమలి


పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రొ.ఘంటా చక్రపాణి, ప్రొ. తిరుమలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలను కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకొచ్చే జాతీయ వాదాన్ని మహాత్మాజ్యోతిరావు పూలే నడిపారని ఢిల్లీ విశ్వవిద్యాలయ చరిత్ర విభాగ విశ్రాంత ప్రొ.ఐ.తిరుమలి అన్నారు. డా.బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 'బీసీ కులగణన- సాధికారిత' అంశంపై ప్రొ. తిరుమలి ఉపన్యసిస్తూ భారతదేశంలో సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధిని సాధించడంలో బీసీ కులగణన అవసరమని అన్నారు. ఇది సాధికారత, సమానత్వం, సరిదిద్దబడిన చారిత్రక తప్పులను, మరింత సమ్మిళిత భవిష్యత్తును సృష్టించే విధానాలకు పునాది వేస్తుందన్నారు. అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ భారతేదశ చరిత్రలో విద్య, వికాసానికి తొలి బీజం వేసిన వ్యక్తి పూలే అని అన్నారు. ఈ.ఎం.ఆర్.ఆర్.సి డైరెక్టర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ మాట్లాడుతూ డా.అంబేడ్కర్, మహాత్మాపూలే సిద్ధాంతాలు ఆచరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, బీసీ సెల్ కో-ఆర్డినేటర్ డా. రమాదేవి, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.


జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ ఇలంబరిది

అణగారిన వర్గాల శ్రేయస్సుకు అవిశ్రాంతం పోరాటం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల హక్కులు, మహిళోద్ధారణ, కుల వ్యవస్థ నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం అవిశ్రాంతంగా పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డా.జి.ముకుందరెడ్డి, డీఆర్వో వెంకటాచారి, ఆర్డీవో సాయిరాం, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పూలే విగ్రహ ఏర్పాటుకు మద్దతు ఇవ్వాలని జాన్‌వెస్లీకి వినతిపత్రం ఇస్తున్న కవిత

పూలే విగ్రహం ఏర్పాటుకు మద్దతు ఇవ్వండి

● సీపీఎంను కోరిన ఎమ్మెల్సీ కవిత

చిక్కడపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్‌కు మద్దతివ్వాలని సీపీఎం పార్టీని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. అనంతరం కవిత మాట్లాడుతూ 42శాతం బీసీ బిల్లుకు కేంద్రం ఒప్పుకొనేలా సీఎం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వార్డుల వారీగా, కులాల వారీగా కులగణన వివరాలు వెల్లడించాలన్నారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం పోరాడిన పూలే విగ్రహ ఏర్పాటు డిమాండ్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, జాగృతి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్ఎఫ్ ప్రతినిధులు

వీధి వ్యాపారులకు భద్రత కల్పిస్తాం

● మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని వీధి వ్యాపారులకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వడం ద్వారా వారికి చట్టపరమైన భద్రత కల్పించేందుకు సహకరిస్తామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జాతీయ హాకర్స్ ఫెడరేషన్ (ఎన్‌హెచ్ఎఫ్) ప్రతినిధులతో శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారుల హక్కులు, వృత్తి స్వాతంత్ర్య, జీవనోపాధి భద్రత, చట్టపరమైన గుర్తింపు, వాణిజ్య నిర్వహణ విధానాలపై చర్చ జరిగింది. వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా వెండింగ్ జోన్ల ఏర్పాటును రూపొందించాలని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శక్తిమాన్ ఘోస్ మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మేయర్‌కు సమాఖ్య ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.


ఏఎస్ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అనురాగ్ కుమార్ తదితరులు

ఘనంగా ఈసీఐఎల్ వ్యవస్థాపక దినోత్సవం

కుషాయిగూడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఈసీఐఎల్ 59వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ ఏఎస్ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్, డైరెక్టర్ (టెక్నికల్) డాక్టర్ అనేష్ కుమార్, సీవీఓ పి.క్రిష్ణ కుమార్, వివిధ విభాగాల అధికార సిబ్బంది, ఈసీఓఏ, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా చేయండి


రైతుమేళాను ప్రారంభిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక యంత్ర పరికరాలను ఉపయోగించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అగ్రి, హార్టికల్చర్ సొసైటీ, ఎగ్జిబిషన్ సొసైటీ, ఎకనామిక్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో రైతు మహోత్సవం-2025 జరిగింది. ఈ కార్యక్రమాన్ని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కమిషన్ సభ్యులు కేవీఎస్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, భూమి సునీల్, భవానీరెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. 14వ తేదీవరకు కొనసాగనున్న రైతు మహోత్సవంలో ఒక్కొక్క థీమ్‌తో ఒక్కో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రైతులకు కావాల్సిన పరికరాలు, ఉత్పత్తులు, సీడ్, ఫెర్టిలైజర్‌లను అందులో ఉంచారు. వ్యవసాయ,ఉద్యానవన శాఖలతో పాటు సెరికల్చర్, ఆయిల్ ఫెడ్, అనుబంధ శాఖల స్టాళ్లను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రి, హార్టికల్చర్ ప్రతినిధులు, ఎగ్జిబిషన్ సొసైటీ, ఎకనామిక్ సొసైటీ కార్యదర్శి జీవీ రంగారెడ్డి పాల్గొన్నారు.

నేడు వీర హనుమాన్ విజయ యాత్రలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా వీర హనుమాన్ విజయ యాత్రలు నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గౌలిగూడ హనుమాన్ మందిర్‌లో శనివారం ఉదయం 8.30నిమిషాలకు నిర్వహించే యజ్ఞం పూర్తవగానే వీర హనుమాన్ విజయ యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. గౌలిగూడ, కోఠి, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్, బైబిల్‌హౌస్, సికింద్రాబాద్ మీదుగా బోయిన్‌పల్లిలోని తాడ్‌బండ్ ఆంజనేయస్వామి మందిరం వరకు యాత్ర కొనసాగుతుందని వివరించారు. ఈ యాత్రకు ముఖ్య వక్తగా వీహెచ్‌పీ నేత, మాజీ పార్లమెంట్ సభ్యులు రామ్‌విలాస్‌దాస్ వేదాంత్ హాజరవుతున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా హిందువులందరూ యాత్రలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డిజిటలైజేషన్‌కు సిద్ధంగా ఉండాలి


భూముల వివరాలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాండ్‌బ్యాంక్, ప్రభుత్వ భూముల కేటాయింపులు, తదితర అంశాలపై కలెక్టర్ మండలాల వారీగా ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ల్యాండ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్ సిస్టంను అప్‌డేట్ చేసి అన్ని వివరాలను డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఈనెల 22న పైలెట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి మండలంలో ప్రక్రియను ప్రారంభించాలని, తర్వాత ఇతర మండలాల్లో చేపట్టేందుకు తహసీల్దార్లు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓ సాయిరాం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీరాం, ఈడీఎం రజిత, తదితరులు పాల్గొన్నారు.

పరిపూర్ణమైన వ్యక్తులంటూ ఎవరూ ఉండరు..

● ఏడవ తరగతి వరకూ నేనూ డిస్లెక్సియాతో బాధపడ్డా..

● అమ్మ సహకారంతోనే సమస్యను అధిగమించా..

● యంగ్ ఫిక్కీ లేడీస్ సదస్సులో నటుడు బొమన్ ఇరానీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 'మనలో ఎవరూ పరిపూర్ణమైన వ్యక్తులు లేరు.. అందరూ శకుంతలాదేవిలా గణిత మేధావులూ కాలేరు. లతా మంగేష్కర్‌లా పాడలేరు. లేదంటే విరాట్ కోహ్లీలా క్రికెట్ ఆడలేరు. అయినప్పటికీ ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ప్రతిభ ఉంటుంది. ఆ ప్రతిభను గుర్తించాల్సింది తల్లులే.. వారే తమ పిల్లల వ్యక్తిత్వాన్ని ప్రోత్సహించాలి..' అని నటుడు బొమన్ ఇరానీ అన్నారు. బేగంపేటలోని ఓ హోటల్‌లో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వై ఫ్లో) నిర్వహించిన కార్యక్రమంలో 'నాలెడ్జ్- ద కంపాస్ ఫర్ లైఫ్స్ జర్నీ' (జ్ఞానం - జీవిత ప్రయాణానికి దిక్సూచి) అంశంపై బొమన్ ఇరానీ ప్రత్యేకంగా మాట్లాడారు. తన జీవిత అనుభవాలనే పాఠాలుగా యువ ఫిక్కీ మహిళలకు తెలుపుతూ స్ఫూర్తిని కలిగించే ప్రయత్నం చేశారు. తాను గొప్ప పిల్లాడినేమీ కాదని, చదువులో మాత్రం ముందే ఉండేవాడినన్నారు. తాను ఏడవ తరగతి వచ్చే వరకూ డిస్లెక్సియా (అభ్యాస రుగ్మత) ఉండేదని, మాట్లాడటం రాకపోవడం బోనస్ అని అన్నారు. పదవతరగతి వరకూ తాను పెదవి విప్పడానికే భయపడేవాడినన్నారు.

నోట్లో రాళ్లు పెట్టుకుని మరీ మాట్లాడేందుకు ప్రయత్నించా..


మాట్లాడుతున్న బొమన్ ఇరానీ

స్టేజ్ ఎక్కడం, పేరు సంపాదించుకోవడం, తన గొంతును అందరికీ వినిపించడం ఇష్టంగా ఉండేదని, అయితే తనకున్న లోపాల కారణంగా మానసికంగా ఆవేదన చెందేవాడినని బొమన్ ఇరానీ చెప్పారు. అయితే, తనకు ఏది ఇష్టమో అమ్మ కనిపెట్టారని అన్నారు. అమ్మ ప్రోత్సాహంతోనే తాను డిస్లెక్సియాను, మాట్లాడకపోవడమనే సమస్యను అధిగమించానని వివరించారు. మాట సరిగా రావడానికి నోట్లో గులకరాళ్లు పెట్టుకుని అభ్యసించేవాడినని, పాటలు పాడటం చేశానని తెలిపారు.

గౌరవించడం నేర్చుకోవాలి

ఒకరి వ్యక్తిత్వంను గౌరవించడం నేర్చుకోవాలంటూ, ఒకరి విజయాన్ని సంప్రదాయ కొలమానాలతో మాత్రం ఎన్నడూ కొలవవద్దని సూచించారు. వై ఫ్లో ఛైర్‌పర్సన్ పల్లవి జైన్‌తో పాటుగా వై ఫ్లో, ఫ్లో సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డెండ్రిటిక్ సెల్ థెరపీతో క్యాన్సర్ చికిత్సలో మెరుగైన ఫలితాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ చికిత్సలో డెండ్రిటిక్ సెల్ థెరపీ మెరుగైన ఫలితాలను అందిస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. డెండ్రిటిక్ కణాలు(డీసీటీ) మానవ శరీరంలో క్యాన్సర్ మీద పోరాడే టి-కణాలను ఉత్తేజితం చేస్తాయని, శరీరంలో క్యాన్సర్, బ్యాక్టీరియాకు సంబంధించిన కణాలు ఎక్కడున్నా అన్నింటినీ గుర్తించి నాశనం చేస్తాయని స్టెమ్ సెల్స్ రీజనరేటివ్ అండ్ రీసెర్చ్ ల్యాబ్స్ సంస్థ ప్రతినిధి, ఆర్థోపెడిక్ సర్జరీ రీజెనరేటివ్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సదాత్ ఎ అల్అలీ ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్‌కు కీమోథెరపీ, మోనోక్లోనల్ యాంటీబాడీ థెరపీ లాంటి చికిత్సలు ఉన్నాయని, వీటన్నింటినీ కూడా డీసీటీతో కలిపి ఇస్తే.. వాటి ప్రభావం మరింత ఎక్కువై క్యాన్సర్ త్వరగా తగ్గుతుందని తెలిపారు. దీనికి యూఎస్ఎఫ్‌డీఏ నుంచి అనుమతి కూడా లభించిందన్నారు. ఇతర క్యాన్సర్ చికిత్సలన్నింటికంటే కూడా ఈ డీసీటీ చికిత్స చాలా ప్రభావం చూపిస్తుందని వివరించారు. క్యాన్సర్ ప్రాథమిక దశలో ఉన్నప్పుడే ఈ చికిత్స తీసుకుంటే, మెటాస్టాసిస్ వచ్చే అవకాశాలను నాలుగు నుంచి ఐదు రెట్లు ఎక్కువగా తగ్గిస్తుందని తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఓయూలోని ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలన భవనం వరకు కాంట్రాక్టు ప్రొఫెసర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ యూనివర్సిటీ పదవులకు రాజీనామా చేస్తూ పత్రాలను ఓయూ రిజిస్ట్రార్ నరేష్‌కు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాయాలని వీసీని డిమాండ్ చేశారు. రెగ్యులరైజ్ చేయకపోతే నిరవధిక సమ్మె ద్వారా అన్ని యూనివర్సిటీల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సీమర్ల విజేందర్ రెడ్డి, వేల్పుల కుమార్, ఉపేందర్, పరుశరాం, ధర్మతేజ, రేష్మారెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్ 1 ఫలితాలను ఆపాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): గ్రూప్ 1 పరీక్షల్లో చాలా అవకతవకలు జరిగాయని, ఫలితాలను వెంటనే ఆపాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలోని లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ 1:1 ప్రకారం విడుదలైన ప్రతి ఫైనల్ లిస్టులో ఉన్న వాళ్ల ప్రిలిమ్స్, మెయిన్స్ హాల్ టికెట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 21,093 మంది బయోమెట్రిక్ చేసి మెయిన్స్‌కు ఎంపికయితే, జీఆర్ఎల్ ప్రకారం 21,103 మంది ఎలా సెలెక్ట్ అయ్యారని ప్రశ్నించారు. గతంలో బయోమెట్రిక్ లేని కారణంగా నోటిఫికేషన్‌ను రద్దు చేశారని, మరి ఇప్పుడు కూడా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కోఠీ ఉమెన్స్ కాలేజీలో 500 మంది పరీక్ష రాస్తే 74 మందికి ర్యాంకులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. తమ సందేహాలను తీర్చిన తరువాతే ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నూతన వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

● బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ



బీహెచ్ఈఎల్‌లో ర్యాలీ నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ఖేల్‌కాలనీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నూతన వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చట్టసవరణ చేసి ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం మైనారిటీ నాయకులు, ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. శేరిలింగంపల్లి, చందానగర్, రామచంద్రాపురం, తెల్లాపూర్ తదితర ప్రాంతాలను నుంచి వచ్చిన ముస్లింలు ప్లకార్డులతో బీహెచ్ఈఎల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. దాంతో ఆయా ప్రాంతాల్లో రోడ్లపై ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ర్యాలీలో ఆయా ప్రాంతాలకు చెందిన మతపెద్దలు అబ్దుల్ ఘనీ, షహనాజ్, సర్ఫరాజ్, ఇనాయత్, తిలావత్, అద్నాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇది చీకటి అధ్యాయం..

చార్మినార్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు నూతన చట్టం దేశ చరిత్రలో చీకటి అధ్యాయమని ముస్లింలు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం మక్కా మసీద్ ప్రార్థనల అనంతరం బ్యానర్లు పట్టుకొని ర్యాలీగా రోడ్లపైకి వచ్చారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టం బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ మత రాజకీయాలకు అండగా ఉంటూ ఒక వర్గానికి అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. రాజ్యాంగం ఇచ్చిన వెసులుబాటును అవహేళన చేస్తున్నదన్నారు. ఈ బిల్లును రద్దు చేయకపోతే ఆందోళనలు తీవ్రమవుతాయన్నారు. దారుల్ షిఫా మసీద్ వద్ద డీజేఎస్ ఆధ్వర్యంలో నల్లజెండాలతో నిరసన తెలిపారు. తలాబ్ కట్ట, యాకుత్‌పురా, బడా బజార్, తదితర ప్రాంతాల్లోనూ ముస్లింలు నిరసన తెలిపారు. ఆయా ప్రాంతాల్లో దక్షిణ మండలం డీసీపీ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

చంచల్‌గూడ జైలులో ఖైదీలకు వేసవి ప్రత్యేక ఏర్పాట్లు

సైదాబాద్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో ఖైదీలకు వడదెబ్బ తగలకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్ తెలిపారు. ఖైదీలకు రోజూ మజ్జిగ, చల్లటి తాగునీటికి రంజన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఖైదీలు ఉండే బ్యారక్‌లకు అధిక ఎండ వేడి రాకుండా శ్లాబులకు కూల్ పెయింట్స్ వేయించినట్లు వివరించారు. జైలు ఆస్పత్రిలో నిరంతరం ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. వృద్ధ ఖైదీలు ఉండే బ్యారక్ కిటికీలకు కూల్‌మ్యాట్స్, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు స్పష్టం చేశారు.

ఆస్తి యావతో కుమార్తెను చంపిన సవతి తల్లి

మరో ఇద్దరి సహకారంతో గొయ్యితీసి పూడ్చివేత

2నెలల తర్వాత వెలుగులోకి ఘోరం

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో ఘటన


మృతదేహాన్ని బయటకు తీయిస్తున్న పోలీసులు

ఫిర్జాదిగూడ/శాలిగౌరారం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తనకున్న రెండు ఇళ్లలో ఓ ఇంటిని కుమార్తె పేరిట రాసివ్వాలని ఆ తండ్రి నిర్ణయించగా, ఇది ఇష్టం లేని ఆమె సవతి తల్లి ఘోరానికి పాల్పడింది. ఆ ఇంటిని కూడా తన సొంతం చేసుకునేందుకు సవతి కుమార్తెను హత్యచేసి.. గుట్టు చప్పుడు కాకుండా పాతిపెట్టింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్‌లో ఈ ఘటన జరిగింది. నాలుగు నెలల తర్వాత ఈ ఘోరం వెలుగుచూడటం విశేషం. పోలీసుల వివరాల ప్రకారం బోడుప్పల్ లక్ష్మీనగర్ కాలనీకి నివాసం ఉండే జాటోత్ పీనా నాయక్ ఓయూలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి కుమారుడు చంద్రశేఖర్, కుమార్తె మహేశ్వరి ఉన్నారు. మహేశ్వరి(26) బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. భార్య అనారోగ్యంతో మృతి చెందటంతో పీనా నాయక్ లలిత అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఓ కుమార్తె ఉంది. మహేశ్వరికి పెళ్లవగా, భర్తతో మనస్పర్థల కారణంగా విడిపోయి పుట్టింట్లోనే ఉంటోంది. మహేశ్వరికి మళ్లీ పెళ్లి చేయాలని, ఉన్న రెండు ఇళ్లలో ఓ ఇంటిని ఆమెకు ఇవ్వాలని తండ్రి నిర్ణయించాడు. అయితే ఉన్న రెండు ఇళ్లూ తనకు పుట్టిన బిడ్డకే దక్కాలనే పథకంతో మహేశ్వరి హత్యకు లలిత పథకం వేసింది. ఇందుకు తన మేనబావ, సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రవిని, అతడి స్నేహితుడు యాదాద్రి జిల్లా బీబీనగర్‌కు చెందిన బానోతు వీరన్న సాయం కోరగా అంగీకరించారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రవి, వీరన్నతో కలిసి మహేశ్వరిని.. లలిత హత్యచేసింది. మృతదేహాన్ని వీరన్న కారులో వేసుకొని, రవి స్వగ్రామమైన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామానికి దగ్గర్లోని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామం పొలిమేరకు వెళ్లాడు. అక్కడ రాత్రి 11 గంటలకు మూసి బ్రిడ్జి కింద పిల్లర్ నంబర్ వన్ దగ్గర మహేశ్వరి మృతదేహాన్ని పూడ్చిపెట్టి వెళ్లిపోయాడు. మహేశ్వరి మిస్సింగ్ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు, లలితను తమదైన శైలిలో విచారించగా అంతా బయటపెట్టింది. ఆమె ఇచ్చిన సమాచారంతో మృతదేహాన్ని పోలీసులు బయటకు తీసి పోస్టుమార్టం చేయించారు. లలిత, రవి, వీరన్నను అదుపులోకి తీసుకున్నారు.

పిల్లలను ఏసీ గదిలో పడుకోబెడుతున్నారా..?



ఎండాకాలంలో వేడి, ఉక్కపోతల కారణంగా చిన్న పిల్లలు చికాకుగా ఏడుస్తూ అసలు నిద్రపోరు. దీంతో తల్లిదండ్రులు వాళ్లని ఏసీ గదిలో పడుకోబెడుతూ ఉంటారు. చల్లని గాలి తగలడంతో పిల్లలు హాయిగా నిద్రపోతారు. ఇలా పసి పిల్లలను ఏసీ గదిలో పడుకోబెట్టేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం.

- చిన్న పిల్లల శరీరం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి వాళ్లకి చలి పుట్టకుండా హాయిగా ఉండేలా చూసుకోవాలి. గది ఉష్ణోగ్రత 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉండేవిధంగా ఏసీని నియంత్రిస్తే సరిపోతుంది.
- పసి పిల్లలకు రోగనిరోధక శక్తి బలహీనంగా ఉంటుంది. కాబట్టి ఏసీ గాలి నేరుగా పిల్లలకు సోకకుండా చూసుకోవాలి. చల్లటి గాలి వల్ల పిల్లలకు తలనొప్పి, జలుబు, కండరాల వాపు లాంటి సమస్యలు ఏర్పడవచ్చు. ఏసీ గాలి దిశను మార్చి గదిలో చల్లదనం వ్యాపించేలా చూడాలి.
- ఏసీ గదిలో ఉండడం వల్ల పిల్లలకు దాహంగా అనిపించదు కానీ వాళ్ల శరీరంలో తేమ శాతం తగ్గుతూ ఉంటుంది. దీనివల్ల పిల్లల్లో నిర్జలీకరణ సమస్యలు వస్తాయి. ఇలా కాకుండా తరచూ పిల్లలకు మంచినీళ్లు, కొబ్బరినీళ్లు లేదా పండ్ల రసాలు తాగిస్తూ ఉండాలి.
- చాలామంది... ఏసీ గాలి లేదా చల్లదనం బయటికి వెళ్లిపోతున్నాయనే ఉద్దేశంతో గది తలుపులు, కిటికీలు పూర్తిగా మూసేస్తూ ఉంటారు. దీనివల్ల గదిలోని గాలి కలుషితమై పిల్లలకు శ్వాసకోశ సమస్యలు వస్తాయి. ఏసి గదిలో కిటికీ లేదా వెంటిలేటర్‌ను కొద్దిగా తెరచి ఉంచడం మంచిది. దీనివల్ల బయటి నుంచి తాజా గాలి లోనికి ప్రవేశిస్తుంది.
- పిల్లలను ఏసి గదిలో పడుకోబెట్టేటప్పుడు వాళ్లకి పలుచని కాటన్ దుస్తులు వేయాలి. వీటికి ఉండే సన్నని రంధ్రాల నుంచి చల్లని గాలి పిల్లల చర్మానికి సోకుతుంది. దీంతో పిల్లలు చికాకు పడకుండా హాయిగా పడుకుంటారు.
- ఏసీ ఫిల్టర్లలో ఎక్కువగా దుమ్ము, ధూళి చేరుతూ ఉంటాయి. వీటిని తరచూ శుభ్రం చేస్తూ ఉండాలి. లేకుంటే పిల్లలకు తుమ్ములు, దగ్గు, ముక్కు కారడం, డస్ట్ అలెర్జీ లాంటి సమస్యలు వస్తాయి.

వంటిల్లు

జీడిమామిడి పండు అనగానే మనకు కమ్మని జీడిపప్పు గుర్తుకువస్తుంది. ఈ పండుకు కింది భాగంలో జీడి పిక్క వేలాడుతూ ఉంటుంది. దీనిని కాల్చి లోపలి నుంచి జీడిపప్పును బయటికి తీస్తారు. జీడిమామిడి పండు తియ్యగా పుల్లగా కొంచెం వగరుగా విభిన్న రుచిలో ఉంటుంది. చాలామంది దీనిమీద ఉప్పు, కారం చల్లుకుని తింటూ ఉంటారు. దీంతో కూర, పులుసు లాంటివి కూడా చేస్తూ ఉంటారు. అలాంటి నోరూరించే జీడిమామిడి రుచులు మీ కోసం..

జీడిమామిడితో విభిన్న రుచులు..



జీడిమావి ఎడి పండ్లలో ఔషధ గుణాలు అధికంగా ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కంటి చూపు మెరుగుపడుతుంది. ఆర్థరైటిస్ సమస్యలు రావు. క్యాన్సర్ కారకాలను అడ్డుకోవడంలో జీడిమామిడి చక్కగా పని చేస్తుంది.

జీడిమామిడి కూర



కావాల్సిన పదార్థాలు

జీడిమామిడి పండ్లు- అయిదు, చింతపండు- పావు కప్పు, ఉల్లిపాయలు- రెండు, ఉప్పు- అర చెంచా, కారం- అర చెంచా నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, పచ్చిశనగపప్పు- అర చెంచా, మినపప్పు- ఒక చెంచా, ఇంగువ- చిటికెడు, పసుపు- పావు చెంచా, కరివేపాకు- రెండు రెమ్మలు, బెల్లం- రెండు చిన్న ముక్కలు, కొత్తిమీర తరుగు- రెండు చెంచాలు

తయారీ విధానం

- జీడిమామిడి పండ్లను పెద్ద ముక్కలుగా కోయాలి. చింతపండును నీళ్లలో నానబెట్టి గుజ్జు తీయాలి. ఉల్లిపాయలను చీలికల్లా కోయాలి.
- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో జీడిమామిడి ముక్కలు వేసి అవి మునిగే వరకూ నీళ్లు పోసి చిటికెడు ఉప్పు వేసి అయిదు నిమిషాలు ఉడికించాలి. తరవాత నీళ్లు వంచేయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో నూనె, ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పసుపు, పచ్చిశనగపప్పు, మినపప్పు, కరివేపాకు వేసి బాగా వేపాలి. తరవాత ఉల్లిపాయ చీలికలు వేసి కలపాలి. అవి వేగాక ఉడికించిన జీడిమామిడి పండ్ల ముక్కలు, ఉప్పు, కారం, చింతపండు గుజ్జు, బెల్లం వేసి కలపాలి. మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత కొత్తిమీర చల్లి దించాలి. ఈ కూర అన్నం, చపాతీల్లోకి రుచిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- ఉల్లిపాయలను లావుపాటి చీలికల్లా కోస్తే కూర రుచి బాగుంటుంది. వీటిని మరీ మెత్తగా మగ్గించకూడదు.
- చింతపండు గుజ్జును చిక్కగా తీయాలి. లేదంటే కూర ముద్దగా అవుతుంది.

జీడిమావి ఎడి పండ్ల జ్యూస్

కావాల్సిన పదార్థాలు

జీడిమామిడి పండ్లు- పది, పంచదార- ఒక కప్పు, మిరియాల పొడి- ఒక చెంచా, ఉప్పు- అర చెంచా, నిమ్మరసం- రెండు చెంచాలు, చల్లటి నీళ్లు- రెండు గ్లాసులు

తయారీ విధానం

- జీడిమామిడి పండ్లను శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కోయాలి.
- మిక్సీ గిన్నెలో ఉప్పు, పంచదార, మిరియాల పొడి, జీడిమామిడి పండ్ల ముక్కలు వేసి ఒక గ్లాసు చల్లటి నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఈ మిశ్రమాన్ని మరో గిన్నెలోకి వడబోయాలి. ఇందులో ఒక గ్లాసు చల్లటి నీళ్లు, నిమ్మరసం కలపాలి. ఇలా తయారు చేసిన జ్యూస్‌ని గాజు గ్లాసుల్లో పోసి సర్వ్ చేయాలి. వేసవి కాలంలో ఈ జీడిమామిడి పండ్ల జ్యూస్ తాగితే వడదెబ్బ తగలదు.



జాగ్రత్తలు

- పంచదారకు బదులు బెల్లం వేసుకోవచ్చు.
- జీడిమామిడి పండ్లు కొంచెం వగరుగా అనిపిస్తాయి కాబట్టి కొంచెం తేనె కలిపితే జ్యూస్ రుచి పెరుగుతుంది.


జీడిమామిడి పులుసు

కావాల్సిన పదార్థాలు

జీడిమామిడి పండ్లు- అయిదు, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, మెంతులు- పావు చెంచా, ఎండు మిర్చి- నాలుగు, కొత్తిమీర- కొద్దిగా, ఇంగువ- పావు చెంచా, కరివేపాకు- కొద్దిగా, పసుపు- పావు చెంచా, చింతపండు- అర కప్పు, బెల్లం- కొద్దిగా, ఉప్పు- తగినంత, కారం- రెండు చెంచాలు, సాంబార్ పొడి- అర చెంచా, బియ్యప్పిండి- రెండు చెంచాలు

తయారీ విధానం

- జీడిమామిడి పండ్లను పెద్ద ముక్కలుగా కోయాలి. కొత్తిమీరను సన్నగా తరగాలి. చింతపండును ఒక గిన్నెలో వేసి నీళ్లు పోసి నానబెట్టి గుజ్జు తీయాలి. బియ్యప్పిండిలో కొన్ని నీళ్లు పోసి కలిపి ఉంచుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నెపెట్టి అందులో నూనె వేసి వేడి చేయాలి. తరవాత ఆవాలు, మెంతులు, ఎండు మిర్చి, ఇంగువ, కరివేపాకు, పసుపు వేసి బాగా కలపాలి. ఇవి వేగిన తరవాత చింతపండు గుజ్జు, బెల్లం, ఉప్పు, కారం వేసి కలపాలి. ఒక నిమిషం తరవాత రెండు గ్లాసుల నీళ్లు పోసి సాంబార్ పొడి వేసి బాగా మరగనివ్వాలి. ఇందులో జీడిమామిడి పండ్ల ముక్కలు వేసి కలపాలి. ఇవి మగ్గిన తరవాత బియ్యప్పిండి, నీళ్లు కలిపిన మిశ్రమం పోసి కలపాలి. ఒక నిమిషం తరవాత కొత్తిమీర తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ పులుసు వేడి అన్నంలోకి బాగుంటుంది.



జాగ్రత్తలు

- జీడిమామిడి పండ్లు మెత్తగా ఉంటాయి. వీటిని ఎక్కువసేపు మగ్గించకూడదు.
- జీడిమామిడి పండ్ల ముక్కలను కొద్దిసేపు ఉప్పునీళ్లలో నానబెడితే వాటి వగరు పోతుంది.
- పులుసు చిక్కగా కమ్మగా కావాలనుకుంటే ఉడికించిన ఆలుగడ్డ ముక్కలు వేసుకోవచ్చు.

సాహసమే శ్వాసగా..!

ఆరు వరుసల రహదారులైనా... వంకర్లు తిరిగిన ఇరుకు రోడ్లయినా... ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో అయినా... మార్గం ఎంతటి కఠినమైనదైనా వెనకడుగు వేయరు. ఆత్మవిశ్వాసమే అండగా... సాహసమే శ్వాసగా... మోటర్ సైకిళ్లపై దేశమంతా చుట్టేస్తున్నారు ఈ మహిళలు. అందరూ కలిసి ఒక బృందంగా మారి... 'సీఆర్ఎఫ్ ఉమెన్ ఆన్ వీల్స్' పేరుతో... కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు బైక్‌లపై దూసుకుపోతున్నారు. 'ఇది మాకు ఒక అభిరుచి మాత్రమే కాదు... మహిళలు ఎందులోనూ తక్కువ కాదనీ... సంకల్పిస్తే కట్టుబాట్లు దాటి, భయాలను అధిగమించి, కలలను ఛేదించగలమనే బలమైన సందేశం ఇవ్వాలనుకున్నాం' అంటారు బృందంలో ఔత్సాహిక సభ్యురాలైన **శేషారాణి**.

అభిరుచి



"ఎప్పుడూ మా అన్నయ్య బైక్ మీద వెనకాల సీటులో కూర్చొనే ప్రయాణించేదాన్ని. టూర్లకు కూడా వెళుతుండేదాన్ని. 'నేనెప్పుడు డ్రైవింగ్ సీటులో కూర్చొంటానో! హ్యాండిల్ ఎప్పుడు పట్టుకొంటానో!' అని అనుకొనేదాన్ని. నేనూ నడుపుతానంటే... "ఇది నీవల్ల కాదు" అంటూ విసుక్కొనేవాడు అన్నయ్య."

"దూర ప్రాంతాలకు బైక్‌లపై వెళ్లడమంటే ఒకప్పుడు మగవారికే పరిమితమైన అంశం. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. మహిళలు కూడా మేము సైతం అంటున్నారు. దేశవ్యాప్తంగా ఎంతోమంది అమ్మాయిలు తమ లోపల గూడుకట్టుకొని ఉన్న తమ ఆకాంక్షను నెరవేర్చుకొంటున్నారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ లాంటి హెవీ వెహికిల్స్‌ను ఎంతటి కఠినమైన రోడ్లమీదైనా నడపగలుగుతున్నారు. అలాంటివారందరి స్ఫూర్తితోనే కేరళలో 'సీఆర్ఎఫ్ ఉమెన్ ఆన్ వీల్స్' ఆవిర్భవించింది. 'సీఆర్ఎఫ్' అంటే 'కాలికట్ రైడింగ్ ఫ్యామిలీ'. 2016లో ఇది ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా మహిళలు కశ్మీర్, లద్దాఖ్ తదితర ప్రాంతాలకు బైక్‌పై వెళ్లాలన్న తమ కలలను నెరవేర్చుకున్నారు. ఇందులో పద్దెనిమిదేళ్ల యువతుల నుంచి ఐదు పదులు దాటిన వారు కూడా ఉన్నారు. వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. కానీ ఒకటే కల... మోటర్ సైకిల్ నడుపుతూ దేశాన్ని చుట్టేయాలని. నాకు తెలిసి ఇంతమంది మహిళా రైడర్స్ ఉన్న క్లబ్ బహుశా మాది ఒక్కటేనేమో!

వెనక సీటు నుంచి...

నాకు కూడా చిన్నప్పటి నుంచి తీరని కల... బైక్ నడపాలని. ఎప్పుడూ మా అన్నయ్య బైక్ మీద వెనకాల సీటులో కూర్చొనే ప్రయాణించేదాన్ని. టూర్లకు కూడా వెళుతుండేదాన్ని. 'నేనెప్పుడు డ్రైవింగ్ సీటులో కూర్చొంటానో! హ్యాండిల్ ఎప్పుడు పట్టుకొంటానో!' అని అనుకొనేదాన్ని. నేనూ నడుపుతానంటే... "ఇది నీవల్ల కాదు" అంటూ విసుక్కొనేవాడు అన్నయ్య. అలా చాలా ఏళ్లు గడిచిపోయాయి. ఉద్యోగ నిమిత్తం అన్నయ్య విదేశాలకు వెళ్లిపోయాడు. దాంతో నన్ను బైక్ మీద తిప్పేవారే లేకుండాపోయారు. అప్పుడు తెలిసింది నాకు... 'సీఆర్ఎఫ్' గురించి. వెళ్లి శిక్షణ తీసుకున్నాను. మొదట్లో మా అమ్మానాన్న వద్దంటే వద్దన్నారు. నేను వినలేదు. నచ్చజెబితే చివరకు ఒప్పుకున్నారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. వెనక సీటు నుంచి డ్రైవింగ్ సీటుకు వచ్చాను.

ఆత్మవిశ్వాసమే అండగా...

శిక్షణ తరువాత నాపై నాకు పూర్తి నమ్మకం కలిగింది. నాలుగు నెలల్లోనే మొదటి ప్రయాణం... కాసర్‌గోడ్ నుంచి కన్యాకుమారికి. అది మూడు రోజుల పర్యటన. నా 'ఆర్‌ఈ క్లాసిక్ 350' మీద వెళ్లాను. ఎలాంటి రోడ్లపై ఎలా నడపాలి? ప్రమాదాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మహిళలకు ఎదురయ్యే సవాళ్లు ఏంటి?... ఇలా అనేక విషయాలు తెలుసుకోవడానికి ఆ ప్రయాణం ఒక పాఠంలా ఉపయోగపడింది. నా జీవితంలోనే అతిపెద్ద సాహస యాత్ర... బెంగళూరు నుంచి లద్దాఖ్ ట్రిప్. మొత్తం 17 రోజుల టూర్ అది. రెండు నెలల కిందట వెళ్లాం. అందరం మహిళలమే. భయంకరమైన మలుపులు, పర్వతాల అంచున సన్నని, ఏటవాలు మార్గాలు, అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు... అడుగడుగునా సవాళ్లు ఎదురవుతాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. బృందాలుగా వెళితే రైడింగ్ అనుభూతే కాదు... అందరం కలిసి ఎన్నో అనుభవాలు పంచుకోవచ్చు. నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను. డెలాయిట్‌లో పని చేస్తున్నాను. ఉద్యోగం చేస్తూనే పర్యటనల కోసం కొన్ని రోజులు కేటాయిస్తున్నాను.



యాభై ఏళ్ల వయసులో...

మాతోపాటు లద్దాఖ్ వచ్చిన బృందంలో సీమా వారియర్ ఒకరు. ఆమెకు ఇప్పుడు 54 ఏళ్లు. రాయల్ ఎన్‌ఫీల్డ్ లాంటి బైక్‌లు నడపాలన్నది ఆమె చిరకాల కోరిక. "నాకు స్కూటర్, కారు ఉన్నాయి. కానీ మోటర్‌సైకిల్ నేను నడపలేను అనేది నా నమ్మకం. చాలాకాలం అదే అపనమ్మకంతో బతికేశాను. మనసులో ఆ వెలితి అలాగే ఉండిపోయింది. ఆగివున్న బుల్లెట్‌లు కనిపిస్తే వాటిపై కూర్చొని ఫొటోలు దిగి సరిపెట్టుకొనేదాన్ని. అయితే కొవిడ్ లాక్‌డౌన్ నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. నా అభిలాష తెలుసుకొని మావారు నా యాభయ్యవ పుట్టినరోజు బహుమతిగా 'రాయల్ ఎన్‌ఫీల్డ్ మెటోర్ 350' కొని ఇచ్చారు. దానికి నేను పెట్టుకున్న ముద్దు పేరు 'పంప్కిన్'. "యాభై ఏళ్ల వయసులో అంత బరువైన బైక్‌ను నువ్వెలా నడపగలవు? పక్కన పెట్టేసెయ్" అని చాలామంది అన్నారు. నేను పట్టించుకోలేదు. చిన్న చిన్న దూరాలకు దానిపై వెళుతూ నేర్చుకున్నాను" అంటూ మా బృందంతో కలిసిన సందర్భంగా సీమా ఎంతో ఉద్వేగంగా చెప్పారు. ఆవిడే కాదు... ఇలా దేశమంతా బైక్‌పై తిరగాలని కలలు గన్న వెయ్యి మందికి పైగా మహిళలు ఇప్పుడు మా కుటుంబ సభ్యులు. వారితో కలిసి సాహస యాత్రలకు వెళ్లినప్పుడు అద్భుతమైన అనుభూతికి లోనవుతాను. ఒక మహిళగా ఇది నేను సాధించిన విజయంగా భావిస్తాను."

నలుపును దాచేసేలా...

ఎండకు చర్మం నల్లబడడం సహజం. నల్లబడిన చర్మం మీద మునుపటిలాగే మేకప్ వేసుకుంటే ఎబ్బెట్టుగా ఉంటుంది. కాబట్టి ఇలాంటి సన్ ట్యాన్‌ను దాచడం కోసం మేకప్‌లో కొన్ని మెలకువలు అదనంగా పాటించాలి.

మేకప్



- **కలర్ కరెక్టర్:** ఎండకు ముఖమంతా సమంగా నల్లబడదు. చెక్కిళ్లు, నుదురు, ముక్కు, చుబుకం...ఇలా ఉబ్బెత్తుగా ఉండే ప్రదేశాలన్నీ కళ తగ్గి, నల్లబడతాయి. కాబట్టి ఈ ప్రదేశాల్లో కలర్ కరెక్టర్ ఉపయోగించాలి. దీన్ని అద్దుకుని, చర్మంలో కలిసిపోయేలా మర్దన చేసి, ఆ తర్వాతే మేకప్ పూర్తి చేసుకోవాలి.
- **కన్‌సీలర్:** ట్యాన్ తీవ్రతను తగ్గించడం కోసం కన్‌సీలర్‌ను కూడా వాడుకోవచ్చు. ఇందుకోసం లిక్విడ్ కన్‌సీలర్‌ను ఎంచుకుని, మచ్చల మీద అప్లై చేసుకోవాలి. అయితే ఈ కన్‌సీలర్ చర్మపు రంగు కంటే ఒకట్రెండు రెట్లు లేత రంగులో ఉండేలా చూసుకోవాలి. గులాబీ రంగు నీలం రంగుల కన్‌సీలర్లకు బదులుగా చర్మపు రంగుతో నప్పే కన్‌సీలర్‌ను వాడాలి.
- **ఫౌండేషన్:** అప్పటికే ఎండకు నల్లబడిన చర్మాన్ని మరింత జాగ్రత్తగా కాపాడుకోవాలి. కాబట్టి మాయిశ్చరైజర్, ఎస్‌పిఎఫ్ ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి.
- **ట్రాన్స్‌క్యులెంట్ పౌడర్:** మేకప్ చెక్కు చెదరకుండా ఉండడం కోసం ఈ పౌడర్‌ను వాడుకోవాలి. పెద్ద బ్రష్‌తో ఈ పౌడర్‌ను ముఖం మీద పలుచగా అద్దుకోవాలి.

పాలకూర... శక్తిదాయకం

పాలక్యమీషత్కటుకం మధురం పథ్యశీతలమ్
రక్తపిత్తహరం గ్రాహి జ్ఞేయం సంతర్పణం పరమ్

పాలకూర... కొద్దిగా తీపి, కొద్దిగా కారం, సున్నితమైన రుచి కలిసిన మధురమైన శాకం. 'భోజన కుతూహలం' గ్రంథం దీన్ని శక్తిదాయకమైన, అన్ని వ్యాధుల్లోనూ తినదగిన శాకంగా పేర్కొంది. ఇది శీతల గుణంతో రక్తనాళాల సమస్యలు, జీర్ణవ్యాధుల నివారణలో సహాయపడుతుంది. రోగనిరోధకతను బలోపేతం చేస్తుంది. రక్తస్రావాన్ని, రక్తనాళాలపై ఒత్తిడిని తగ్గిస్తుంది. చలవ చేస్తుంది.

మలబద్ధకానికి ఉపశమనం

పాలకూర అత్యంత సురక్షితమైన ఆకుకూరల్లో ఒకటి. మలబద్ధకాన్ని తగ్గించి కాలవిరేచనం కలిగిస్తుంది. నీళ్ల విరేచనాలతో బాధపడేవారి దేహంలోని నీటి శాతం నియంత్రణకు తోడ్పడుతుంది.

సీరియల్ ప్రభావం

1930లలో వచ్చిన 'పొపేయి ది సైలర్ మ్యాన్' అనే కార్టూన్ పాత్ర, పాలకూర తింటూ అకస్మాత్తుగా బలాన్ని పొందే కథనం... ఈ కూరకు అమెరికా పిల్లల్లో మంచి ఆదరణ తెచ్చింది. అది అతిశయోక్తి అయినా, పాలకూర శక్తిమంతమైనదనే నిజాన్ని చాటిచెప్పింది.

ఆధునిక వైద్య శాస్త్రం ఏమంటోంది?

పాలకూరలో ఉన్న ఆహార నైట్రేట్లు (డైటరీ నైట్రేట్స్) శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి, రక్తనాళాలపై ఒత్తిడిని తగ్గిస్తాయి. పాలకూరను రక్తపోటు నియంత్రించడంలో సహాయపడే ఆహారద్రవ్యంగా... 2021లో 'యూరోపియన్ జర్నల్ ఆఫ్ ఎపిడెమియాలజీ' పేర్కొంది. దీనిలో విటమిన్ బి9 (ఫోలేట్), మెగ్నీషియం, లూటీన్ లాంటి సూక్ష్మపోషకాలు మెదడు, కళ్ల ఆరోగ్యాన్ని సమర్థంగా పెంపొందిస్తాయి. ఇది విద్యార్థులకు అవసరమైన మేధో వృద్ధి, జ్ఞాపకశక్తి మెరుగుదల కలిగించే ఆహారం. పాలకూరలో ఉండే ఎస్‌క్యూడీజీ అనే లిపిడ్లు వైరస్ పునరుత్పత్తి ప్రక్రియను నిరోధించగలవని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అవి కేన్సర్ కణాల అభివృద్ధిని కూడా అడ్డుకోగలవని చెబుతున్నాయి.

జాగ్రత్తలు అవసరం

పేగుల ఆరోగ్యానికి, కాలేయ సంరక్షణకు పాలకూర బాగా పనిచేస్తుంది. పాలకూర ఆకుల్లోని పత్రహరితంలో 'థైలాకోయిడ్' అనే పొర ఉంటుంది. ఇది కిరణజన్య సంయోగక్రియను పెంపు చేస్తుంది. అలాగే 'లిపేజ్' అనే జీర్ణ ఎంజైమ్ పనిని అడ్డగిస్తుంది. అందువల్ల పాలకూర తిన్నాక మళ్ళీ ఆకలి కలగటానికి ఎక్కువ సమయం పడుతుంది. అందుకే దీన్ని 'సంతర్పణ శక్తి కలిగిన శాకంగా 'భోజనకుతూహలం' అభివర్ణించింది. అయితే... పాలకూర వాతం, కఫం కొద్దిగా పెంచవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. దీన్ని ఎక్కువగా తినడం వల్ల మూత్రపిండంలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. కాబట్టి వాత, కఫ దోషాలున్న వారు మితంగా తీసుకోవాలి.

భోజన కుతూహలం

పాలకూరలో పోషకాలు...

విటమిన్లు: ఎ, బి6, బి9, బి12, సి, ఇ, కె

ఖనిజాలు: మెగ్నీషియం, మాంగనీస్, ఇనుము, కాల్షియం, పొటాషియం

యాంటీఆక్సిడెంట్లు: లూటీన్, బీటా-కెరోటిన్, ఫ్లావనాయిడ్స్

ఆహార పీచు (ఫైబర్): జీర్ణకోశానికి మేలు చేస్తుంది. కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది.



అపోహలూ, నిజాలూ

కొంతమంది ఆకుకూరలు నులిపురుగులకు కారణమని భావిస్తారు. కానీ పాలకూరలోని యాంటీఆక్సిడెంట్లు, డీటాక్సిఫైయింగ్ గుణాలు నులిపురుగుల పెరుగుదలను అడ్డుకుంటాయి. మద్యం సేవించడం వల్ల కాలేయం మీద కలిగే ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది తోడ్పడుతుంది. ఉబ్బసం, జీర్ణ సంబంధ వ్యాధుల నివారణలో మంచి ప్రభావం చూపుతుంది.

• గంగరాజు అరుణాదేవి

ఇరిగేషన్‌లో పదోన్నతులకు బ్రేక్

- విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక వల్లే అన్ని దశల్లో ఆగిపోయిన ప్రమోషన్లు
- బ్యారేజీల వైఫల్యానికి 40 మందికి పైగా.. ఇంజనీర్లను బాధ్యులను చేసిన నివేదిక
- క్లీన్ ఇమేజ్ ఉన్నవారికీ రాని పదోన్నతి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో పదోన్నతులకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక బ్రేక్ వేసింది. చీఫ్ ఇంజనీర్లకు ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్)లుగా పదోన్నతి కల్పించే శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశమై సిఫారసు చేసినా.. అది ముందుకు కదల్లేదు. డీపీసీ సిఫారసు చేసిన కొందరు అధికారులు కాళేశ్వరం కేసులో ఉండటంతో పదోన్నతుల ప్రక్రియ అక్కడితోనే ఆగింది. ఇక సూపరింటెండెంటింగ్ ఇంజనీర్(ఎస్ఈ)లకు చీఫ్ ఇంజనీర్లు(సీఈ)లుగా పదోన్నతి కల్పించే డీపీసీ సమావేశం జరగకుండానే ఆగిపోయింది. సీఈ నుంచి ఈఎన్‌సీ, ఎస్ఈ నుంచి సీఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) నుంచి ఎస్ఈ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ) నుంచి ఈఈ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) నుంచి డీఈఈ, అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) నుంచి ఏఈఈల పదోన్నతులపై విజిలెన్స్ నివేదిక ప్రభావం పడింది. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ జరిపి.. బ్యారేజీల వైఫల్యానికి కారకులుగా 40 మందికి పైగా ఇంజనీర్లను బాధ్యులను చేస్తూ విజిలెన్స్ నివేదిక సమర్పించిన విషయం విదితమే. ఈ నివేదికకు మాజీ ఐఏఎస్, విజిలెన్స్ కమిషన్ చైర్మన్ ఎంజీ గోపాల్ ఆమోదం తెలుపడంతో పదోన్నతుల ప్రక్రియకు పూర్తిస్థాయిలో బ్రేక్ పడింది. ప్రస్తుతం కాళేశ్వరం బ్యారేజీలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని కమిటీ విచారణ జరుపుతోంది. మరోవైపు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ నివేదిక కూడా కేంద్ర జలశక్తి శాఖ వద్ద ఉంది. ఇక మే రెండో వారంలో బ్యారేజీలపై కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రభుత్వానికి చేరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రకారం ముందుకెళుతుందా? లేక విజిలెన్స్ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటుందా? అనేది త్వరలో తేలనుంది. కాగా, సీఈ నుంచి ఈఎన్‌సీ పదోన్నతుల జాబితాలో క్లీన్ ఇమేజ్ ఉన్న అధికారి ఒక్కరే ఉన్నారు. ప్రస్తుతం ఆయన కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్‌లో సీఈగా పనిచేస్తున్నారు. సర్వీసు పరంగా కూడా ఆయన సీనియరే. అయితే ఆయనకు ఈఎన్‌సీ(అడ్మిన్)గా అవకాశం ఇవ్వాలని ఈఎన్‌సీ(జనరల్)గా ఉన్న జి.అనిల్‌కుమార్ ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేకుండా పోయింది.

పాఠశాల విద్యార్థులకు ఆర్ట్- క్రాఫ్ట్ వేసవి శిబిరం

పాఠశాల విద్యార్థులకు ట్రైబల్ ఆర్ట్- క్రాఫ్ట్‌లో శిక్షణ కోసం వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డాక్టర్ ఎ. శరత్ తెలిపారు. ఈనెల 28 తేదీ నుంచి మే ఏడో తేదీ వరకు గిరిజన సంక్షేమ భవన్‌లో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. కోయ పెయింటింగ్, బంజారా క్రాఫ్ట్, నగల తయారీ, నాయకపోడ్ మాస్కులు, కోలం వెదురు చేతి పనులు నేర్పిస్తామని తెలిపారు. గిరిజన మ్యూజియం సందర్శన, డాక్యుమెంటరీ ఫిల్మ్ షో అవకాశం కల్పించి సర్టిఫికెట్లు జారీచేస్తామన్నారు. ప్రతి విద్యార్థి రూ. 1,350 చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని, 94909 57078 నెంబరుకు ఫోన్‌పే చేసి దరఖాస్తుతోపాటు స్క్రీన్ షాట్ జతచేయాలని, నమోదుకు తుది గడువు ఈనెల 24 తేదీ వరకు ఉన్నట్లు తెలిపారు.

ఐదేళ్లు సీఎంగా రేవంత్ ఉండాలని కేసీఆర్ కోరిక

- బీజేఎల్పీ నేత ఏలేటి సంచలన వ్యాఖ్య

సీఎంగా రేవంత్ ఐదేళ్లూ ఉండాలని కేసీఆర్ కోరుకుంటున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పరస్పరం సహకరించుకుంటున్నాయని చెన్నైలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కేటీఆర్ భేటీ అయ్యారని తెలిపారు. చెన్నైలో కుదిరిన ఒప్పందంలో భాగంగానే ఫోన్ ట్యాపింగ్, ఈ-కార్ రేస్, ధరణి కేసులపై పురోగతి స్తంభించి పోయిందన్నారు.

ఈ ఏడాది నుంచైనా అమలు చేస్తారా?

- పేదలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 25% రిజర్వేషన్ల కల్పనపై హామీ ఇవ్వండి
- దీనిపై మెమోను నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తారా? లేదా? చెప్పండి
- చట్టం అమలు కోసం ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో వివరించండి
- విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా హక్కు చట్టాన్ని ఈ ఏడాది నుంచైనా అమలు చేస్తారా చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 రిజర్వేషన్ల అమలు కోసం జారీ చేసిన మెమోను నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తామని హామీ (అండర్ టేకింగ్) ఇవ్వాలని ఆదేశించింది. ఈ అంశంపై మెమో ఇచ్చిన తర్వాత అమలు కోసం ఏమేం చర్యలు చేపట్టారో వివరించాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై 2020 నాటి పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయకుండా ఇప్పటికీ జాప్యం చేస్తుండటంపై అసహనం వ్యక్తం చేసింది. తాము కోరిన వివరాలతో ఈనెల 21 నాటికి అఫిడవిట్ దాఖలు చేయాలని విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి/ డైరెక్టర్‌ను ఆదేశించింది.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నా..

రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదంటూ 2020లో హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాటిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం తాజాగా మరోసారి విచారణ జరిపింది. ఈ పిటిషన్లలో అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది సునీల్ బీ వాదిస్తూ.. "విద్యాహక్కు చట్టంలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో బలహీనవర్గాలకు 25శాతం రిజర్వేషన్ కల్పించాలన్న నిబంధనపై సుప్రీంకోర్టు రెండుసార్లు విచారణ చేపట్టింది. 'సొసైటీ ఫర్ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ముగ్గురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. సదరు తీర్పును 'ప్రమతి ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ అండ్ అదర్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమీక్షించింది. విద్యాహక్కు చట్టం అమలు కోసం అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటు సహా పలు మార్గదర్శకాలు నిర్దేశించింది. జాతీయ బాలల హక్కుల కమిషన్ కూడా గతేడాది జూన్ 7న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ను జారీ చేసింది. 25శాతం రిజర్వేషన్ అమలుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని నిర్దేశించింది" అని చెప్పారు. మరోవైపు విద్యాహక్కు చట్టం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్ 19న మెమో జారీ చేసినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని కోర్టుకు నివేదించారు.

ఆ ఉద్దేశం లేనదడం సరికాదు..

అమికస్ క్యూరీ వాదనలపై రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది రాహుల్‌రెడ్డి స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యాహక్కు చట్టం అమలు చేయాలన్న ఉద్దేశం లేదని చెప్పడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెమోను అమలు చేయడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ వివరాలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. 25శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటూ ప్రభుత్వం జారీ చేసిన మెమోను పరిశీలించింది. "విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 12 (1)(సీ) ప్రకారం సమాజంలోని వెనుకబడిన, బలహీనవర్గాల వారికి రాష్ట్రంలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటూ 2024 అక్టోబర్ 10న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఈ మెమో జారీ చేశారు. దానిని బట్టి రిజర్వేషన్ అమలు చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశంపై ఎలాంటి అనుమానం లేదు. కానీ ఈ మెమో ఎప్పటినుంచి అమలులోకి వస్తుంది? 2025-26 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలవుతుందా? అనే అంశంపై అమికస్ క్యూరీ (కోర్టు సహాయకుడు) సందేహం వ్యక్తం చేస్తున్నారు." అని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆ మెమో ఇచ్చిన తర్వాత ఏమేం చర్యలు చేపట్టారో తెలపాలని.. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి నిజమైన స్ఫూర్తితో సదరు మెమోను అమలు చేస్తామని హామీ (అండర్ టేకింగ్) ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది.

లోకాయుక్త, ఉప లోకాయుక్తల నియామకం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ లోకాయుక్త, ఉప లోకాయుక్త, తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీహెచ్ఆర్‌సీ) చైర్మన్, ఇద్దరు సభ్యులను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నియమించారు. లోకాయుక్తగా హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా జిల్లా, సెషన్స్ రిటైర్డు జడ్జి బీఎస్ జగ్జీవన్ కుమార్ నియమితులయ్యారు. అలాగే, టీజీహెచ్ఆర్‌సీ చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జి డా.జస్టిస్ షమీమ్ అక్తర్, టీజీహెచ్ఆర్‌సీ జ్యుడీషియల్ సభ్యురాలిగా రిటైర్డు సెలక్షన్ గ్రేడ్ జడ్జి శివాది ప్రవీణ, నాన్ జ్యుడీషియల్ సభ్యుడిగా రిటైర్డు ఐపీఎస్ డా.బి.కిశోర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. లోకాయుక్తగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా బీఎస్ జగ్జీవన్ కుమార్ పదవీ కాలం ఐదేళ్లు ఉంటుంది. లోకాయుక్త పదవిలో ఉన్నంత కాలం జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాలో పూర్తి స్థాయి అధికారిగా కొనసాగుతారు. ఉప లోకాయుక్త జస్టిస్ జగ్జీవన్‌కుమార్ హైకోర్టు న్యాయమూర్తి(జడ్జి) హోదాలో కొనసాగుతారు. ఇక, టీజీహెచ్ఆర్‌సీ చైర్మన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ పదవిలో మూడేళ్ల పాటు లేదా ఆయనకు 70 ఏళ్లు నిండే వరకు.. ఏది ముందు వర్తిస్తే అప్పటివరకు కొనసాగుతారు. టీజీహెచ్ఆర్‌సీ జ్యుడీషియల్ సభ్యురాలు శివాది ప్రవీణ, నాన్ జ్యుడీషియల్ సభ్యుడు డా.బి.కిశోర్ తమ పదవుల్లో మూడేళ్ల పాటు లేదా 70 ఏళ్ల వయసు నిండే వరకు.. ఏది ముందు వర్తిస్తే అంతవరకు కొనసాగుతారు.

కమిషన్‌పై మరోసారి సమావేశం

లోకాయుక్త, ఉప లోకాయుక్త, తెలంగాణ మానవ హక్కుల కమిషన్, తెలంగాణ సమాచార హక్కు కమిషన్ నియామకాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇటీవల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఆయా పదవులకు ఎంపిక చేసిన వారి జాబితాను గవర్నర్‌కు పంపగా వాటినే ఆయన ఆమోదించారు. అయితే, సమాచార హక్కు కమిషన్‌కు ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ), రాష్ట్ర సమాచార కమిషనర్ల(ఎస్ఐసీ)ను నియమించాల్సి ఉంది. ఈ పదవుల్లో ఎవరిని నియమించాలనే అంశంపై గత సమావేశంలో చర్చలు జరిగాయి. కమిషన్‌కు చీఫ్ కమిషనర్ కాకుండా మరో 10 మంది రాష్ట్ర కమిషనర్లను నియమించే అవకాశం ఉంది. అయితే, చీఫ్ కమిషనర్‌తో పాటు మరో ఐదుగురు కమిషనర్లను నియమించాలన్న ఆలోచనకు ప్రభుత్వం వచ్చింది. ప్రధాన కమిషనర్‌గా సీఎంఓలో కార్యదర్శిగా పని చేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. కమిషనర్ల పోస్టుల్లో ఎవరిని నియమించాలనేది ఇంకా తేలలేదు. దీనికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన త్వరలో మరోసారి సమావేశం జరగనుంది.

రైల్వే తీరుతో ప్రయాణికుల పరేషాన్

- రేపటి నుంచి పలు రైళ్ల మళ్లింపు
- సికింద్రాబాద్ బదులు చర్లపల్లి టెర్మినల్
- పొంతనలేని సమాచారంతో గందరగోళం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ఎక్కాల్సిన రైలు చర్లపల్లి టెర్మినల్ నుంచి బయల్దేరుతుందంటూ మొబైల్ ఫోన్లకు వస్తున్న మేసేజ్‌లతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మేసేజ్‌లు చూసుకోకుండా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి పరేషాన్ అవుతున్నారు. చివరి నిమిషంలో స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు చర్లపల్లి టర్మినల్‌కు వెళ్లడానికి వీలుకాక ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారు. సికింద్రాబాద్ స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతుండడంతో పనులకు ఆటంకం కలుగకుండా ముఖ్యమైన రైళ్లను చర్లపల్లి టెర్మినల్ నుంచి ప్రారంభిస్తున్నారు.

స్పష్టత లేని ఎస్ఎంఎస్‌లతో గందరగోళం

ఈ నెల 13నుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు బయల్దేరే టెర్మినళ్లను మార్పు చేసిన విషయమై దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల అధికారులు ఇచ్చిన సమాచారానికి, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్(సీఆర్ఐఎస్) నుంచి ప్రయాణికులకు అందుతున్న సమాచారానికి పొంతన లేకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు. ఏ రైలు ఎప్పుడు, ఎక్కడ్నుంచి బయల్దేరుతుంది, ఏఏ స్టేషన్లలో ఆగుతుందనే అంశాలపై ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం ఇవ్వడంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు తరచుగా విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రయాణికుల మొబైల్స్‌కు కేవలం సంక్షిప్త సందేశాలను పంపి సీఆర్ఐఎస్ సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారని సమాచారం.

సికింద్రాబాద్ బదులు చర్లపల్లి నుంచి వెళ్లే రైళ్లు ఇవే!

13వ తేదీ నుంచి సికింద్రాబాద్ నుంచి బెంగళూరు వెళ్లే గరీబ్‌రథ్ (12735/12736)ఎక్స్‌ప్రెస్

15వ తేదీ నుంచి సికింద్రాబాద్- రేపల్లె మధ్య నడిచే(17645/17646)రేపల్లె ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-మణుగూరు(12745/12746)ఎక్స్‌ప్రెస్

22వ తేదీ నుంచి విశాఖపట్నం-ముంబై-విశాఖపట్నం(20809/20810)ఎక్స్‌ప్రెస్

23వ తేదీ నుంచి కాకినాడ- షిర్డీ-కాకినాడ ట్రైవీక్లీ(17205/17206)ఎక్స్‌ప్రెస్

24వ తేదీ నుంచి విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ-విశాఖపట్నం వీక్లీ(18503/18504)ఎక్స్‌ప్రెస్

25వ తేదీ నుంచి లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్-నాగర్‌సోల్-నర్సాపూర్(12787/12788)ఎక్స్‌ప్రెస్,

నగరంలోని ఇతర స్టేషన్ల నుంచి బయల్దేరే రైళ్లు ఇవీ!

14వ తేదీ నుంచి సిద్దిపేట వెళ్లే రెండు డెమో రైళ్లు మల్కాజిగిరి స్టేషన్ నుంచి

15వ తేదీ నుంచి సికింద్రాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి

16వ తేదీ నుంచి పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌కు బదులుగా ఉమ్దానగర్ నుంచి

16వ తేదీ నుంచి సికింద్రాబాద్-పుణె ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ టెర్మినల్ నుంచి

చిత్రజ్యోతి

SINCE 1965


గొప్ప అనుభూతిని ఇస్తుంది



నిర్మాత మధు

తమన్నా భాటియా ప్రధాన పాత్రలో దర్శకుడు సంపత్ నంది పర్యవేక్షణలో అశోక్ తేజ తెరకెక్కించిన చిత్రం 'ఓదెల-2'. 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ చిత్రమిది. డి.మధు నిర్మించారు. ఈనెల 17న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా నిర్మాత మధు మీడియాతో చిత్ర విశేషాలను పంచుకొన్నారు. 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ప్రాణం. కమర్షియల్‌గా కాకుండా సినిమాపై ప్యాషన్‌తోనే ఇండస్ట్రీలోకి వచ్చాను. నాకు మొదటి నుంచి ఏదైనా వెరైటీగా చేయాలని ఉండేది. కాశీలో ఈ సినిమాని ప్రారంభించాం. అలాగే మహా కుంభమేళాలో టీజర్‌ని లాంచ్ చేసాం. సినిమాలో తమన్నా అద్భుతంగా నటించారు. ఏప్రిల్, మే నెలల్లో చెప్పులు వేసుకోకుండానే ఎర్రటి ఎండలో షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సినిమా కథలో ప్రతి పాత్రకీ ప్రాధాన్యం ఉంటుంది. ప్రేక్షకులు ఆ పాత్రలతో లీనం అయిపోతారు. గొప్ప అనుభూతిని పొందుతారు' అని అన్నారు.

అదే తేదీన 'వీరమల్లు'



ఈ ఏడాది విడుదల కానున్న భారీ చిత్రాల్లో 'హరి హర వీర వీరమల్లు' ఒకటి. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏ.దయాకర్ రావు, ఏ.ఎం. రత్నం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర నిర్మాణం తుది దశకు చేరుకుంది. రీ రికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సినిమా ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు గతంలోనే మేకర్స్ ప్రకటించారు. అయితే సినిమా విడుదల వాయిదా పడిందంటూ కొద్ది రోజులుగా ఫిల్మ్‌నగర్‌లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం శుక్రవారం స్పందించింది. ముందు చెప్పినట్లుగానే మే 9న బాక్సాఫీసు వద్ద 'హరి హర వీరమల్లు' గర్జించనున్నారంటూ స్పష్టం చేసింది. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తోన్న ఈ చిత్రంలో సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

వందేళ్ల నిరీక్షణకు ముగింపు...

స్టంట్ డిజైన్ కేటగిరీలో ఆస్కార్ పురస్కారం



ప్రతిష్ఠాత్మక ఆస్కార్ పురస్కారాల్లో కొత్తగా మరో విభాగం చేరింది. ఇక నుంచి స్టంట్ డిజైన్ విభాగంలోనూ పురస్కారాలు ఇవ్వనున్నట్లు అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించింది. సినిమా మ్యాజిక్‌లో భాగమైన స్టంట్స్ ఇకపై ఆస్కార్ పురస్కారాల్లోనూ భాగమవనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. 2028లో నిర్వహించబోయే వందో ఆస్కార్ పురస్కారాలలో స్టంట్ డిజైన్ కేటగిరీలో పురస్కారాన్ని అందజేస్తామని వెల్లడించారు. 2027లో విడుదలయ్యే చిత్రాల నుంచి విజేతను ఎంపిక చేస్తారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో 'ఎవ్రీథింగ్ ఎట్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్, మిషన్ ఇంపాజిబుల్' లాంటి హాలీవుడ్ చిత్రాలతో పాటు 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని ఫైట్ సీక్వెన్స్‌కు సంబంధించిన ఇమేజ్‌ను అకాడమీ నిర్వాహకులు ఉపయోగించడంపై దర్శకుడు రాజమౌళి హర్షం వ్యక్తం చేశారు. 'ఎట్టకేలకు వందేళ్ల నిరీక్షణ తర్వాత 2027లో విడుదలయ్యే చిత్రాలకు కొత్తగా స్టంట్ డిజైన్ కేటగిరీలో పురస్కారాలు ఇవ్వబోతున్నందుకు ఆనందంగా ఉంది. పోస్టర్‌లో 'ఆర్ఆర్ఆర్'ను భాగం చేసినందుకు సంతోషంగా ఉంది. ఈ కలను నిజం చేసిన నిర్వాహకులకు ధన్యవాదాలు' అంటూ రాజమౌళి స్పందించారు.

ఆత్మవిశ్వాసమే అసలైన అందం



ఒత్తైన, పొడవాటి జుట్టు ఆడవారి అందాన్ని రెట్టింపు చేస్తుంది. వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. జుట్టు ఏ కాస్త రాలినా వారు అస్సలు తట్టుకోలేరు. అలాంటి కురులపై మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కానీ ఒకప్పటి హీరోయిన్ మాత్రం అందంగా కనిపించాలంటే జుట్టు అవసరమా? అని ప్రశ్నించారు. ఆత్మవిశ్వాసమే అసలైన అందం అని నిర్వచిస్తూ గుండు గీయించుకొని అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసారు. ఆమె మరెవరో కాదు... ఒకప్పటి స్టార్ హీరోయిన్ భానుప్రియ చెల్లి శాంతిప్రియ. తెలుగులో మహర్షి, కలియుగ అభిమన్యుడు, సింహ స్వప్నం లాంటి పలు విజయవంతమైన చిత్రాల్లో శాంతి ప్రియ నటించారు. కొన్ని తమిళ చిత్రాల్లోనూ నటించిన ఆమె..ఆ తర్వాత బాలీవుడ్ వెళ్లిపోయారు. నటుడు సిద్ధార్థ్ రాయ్‌ని 1999లో వివాహం చేసుకొన్నారు. వీరికి ఇద్దరు సంతానం. 2004లో సిద్ధార్థ్ రాయ్ గుండెపోటుతో మరణించారు. కాగా, తన లేటెస్ట్ లుక్‌తో అందరినీ షాక్‌కు గురిచేశారు శాంతిప్రియ. చనిపోయిన తన భర్త బ్లేజర్ ధరించి గుండుతో దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'ఈ మధ్యే గుండు కొట్టించుకొన్నాను. విభిన్నమైన అనుభూతిని పొందుతున్నా. మహిళగా మనం జీవితంలో కొన్ని పరిమితులు పెట్టుకుంటాం. సమాజం విధించిన కట్టుబాట్లు, నియమ నిబంధనలు పాటిస్తూ మనల్ని మనమే కట్టడి చేసుకుంటాం. వీటి నుంచి నేను స్వేచ్ఛను కోరుకున్నాను. నన్ను నేను విముక్తి చేసుకున్నాను. అందం అంటే ఇదే అనే ప్రమాణాలను బ్రేక్ చేయాలనుకున్నాను. ఎంతో ధైర్యంతో ముందడుగు వేశాను. నా భర్త జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అతని బ్లేజర్ ధరించాను' అని ఆ పోస్టులో పేర్కొన్నారు.

హిట్ జోడీ మళ్లీ?



హృతిక్ రోషన్ కథానాయకుడిగా 'క్రిష్' ఫ్రాంచైజీలో వచ్చిన మూడు చిత్రాలు ఘన విజయాన్ని అందుకున్నాయి. ఇప్పుడు కొనసాగింపుగా 'క్రిష్ 4' వస్తోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రంలో హృతిక్‌రోషన్ కథానాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. హృతిక్‌కు జోడీగా నటించబోయే హీరోయిన్‌ల జాబితాలో ఇప్పటివరకూ పలువురి పేర్లు వినిపించాయి. ఈ ఫ్రాంచైజీలో వచ్చిన గత చిత్రాల్లో కథానాయికగా నటించారు ప్రియాంక చోప్రా. వీరిద్దరిదీ విజయవంతమైన జోడీగా నిలిచింది. ఇప్పుడు 'క్రిష్ 4'లోనూ ఆమె భాగమవ్వబోతున్నారని తెలుస్తోంది. ఇటీవలే ప్రియాంకచోప్రా, ఆమె భర్త నిక్ జొనాస్‌ను కలసినట్లు హృతిక్ తెలిపారు. దీంతో ఈ సినిమాలో కథానాయికగా ప్రియాంక చోప్రా నటించడం దాదాపు ఖాయమైనట్లే అని భావిస్తున్నారు. ఆమె ప్రస్తుతం రాజమౌళి-మహేశ్‌బాబు చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు. 'క్రిష్ 4'లో హృతిక్ మూడు పాత్రలు పోషించనున్నారనీ, ప్రీతిజింటా, రేఖ, వివేక్ ఒబెరాయ్ కీలకపాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది.



ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2026 ప్రారంభంలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.

అన్నాదమ్ముల అనుబంధం



అన్నాదమ్ముల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'సోదరా'. సంపూర్ణేశ్‌బాబు కథానాయకుడు. సంజోష్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా కథానాయికలు. మోహన్ మేనంపల్లి దర్శకుడు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు సాయిరాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ 'సోదరా' ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంపూర్ణేశ్‌బాబు మాట్లాడుతూ 'అన్నాదమ్ముల అనుబంధాన్ని కొత్త కోణంలో ఆవిష్కరించాం. నా నిజ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రను ఈ చిత్రంలో పోషించాను' అని చెప్పారు. బాబూమోహన్‌లాంటి సీనియర్ నటుడితో పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చిందని సంజోష్ తెలిపారు. చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో వస్తున్నాం అని బాబూమోహన్ తెలిపారు. పవన్ కల్యాణ్ 'బ్రో' చిత్రంలా 'సోదరా' కూడా మంచి విజయం అందుకోవాలని ఎస్‌కేఎన్ ఆకాంక్షించారు. సంపూ కెరీర్‌లో ఈ చిత్రం మైలురాయిగా నిలవాలని సాయిరాజేశ్ కోరుకున్నారు.



పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

పూలే ఆశయాలకు విరుద్ధంగా పాలన

- గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ నట్టేట ముంచింది
- బడుగు వర్గాలకు కొండంత ధైర్యం పూలే: సంజయ్
- బీసీలపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది మొసలి కన్నీరు: లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు విరుద్ధంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. మహాత్ములకు నివాళులర్పించడమంటే వారి జయంతి, వర్ధంతిలను నిర్వహించడం మాత్రమే కాదని, వారి ఆశయాలను నెరవేర్చడమని వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ అణిచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్, బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం జ్యోతిరావు పూలే అని కొనియాడారు. చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని నమ్మి, అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడని ప్రశంసించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పుణ్యమా అని.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అప్పుల్లో మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 6 గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ నట్టేట ముంచిందని దుయ్యబట్టారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ఓటుబ్యాంకు రాజకీయాల్లో భాగంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టిందని విమర్శించారు. గతంలో బీసీల వాటాను 51 నుంచి 46 శాతానికి తగ్గించిన కాంగ్రెస్.. ఇప్పుడు ముస్లింలను ఓబీసీల్లో చేర్చే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు.

పలు ప్రాజెక్టుల అంచనా వ్యయం పెంపు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-3లో నార్లాపూర్ నుంచి ఏదుల దాకా నీటిని తరలించే కాలువ సవరణ అంచనాలకు ప్రభుత్వం పరిపాలనా అనుమతినిచ్చింది. దీని అంచనా వ్యయం రూ.416.10 కోట్లు కాగా.. సవరిస్తేనే పనులు చేస్తానని కాంట్రాక్టర్ రెండున్నరేళ్లుగా పనులు ఆపేశారు. తాజాగా మంత్రివర్గంలో సవరణ అంచనాలకు ఆమోదం లభించింది. దీంతో అంచనాను రూ.780.63 కోట్లకు సవరిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా పరిపాలనా అనుమతినిచ్చారు. తాజా నిర్ణయంతో 8.325 కి.మీ. మేర పనులు చేయడానికి వీలు కలిగింది. ఈ కాలువ పూర్తయితేనే నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించడానికి వీలు కలగనుంది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల వద్ద చేపట్టే రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.41 టీఎంసీలకు తగ్గించి.. రూ.574.56 కోట్లతో చేపట్టడానికి అంచనాలను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో కాకతీయ కెనాల్ కింద రోళ్లవాగు చెరువు సవరణ అంచనాలకు పరిపాలనపరమైన అనుమతులు ఇచ్చారు. దీని అంచనా వ్యయం రూ.136.81 కోట్లు కాగా.. రూ.153 కోట్లకు సవరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యుత్ సంస్కరణలకు సిద్ధం!

- ఆర్డీఎస్ఎస్, ఇతర పథకాల్లో చేరేందుకు పంపిణీ సంస్కరణల కమిటీ ఏర్పాటు.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ రంగంలో సంస్కరణల అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్డీఎస్ఎస్)తోపాటు 'ధర్తి అబా జన్‌జాతీయ గ్రామ ఉత్కర్ష్ యోజన (డీఏజేజీయూఏ) ఇతరత్రా పథకాల అమలుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లకు తుది రూపు ఇవ్వడంతోపాటు పథకాల అమలు పర్యవేక్షణకుగాను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్కరణల కమిటీ(డీఆర్‌సీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి మెంబర్/కన్వీనర్‌గా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, అటవీ పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యులుగా, దక్షిణ డిస్కమ్ సీఎండీ, ఉత్తర డిస్కమ్ సీఎండీలు ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర పంపిణీ సంస్కరణల కమిటీని వేస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం జీవో నం.13ను జారీ చేశారు. ఈ కమిటీ ఆర్డీఎస్ఎస్, డీఏజేజీయూఏలు, ఇతర కేంద్ర పథకాల్లో చేరడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తుంది. గిరిజన/ఆదివాసీ ప్రాంతాల్లో విద్యుదీకరణకు ఉద్దేశించి కేంద్రం డీఏజేజీయూఏను ప్రవేశపెట్టింది. కాగా ఆర్డీఎస్ఎస్‌లో చేరేందుకు డీపీఆర్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపాలి. ఈ పథకం నిబంధనల అమలుకు అంగీకరిస్తూ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు), రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం మధ్య త్రైపాక్షిక ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని 27 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు మినహా మిగిలిన వినియోగదారులందరికీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించాల్సి ఉంటుంది. దక్షిణ డిస్కమ్ పరిధిలో ప్రీపెయిడ్ మీటర్లకు రూ.4వేల కోట్లు, సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు/నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల వృద్ధికి మరో రూ.5,000 కోట్ల ఖర్చవుతుందని అంచనావేశారు. ఉత్తర డిస్కమ్ పరిధిలో ప్రీపెయిడ్ మీటర్లకు రూ.2,800 కోట్లు, మౌలిక సదుపాయాల వృద్ధికి రూ.3,500 కోట్లు కానుందని లెక్కగట్టారు. దేశ వ్యాప్తంగా భారీ నష్టాల్లో ఉన్న డిస్కంలను మళ్లీ లాభాలబాట పట్టించాలన్న లక్ష్యంతో కేంద్రం ఈ పథకాన్ని తెచ్చింది. దీనికోసం ఏటా చార్జీలను సవరించాల్సి ఉంటుంది. దేశ వ్యాప్తంగా రూ.3.03లక్షల కోట్లతో ఈ పథకం అమలుకు కార్యాచరణను గతంలోనే ప్రకటించింది. ఇందులో రూ.97,631 కోట్లను కేంద్రం అందించనుంది. ఈ పథకంలో చేరితే రాష్ట్రంలోని రెండు డిస్కమ్‌లకు కేంద్రం నుంచి మొత్తంగా రూ.5వేల కోట్ల సాయం అందనుంది.

జైలుకు గోరంట్ల మాధవ్

- పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిపై దాడి కేసులో అరెస్టు
- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు
- అరెస్టు సమయంలో, కోర్టులో పోలీసులపై మాధవ్ వీరంగం
- ఏం తమాషా చేస్తున్నారా..? ఎంపీగా చేశా..
- పోలీస్ అధికారిని అంటూ రెచ్చిపోయిన మాజీ ఎంపీ

గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిపై దాడిచేసి, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై జులుం ప్రదర్శించిన కేసులో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు గుంటూరు కోర్టు రిమాండ్ విధించింది. మాజీ సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన కేసులో చేబ్రోలు కిరణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని గుంటూరు ఎస్పీ కార్యాలయానికి తీసుకొస్తుండగా మాధవ్ మరికొందరితో కలిసి అటకాయించి దాడి చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి.. మాధవ్ సహా ఆరుగురిని అరెస్టు చేశారు. వారిని గుంటూరులోని స్పెషల్ మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టారు. మెజిస్ట్రేట్ వారికి 14 రోజుల రిమాండ్ విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్పీ సతీశ్‌కుమార్ మీడియాకు వివరించారు. చేబ్రోలు కిరణ్‌ను అరెస్టు చేసి తరలిస్తుండగా.. గోరంట్ల మాధవ్ అడ్డగించారని, పోలీస్ వారిని నెట్టివేస్తూ కిరణ్‌పై దాడి చేశారని తెలిపారు. మాజీ పోలీసు అధికారి అయిన వ్యక్తి నుంచి ఇలాంటి ప్రవర్తన ఊహించలేమని పేర్కొన్నారు.

పోలీసులపై వీరంగం వేస్తూ..

మరోవైపు అరెస్టు తర్వాత చేబ్రోలు కిరణ్‌కు ముసుగు వేసి పోలీసులు మీడియా ఎదుట హాజరుపరిచారు. అదే తరహాలో కిరణ్‌పై దాడిచేసిన వారినీ హాజరుపర్చాలని, ఒక్క మాధవ్‌ను మినహాయించాలని భావించారు. కానీ అప్పటికే పోలీసులపై మాధవ్ వీరంగం చేశారు. "ఏం తమాషాలు చేస్తున్నారా? దోపిడీ దొంగనా నేను? దేశానికి ఎంపీగా చేశా.. పోలీస్ ఆఫీసర్‌ని.... ఏమనుకుంటున్నారు...?" అంటూ రెచ్చిపోయారు. అనంతరం మాధవ్ సహా నిందితులందరినీ పోలీసులు కోర్టుకు తీసుకెళ్లారు. గోరంట్ల మాధవ్‌కు బెయిల్ ఇప్పించేందుకు మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, హైకోర్టు సీనియర్ న్యాయవాది మనోహర్ రెడ్డి, మరికొందరు న్యాయవాదులు ప్రయత్నించినా.. మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు.

డ్రోన్లతో అడవిని జల్లెడ పట్టి...

తప్పిపోయిన మహిళల గుర్తింపు!

- తునికాకు సేకరణకు వెళ్లి రాత్రంతా అడవిలోనే చిక్కుకుపోయిన మహిళలు
- నిర్మల్ ఎస్పీ జానకి ఆధ్వర్యంలో గాలింపు
- 2 గంటల్లోనే వారి జాడ కనుగొన్న బృందాలు
- సురక్షితంగా ఇంటికి చేరిన నలుగురు మహిళలు
- పోలీసులను ఘనంగా సన్మానించిన గ్రామస్థులు

మామడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : తునికాకు సేకరణకు వెళ్లిన నలుగురు మహిళలు సాయంత్రం వేళ అడవిలో దారి తప్పారు.. ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితుల్లో రాత్రంగా అడవిలోనే బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశారు.. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ స్వయంగా రంగలోకి దిగారు. డ్రోన్లతో అడవిని జల్లెడ పట్టి.. వారి జాడను కనిపెట్టారు.. నిర్మల్ జిల్లాలోని మామడ మండలం కప్పన్‌పల్లి గ్రామ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం తూనికాకు కోసేందుకు గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి నలుగురు మహిళలు వెళ్లారు. అయితే రాత్రి కావడంతో అడవిలోకి వెళ్లిన వారు తప్పిపోయి అక్కడే చిక్కుకుపోయారు. శుక్రవారం ఉదయం వరకు కూడా వారు ఇంటికి రాలేదు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనా స్వయంగా రంగంలోకి దిగారు. శుక్రవారం ఉదయాన్నే మూడు ప్రత్యేక బృందాలతో అటవీ ప్రాంతానికి వెళ్లారు. అధునాతన డ్రోన్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల తర్వాత తప్పిపోయిన నలుగురు మహిళలను గుర్తించి.. సురక్షితంగా వారి ఇంటికి చేర్చారు. తప్పిపోయిన మహిళలను సురక్షితంగా ఇంటికి చేర్చిన ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ రాజేష్ మీనాతో పాటు పోలీస్ బృందాలను గ్రామస్థులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మహిళలను రక్షించడంలో పాల్గొన్న పోలీస్ బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



తమను కాపాడిన నిర్మల్ ఎస్పీ జానకిని అభినందిస్తున్న మహిళలు

ఫారమ్ -VII

(సెక్షన్-సబ్-రూల్ (1) రూల్-25) మరియు (సెక్షన్- 19(1) చట్టము-30/2013)

తెలంగాణ ప్రభుత్వము - రెవిన్యూ (భూసేకరణ) శాఖ

కలెక్టర్ / సంయుక్త కలెక్టర్ / స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ

ఫైల్ నెం. G1/746/2018 **రూఢీ ప్రకటన (డిక్లరేషన్)** తేది: 07-04-2025

తెలంగాణ ప్రభుత్వము/ కలెక్టర్ సంగారెడ్డి గారు ఈ దిగువ చూపబడిన సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం, హద్నూర్ గ్రామములో దాదాపు ఎ. 288.13 గుంటల భూమి ప్రజల ఉపయోగార్థము నిమ్జ్ ప్రాజెక్ట్ ఏర్పాటు నిమిత్తం అవసరం ఉన్నదని భావించడం జరిగింది.

తదనుగుణంగా పై ప్రాజెక్ట్ కోసం కొద్ది హెచ్చు తగ్గులతో సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం హద్నూర్ గ్రామములో దాదాపు ఎ. 288.13 గుం. గల భూమి ఈ దిగువ చూపిన ప్రకారం సేకరించుటకు గాను డిక్లరేషన్ (రూఢి ప్రకటన) ను జారి చేయనైనది.

జిల్లా. సంగారెడ్డి | మండలం. న్యాల్కల్ | గ్రామము. హద్నూర్

క్రమ సంఖ్య	సర్వే నెంబర్	భూమి స్వభావము	భూమి రకము	సేకరించవలసిన విస్తీర్ణం (ఎ.గుం.)	ప్రయోజనం గల వ్యక్తి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు: రకము	మొత్తం	నిర్మాణాలు: రకము	[illegible]
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	83/ఇ6/1	పట్టా	ఖుష్కీ	0.21	రత్నం తం(నాగప్ప)	రాఘవేంద్ర సింగ్	అంజమ్మ	సురేందర్	అజం ఖాన్	0	0	0	0
2	83/ఇ	పట్టా	ఖుష్కీ	2.10	సురేందర్ తం (లక్ష్మయ్య)	రాఘవేంద్ర సింగ్	సంగ రెడ్డి	రాములు	రత్నం	0	0	1బోరు	0
3	83/ఇ2/1ఆ	పట్టా	ఖుష్కీ	0.20	సుకర సుబ్బారావు తం (కమయ్య)	భూపాల్ కుమార్	సంగ రెడ్డి	భూపాల్ కుమార్	సంగ రెడ్డి	మామిడి	1100	7 బోరు	0
4	83/ఇ1/అ	పట్టా	ఖుష్కీ	0.20	సుకర సుబ్బారావు తం (కమయ్య)	భూపాల్ కుమార్	సంగ రెడ్డి	భూపాల్ కుమార్	సంగ రెడ్డి	దానిమ్మ	7500	0	0
5	83/ఇ2	పట్టా	ఖుష్కీ	0.35	యస్ శివ కుమార్ తం (శివప్ప)	రాఘవేంద్ర సింగ్	సురేందర్	నర్సమ్మ	శివసింగ్	0	0	0	0
6	83/ఇ1	పట్టా	ఖుష్కీ	0.35	సత్యరం రాములు తం (శివప్ప)	రాఘవేంద్ర సింగ్	సురేందర్	నర్సమ్మ	శివసింగ్	0	0	1 బోరు,1 బావి	0
7	83ఆ1	పట్టా	ఖుష్కీ	2.12	అగ్సర్ ఖాన్ తం (గఫూర్ ఖాన్)	శివసింగ్	నర్సమ్మ	అంజమ్మ	శామ్యూల్	0	0	0	0
8	83/ఉ1	పట్టా	ఖుష్కీ	1.20	నూర్ జహాన్ బేగం భర్త(మొహమ్మద్ అజం ఖాన్)	శివసింగ్	నర్సమ్మ	అంజమ్మ	శామ్యూల్	0	0	0	0
9	83ఈ	పట్టా	ఖుష్కీ	2.10	సంగమ్మ భర్త(అంజప్ప)	శివసింగ్	నర్సమ్మ	[illegible]	అక్బర్ ఖాన్	0	0	1 బోరు	0
మొత్తము:				11.23									
10	84/1అ1ఆ	పట్టా	ఖుష్కీ	2.05	సుంకర సుబ్బారావు తం(కమయ్య)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	టేకు	700	0	0
11	84/B1ఆ	పట్టా	ఖుష్కీ	1.02	కోగంటి ప్రవీణ తం (రమేష్ బాబు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
12	84/E1ఆ	పట్టా	ఖుష్కీ	0.17	కోగంటి ప్రవీణ తం (రమేష్ బాబు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
13	84/F1ఆ	పట్టా	ఖుష్కీ	1.16	కోగంటి ప్రవీణ తం (రమేష్ బాబు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	కొబ్బరి	10	0	0
14	84/G1/2	పట్టా	ఖుష్కీ	0.19	కోగంటి ప్రవీణ తం (రమేష్ బాబు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
15	84/1ఆ	పట్టా	ఖుష్కీ	1.36	సంగారెడ్డి తం (భీమ్ రెడ్డి)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
16	84/1ఉ	పట్టా	ఖుష్కీ	1.20	సంగారెడ్డి తం (భీమ్ రెడ్డి)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
17	84/I1ఆ	పట్టా	ఖుష్కీ	3.15	కోగంటి రమేష్ బాబు తం (వెంకట రత్నం)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	జామ	7500	0	0
18	84/2	పట్టా	ఖుష్కీ	4.20	సంగారెడ్డి తం (భీమ్ రెడ్డి)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	2బోరు	0
19	84/C	పట్టా	ఖుష్కీ	1.20	సంగారెడ్డి తం (భీమ్ రెడ్డి)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
20	84/3/Bఆ	పట్టా	ఖుష్కీ	2.02	సుంకర అరుణ కుమారి భర్త (సుబ్బరావు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
21	84/3/Aఆ	పట్టా	ఖుష్కీ	2.03	సుంకర అరుణ కుమారి భర్త (సుబ్బరావు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
22	84/ఈ1ఆ	పట్టా	ఖుష్కీ	2.03	సుంకర సుధాకర్ తం (సుబ్బరావు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
23	84/A1ఆ	పట్టా	ఖుష్కీ	2.03	సుంకర సుధాకర్ తం (సుబ్బరావు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
24	84/H1ఆ	పట్టా	ఖుష్కీ	0.27	కోగంటి ప్రవీణ తం (రమేష్ బాబు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
25	84/1ఇ2	పట్టా	ఖుష్కీ	0.27	సుంకర సుధాకర్ తం (సుబ్బరావు)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
26	84/Dఆ	పట్టా	ఖుష్కీ	1.05	సుంకర శ్రవణ జ్యోతి భర్త (సుధాకర్)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	1 RCC భవనం	0
27	84/1ఇ1	పట్టా	ఖుష్కీ	1.13	సుంకర శ్రవణ జ్యోతి భర్త (సుధాకర్)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
28	84/1ఇ2ఆ	పట్టా	ఖుష్కీ	2.02	సుంకర శ్రవణ జ్యోతి భర్త (సుధాకర్)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	3 షెడ్స్	0
29	84/G1/1	పట్టా	ఖుష్కీ	0.37	కోంగటి రమేష్ బాబు తం (వెంకట రత్నం)	నర్సమ్మ	రాఘవేంద్ర సింగ్	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
మొత్తము:				33.12									
30	85/D4/2/1ఇ1	పట్టా	ఖుష్కీ	0.20	సుంకర పూర్ణచందర్ రావు తం (సుబ్బా రావు)	స్వరూప	రాఘవేంద్ర సింగ్	రాఘవేంద్ర సింగ్	ఈరన్న	0	0	0	0
31	85/D3/2	పట్టా	ఖుష్కీ	3.20	హెచ్ నీరజ భర్త (సంజయ్)	స్వరూప	రాఘవేంద్ర సింగ్	రాఘవేంద్ర సింగ్	ఈరన్న	0	0	1 బోరు	0
32	85/D4/1/2ఆ	పట్టా	ఖుష్కీ	1.00	సుంకర పూర్ణచందర్ రావు తం (సుబ్బారావు)	స్వరూప	రాఘవేంద్ర సింగ్	రాఘవేంద్ర సింగ్	ఈరన్న	0	0	0	0
33	85/A/1/2	పట్టా	ఖుష్కీ	1.20	ఎం.స్వరూప భర్త (సంగారెడ్డి)	సంగారెడ్డి	నిర్మల	రమేష్	అంజమ్మ	0	0	0	0
34	85/C1	పట్టా	ఖుష్కీ	1.20	ఎం.స్వరూప భర్త (సంగారెడ్డి)	సంగారెడ్డి	నిర్మల	రమేష్	అంజమ్మ	0	0	1బోరు	0
35	85/B2	పట్టా	ఖుష్కీ	0.38	లక్ష్మి భర్త (ఈరన్న)	ఈరన్న	అంజమ్మ	నిర్మల	స్వరూప	0	0	0	0
36	85/B3ఆ2	పట్టా	ఖుష్కీ	0.13	లక్ష్మి భర్త (ఈరన్న)	ఈరన్న	అంజమ్మ	నిర్మల	స్వరూప	0	0	0	0
37	85/C/2ఆ	పట్టా	ఖుష్కీ	1.00	సుంకర పూర్ణచందర్ రావు తం (సుబ్బారావు)	ఈరన్న	అంజమ్మ	నిర్మల	స్వరూప	0	0	0	0
38	85/A/4ఆ	పట్టా	ఖుష్కీ	2.00	సుంకర పూర్ణచందర్ రావు తం (సుబ్బారావు)	ఈరన్న	అంజమ్మ	నిర్మల	స్వరూప	0	0	0	0
39	85/C/1ఆ	పట్టా	ఖుష్కీ	0.12	చాకలి అంజన్న తం (మానయ్య)	వెంకటేశం	సంగి గొండ	లక్ష్మీ	తిప్ప రాజు	0	0	1బోరు	0
40	85/B1ఆ/2	పట్టా	ఖుష్కీ	0.05	చాకలి అంజన్న తం (మానయ్య)	వెంకటేశం	సంగి గొండ	లక్ష్మీ	తిప్ప రాజు	0	0	1 బావి	0
41	85/B1ఆ/1	పట్టా	ఖుష్కీ	0.14	ప్రభు తం (బాగా రాజు)	వెంకటేశం	సంగి గొండ	లక్ష్మీ	తిప్ప రాజు	0	0	0	0
42	85/D	పట్టా	ఖుష్కీ	0.12	ఎం. స్వరూప భర్త (సంగారెడ్డి)	ఈరన్న	అంజమ్మ	నిర్మల	స్వరూప	0	0	1బోరు	0
43	85/B3ఆ1	పట్టా	ఖుష్కీ	0.12	చాకలి మల్లమ్మ (అడివప్ప)	ఈరన్న	అంజమ్మ	నిర్మల	స్వరూప	0	0	0	0
44	85/A/2ఆ	పట్టా	ఖుష్కీ	2.00	సుంకర లక్ష్మి ప్రసన్న భర్త (పూర్ణచందర్)	ఈరన్న	అంజమ్మ	నిర్మల	స్వరూప	0	0	0	0
45	85/A/3ఆ	పట్టా	ఖుష్కీ	2.00	సుంకర లక్ష్మి ప్రసన్న భర్త (పూర్ణచందర్)	ఈరన్న	అంజమ్మ	నిర్మల	స్వరూప	0	0	0	0
46	85/1Cఆ1	పట్టా	ఖుష్కీ	1.00	మడివల రాములు తం (మనికప్ప)	నర్సింహా రెడ్డి	సంగారెడ్డి	స్వరూప	ఈరన్న	0	0	0	0
47	85/D4/2/1ఆ	పట్టా	ఖుష్కీ	0.20	సుంకర లక్ష్మి ప్రసన్న భర్త (పూర్ణచందర్ రావు)	నర్సింహా రెడ్డి	సంగారెడ్డి	స్వరూప	ఈరన్న	0	0	0	0
మొత్తము:				19.06									
48	89/B/2	పట్టా	ఖుష్కీ	0.12	దోపూర్ నరసింహారెడ్డి తం (అంజి రెడ్డి)	ఖలీల్ అహ్మద్	నర్సమ్మ	నూర్ రెడ్డి	సంగప్ప	పచ్చి,జా,వేప	3,22,5	2 బోరు	0
49	89/A/1	పట్టా	ఖుష్కీ	5.13	సూర్ రెడ్డి తం (శివ రెడ్డి)	[illegible]	స్వరూప	రాంరెడ్డి	సంగప్ప	0	0	1 బోరు	0
50	89/B/1ఆ1	పట్టా	ఖుష్కీ	1.18	శంబునొల నరసమ్మ భర్త (రామ్ రెడ్డి)	ఖలీల్ అహ్మద్	సురేష్ రెడ్డి	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	1 బోరు	0
51	89/B/1ఆ2	పట్టా	ఖుష్కీ	2.00	శంబుని మోహన్ రెడ్డి తం (రాం రెడ్డి)	ఖలీల్ అహ్మద్	సురేష్ రెడ్డి	బుచ్చిరెడ్డి	స్వరూప	0	0	0	0
52	89/A/2	పట్టా	ఖుష్కీ	0.12	దోపూర్ నరసింహ రెడ్డి తం (అంజిరెడ్డి)	ఖలీల్ అహ్మద్	సురేష్ రెడ్డి	ఖలీల్ అహ్మద్	రాం రెడ్డి	0	0	0	0
53	89/B/1ఆ3	పట్టా	ఖుష్కీ	2.00	శంబునోళ్ల శివ రెడ్డి తం (రాంరెడ్డి)	ఖలీల్ అహ్మద్	సురేష్ రెడ్డి	ఖలీల్ అహ్మద్	రాం రెడ్డి	0	0	0	0
54	89/a1/2	పట్టా	ఖుష్కీ	1.22	ఎం. స్వరూప భర్త (సంగారెడ్డి)	నర్సింహ రెడ్డి	నాగి	సురేష్ రెడ్డి	మల్లి రెడ్డి	0	0	1 బోరు	0
మొత్తము:				12.37									
55	90/1/ఆ	పట్టా	ఖుష్కీ	2.20	శివప్ప తం (రామయ్య)	నూర్ మొహమ్మద్	శివరెడ్డి	తుల్జమ్మ	నూర్ మొహమ్మద్	0	0	1 bore	0
56	90/2ఆ2/2	పట్టా	ఖుష్కీ	2.00	చింతచెట్టు గోదావరి భర్త (శివ రాజ్)	నూర్ మొహమ్మద్	యల్లేశ్ కుమార్	శివప్ప	నూర్ మొహమ్మద్	0	0	0	0
57	90/1ఆ	పట్టా	ఖుష్కీ	2.20	లింగయ్య తం (రామయ్య)	భూపాల్ కుమార్	ఈరన్న	శివప్ప	నూర్ మొహమ్మద్	0	0	1 Bore	0
మొత్తము:				7.00									
58	91/ఆ1	పట్టా	ఖుష్కీ	2.00	శివప్ప తం (రామయ్య)	నూర్ మొహమ్మద్	నూర్ మొహమ్మద్	శివరాజ్	తుల్జమ్మ	మామిడి	5	1 బావి	0
59	91/ఆ1	పట్టా	ఖుష్కీ	2.00	శివప్ప తం (రామయ్య)	నూర్ మొహమ్మద్	నూర్ మొహమ్మద్	శివరాజ్	తుల్జమ్మ	0	0	0	0
మొత్తము:				04.00									
60	94/3ఆ1	పట్టా	ఖుష్కీ	0.08	గాలమ్మ భర్త (నర్సప్ప)	సురేష్ రెడ్డి	సురేష్ రెడ్డి	సురేష్ రెడ్డి	సురేష్ రెడ్డి	0	0	0	0
Total:				0.08									
61	95/ఇ1/1ఆ	పట్టా	ఖుష్కీ	1.00	మల్ల రెడ్డి తం (రామ్ రెడ్డి)	నర్సమ్మ	యల్లేశ్ కుమార్	సంగ రెడ్డి	మల్లారెడ్డి	0	0	1 బోరు	0
62	95/ఇ2	పట్టా	ఖుష్కీ	3.00	బి.ఉమా రాణి భర్త (బి సంగా రెడ్డి)	నర్సమ్మ	యల్లేశ్ కుమార్	సురేష్ రెడ్డి	మల్లారెడ్డి	0	0	1 బోరు	0
63	95/ఆ1	పట్టా	ఖుష్కీ	4.13	బిప్పే జయప్రద భర్త (బిప్పే మురళి)	సంగారెడ్డి	యల్లేశ్ కుమార్	[illegible]	గోపాల్ రెడ్డి	0	0	1 బోరు	0
64	95/ఆ1	పట్టా	ఖుష్కీ	4.20	సంగారెడ్డి తం (రాంరెడ్డి)	నర్సమ్మ	యల్లేశ్ కుమార్	సంగ రెడ్డి	మల్లారెడ్డి	0	0	0	0
65	95/ఇ1/1ఆ	పట్టా	ఖుష్కీ	2.00	గొల్ల రాము మైనర్ తం (గొల్ల మహేష్)	సంగ రెడ్డి	యల్లేశ్ కుమార్	గోపాల్ రెడ్డి	మల్లారెడ్డి	0	0	1 బోరు	0
66	95	పట్టా	ఖుష్కీ	1.20	మల్ల రెడ్డి తం (రామ్ రెడ్డి)	నర్సమ్మ	యల్లేశ్ కుమార్	సంగ రెడ్డి	మురళి	0	0	0	0
67	95/ఇ2ఆ	పట్టా	ఖుష్కీ	2.00	గొల్ల లక్ష్మణ్ తండ్రి మహేష్ మైనర్ గార్డెన్ తల్లి (గొల్ల గోపమ్మ భర్త గొల్ల మహేష్)	సంగ రెడ్డి	మల్లారెడ్డి	ఉమారాణి	గోపాల్ రెడ్డి	0	0	0	0
మొత్తము:				18.13									
68	96/D1	పట్టా	ఖుష్కీ	0.15	శరణమ్మ భర్త (మాణెయ్య)	మణెమ్మ	నర్సమ్మ	స్వరూప	అను శమ్మ	0	0	1బోరు	0
69	96/E	పట్టా	ఖుష్కీ	1.05	మలయ్య తం (బిచ్చయ్య)	అను శమ్మ	సంగ రెడ్డి	నర్సమ్మ	గుండ రెడ్డి	0	0	1బావి	0
70	96/ఆ/1	పట్టా	ఖుష్కీ	1.36	నింగాప్ప తం (లాలయ్య)	నర్సింహ రెడ్డి	మణెమ్మ	సూర్ రెడ్డి	గుండ రెడ్డి	0	0	1బోరు	0
71	96/Bఆ	పట్టా	ఖుష్కీ	0.30	సి సర్వమ్మ భర్త (అర్జప్ప)	శరణమ్మ	సంగారెడ్డి	స్వరూప	మల్లేష్	0	0	1బోరు	0
72	96/C	పట్టా	ఖుష్కీ	0.30	శరణమ్మ భర్త (మాణెయ్య)	మణెమ్మ	నర్సమ్మ	స్వరూప	అను శమ్మ	0	0	1బోరు	0
73	96/D2	పట్టా	ఖుష్కీ	0.15	సి నర్సమ్మ భర్త (హర్జప్ప)	శరణమ్మ	సంగారెడ్డి	స్వరూప	మల్లేష్	0	0	0	0
74	96/G	పట్టా	ఖుష్కీ	0.15	చిల్క అనుసమ్మ భర్త (అడివన్న)	నింగప్ప	రాములు	శరణమ్మ	గుండ రెడ్డి	0	0	0	0
75	96/F	పట్టా	ఖుష్కీ	0.15	రాములు తం (లక్ష్మయ్య)	నింగప్ప	రాములు	శరణమ్మ	గుండ రెడ్డి	0	0	0	0
76	96/ఆ/2	పట్టా	ఖుష్కీ	1.20	సి మల్లప్ప తం (సి నింగప్ప)	నర్సింహ రెడ్డి	నింగప్ప	సూర్ రెడ్డి	నింగప్ప	0	0	3 షెడ్స్	0
77	96/H	పట్టా	ఖుష్కీ	0.15	నాగమ్మ భర్త (లక్ష్మయ్య)	నింగప్ప	రాములు	శరణమ్మ	గుండ రెడ్డి	0	0	0	0
మొత్తము:				7.36									
78	97/A/2	పట్టా	ఖుష్కీ	5.00	దొపూరి సురేఖ భర్త (నరసింహా రెడ్డి)	ఖలీల్ అహ్మద్	నింగప్ప	నర్సింహ రెడ్డి	సర్వారెడ్డి	0	0	0	0
79	97C	పట్టా	ఖుష్కీ	4.37	సంజీవ రెడ్డి తం (సర్వారెడ్డి)	గుండ రెడ్డి	గోపాల్ రెడ్డి	మల్లేష్	గుండ రెడ్డి	మామిడి	5	1బోరు	0
80	97/A/1	పట్టా	ఖుష్కీ	5.00	దోపూర్ నరసింహ రెడ్డి తం (అంజి రెడ్డి)	ఖలీల్ అహ్మద్	నింగప్ప	నర్సింహ రెడ్డి	సర్వారెడ్డి	0	0	0	0
81	97/B	పట్టా	ఖుష్కీ	4.37	గుండు రెడ్డి తం (సర్వారెడ్డి)	సూర్ రెడ్డి	సంజీవ రెడ్డి	నింగప్ప	శశికళ	మామిడి	5	1బోరు,1బావి	0
మొత్తము:				19.34									
82	110/B3	పట్టా	ఖుష్కీ	2.13	శంబున్ సర్వరెడ్డి తం (యస్ విట్టల్ రెడ్డి)	శివారెడ్డి	గుండ రెడ్డి	మహేశ	గుండ రెడ్డి	0	0	0	0
83	110/C	పట్టా	ఖుష్కీ	8.20	సర్వమ్మ భర్త (గుండరెడ్డి)	నర్సింహ రెడ్డి	సంజీవ రెడ్డి	నింగప్ప	గుండ రెడ్డి	0	0	1Bore	0
84	110/Aఇ	పట్టా	ఖుష్కీ	2.00	బిప్పే అంజన్న తం (సంగన్న)	సంజీవ రెడ్డి	యల్లేశ్ కుమార్	మురళి	సత్యమ్మ	0	0	0	0
85	110/Aఆ	పట్టా	ఖుష్కీ	2.00	బిప్పే బసవరాజ్ తం (అంజన్న)	సంజీవ రెడ్డి	యల్లేశ్ కుమార్	మురళి	సత్యమ్మ	0	0	0	0
86	110/B2	పట్టా	ఖుష్కీ	2.13	శంబున్ శ్రీనివాస్ తం (యస్ విట్టల్ రెడ్డి)	శివారెడ్డి	గుండ రెడ్డి	నర్సింహ రెడ్డి	పద్మమ్మ	0	0	1బోరు	0
87	110/B1	పట్టా	ఖుష్కీ	2.14	శంబున్ పద్మమ్మ భర్త (యస్ సుధాకర్ రెడ్డి)	శివారెడ్డి	గుండ రెడ్డి	శ్రీనివాస్ రెడ్డి	నర్సింహ రెడ్డి	0	0	1 బావి	0
88	110/D2	పట్టా	ఖుష్కీ	4.10	అంజిరెడ్డి తం (సంజీవరెడ్డి)	గుండ రెడ్డి	సంజీవ రెడ్డి	నర్సింహ రెడ్డి	గుండ రెడ్డి	0	0	1బోరు	0
89	110/D1	పట్టా	ఖుష్కీ	4.10	సిద్దమ్మ భర్త (సంజీవ రెడ్డి)	గుండ రెడ్డి	సంజీవ రెడ్డి	నర్సింహ రెడ్డి	గుండ రెడ్డి	0	0	0	0
మొత్తము:				28.00									
90	111/C/1/2	పట్టా	ఖుష్కీ	2.00	సర్వారెడ్డి తం (గుండరెడ్డి)	మహేశ	సంజీవ రెడ్డి	గుండ రెడ్డి	నర్సింహ రెడ్డి	0	0	0	0
91	111/C/1/1	పట్టా	ఖుష్కీ	0.10	సర్వారెడ్డి తం (గుండరెడ్డి)	మహేశ	సంజీవ రెడ్డి	గుండ రెడ్డి	నర్సింహ రెడ్డి	0	0	0	0
92	111/B1ఆ	పట్టా	ఖుష్కీ	5.00	శశికళ భర్త (వీర్ శెట్టి)	చందర	గుండ రెడ్డి	సర్వారెడ్డి	నర్సమ్మ	0	0	1బోరు,1బావి	0
93	111/D	పట్టా	ఖుష్కీ	4.09	సంజీవరెడ్డి తం (సర్వారెడ్డి)	గుండ రెడ్డి	గోపాల్ రెడ్డి	మల్లేష్	నారాయణ	0	0	0	0
94	111/B	పట్టా	ఖుష్కీ	6.00	బస్వరాజ్ కార్తియాల్ తం (వీర్ శెట్టి)	చందర	మల్లేష్	సర్వారెడ్డి	నారాయణ	0	0	1బోరు	0
మొత్తము:				17.19									
95	114/ఇ1ఆ	పట్టా	ఖుష్కీ	3.00	యం చందన భర్త (యం రాము)	లక్ష్మి	భాస్కర్	అశోక్	విష్ణువర్ధన్ రెడ్డి	0	0	1బోరు	0
96	114/ఇ1ఆ	పట్టా	ఖుష్కీ	2.00	యం లక్ష్మి భర్త (యం రాము)	చందన	భాస్కర్	అశోక్	విష్ణువర్ధన్ రెడ్డి	0	0	1బోరు	0
97	114/ఇ/2ఆ	పట్టా	ఖుష్కీ	1.00	యం లక్ష్మి భర్త (యం రాము)	చందన	భాస్కర్	అశోక్	విష్ణువర్ధన్ రెడ్డి	0	0	0	0
98	114/అ	పట్టా	ఖుష్కీ	4.31	కే ఆనంద్ రెడ్డి తం (నింగా రెడ్డి)	వరలక్ష్మి	లక్ష్మి	నాగమణి	నవనీత	0	0	0	0
99	114/అ3ఆ	పట్టా	ఖుష్కీ	1.00	అర్ విట్టల్ తం (అంబయ్య)	వరలక్ష్మి	లక్ష్మి	నాగమణి	నవనీత	0	0	0	0
100	114/అ2	పట్టా	ఖుష్కీ	4.31	విష్ణువర్ధన్ రెడ్డి తం (అంజిరెడ్డి)	నాగమణి	లక్ష్మి	భాస్కర్	గణపతి దీక్షిత్	0	0	1Bore	0
101	114/అ3ఇ	పట్టా	ఖుష్కీ	1.00	వరలక్ష్మి భర్త (అంజిరెడ్డి)	నాగమణి	లక్ష్మి	భాస్కర్	గణపతి దీక్షిత్	0	0	0	0
102	114/ఆ1	పట్టా	ఖుష్కీ	1.00	పునీత్ కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	భాస్కర్	అశోక్	వరలక్ష్మి	నవనీత	0	0	2బోర్లు	0
103	114/అ	పట్టా	ఖుష్కీ	2.00	పునీత్ కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	భాస్కర్	అశోక్	వరలక్ష్మి	నవనీత	0	0	1బావి	0
104	114/ఇ/2ఆ	పట్టా	ఖుష్కీ	4.00	యం రాము తం (హన్మంత మదేశ్)	లక్ష్మి	భాస్కర్	అశోక్	గణపతి దీక్షిత్	0	0	0	0
మొత్తము:				24.22									
105	115/అ	పట్టా	ఖుష్కీ	2.20	ప్రభావతి భర్త (కృష్ణమూర్తి)	నర్సింహ రెడ్డి	ఉషారాణి	సంజీవ్ రెడ్డి	వరలక్ష్మి	0	0	1బోరు	0
106	115/అ/1	పట్టా	ఖుష్కీ	2.20	ప్రభావతి భర్త (కృష్ణమూర్తి)	నర్సింహ రెడ్డి	ఉషారాణి	సంజీవ్ రెడ్డి	వరలక్ష్మి	0	0	0	0
మొత్తము:				5.00									
107	116/1	పట్టా	ఖుష్కీ	4.38	పునీత్ కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	నర్సింహ రెడ్డి	ఉషారాణి	సంజీవ్ రెడ్డి	వరలక్ష్మి	0	0	4బోర్లు	0
మొత్తము:				4.38									
108	141/2A	పట్టా	ఖుష్కీ	1.10	నర్సింహా రెడ్డి తం (విట్టల్ రెడ్డి)	సతీష్ కుమార్	రత్నమ్మ	సతీష్ కుమార్	గణపతి దీక్షిత్	మామిడి	2	2బోర్లు	0
109	141/2Cఆ	పట్టా	ఖుష్కీ	0.33	మొల్ల అజీజ్ తం (రాజ్ మొహమ్మద్)	నర్సింహ రెడ్డి	ఫరూక్	గణపతి దీక్షిత్	అజీజ్	0	0	1బోరు	0
110	141/2Cఇ	పట్టా	ఖుష్కీ	0.33	మొల్ల ఫరూక్ తం (రాజ్ మొహమ్మద్)	నర్సింహ రెడ్డి	ఫరూక్	గణపతి దీక్షిత్	అజీజ్	0	0	0	0
111	141/1A	పట్టా	ఖుష్కీ	3.06	నర్సింహా రెడ్డి తం (విట్టల్ రెడ్డి)	సతీష్ కుమార్	రత్నమ్మ	సతీష్ కుమార్	గణపతి దీక్షిత్	0	0	0	0
112	141/1B	పట్టా	ఖుష్కీ	3.06	రాచన్న తం (అగమయ్య)	నర్సింహ రెడ్డి	రత్నమ్మ	గణపతి దీక్షిత్	అశోక్	0	0	1Bore	0
113	141/2B	పట్టా	ఖుష్కీ	1.10	రాచన్న తం (అగమయ్య)	నర్సింహ రెడ్డి	రత్నమ్మ	గణపతి దీక్షిత్	అశోక్	0	0	0	0
మొత్తము:				10.18									
114	142/2A/1	పట్టా	ఖుష్కీ	2.22	పునీత కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	నర్సింహ రెడ్డి	రత్నమ్మ	గణపతి దీక్షిత్	అశోక్	0	0	0	0
115	142/1A/1	పట్టా	ఖుష్కీ	3.30	పునీత కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	నర్సింహ రెడ్డి	రత్నమ్మ	గణపతి దీక్షిత్	అశోక్	0	0	0	0
116	142/2B	పట్టా	ఖుష్కీ	2.22	విశ్వనాథ్ దీక్షిత్ తం (మాణిక్ దీక్షిత్)	నర్సింహ రెడ్డి	రత్నమ్మ	గణపతి దీక్షిత్	అశోక్	0	0	0	0
117	142/1B	పట్టా	ఖుష్కీ	10.23	విశ్వనాథ్ దీక్షిత్ తం (మాణిక్ దీక్షిత్)	నర్సింహ రెడ్డి	రత్నమ్మ	గణపతి దీక్షిత్	అశోక్	టేకు, దానిమ్మ, [illegible]	35, 800, 10	3 బోర్లు	0
మొత్తము:				19.17									
118	143/B4	పట్టా	ఖుష్కీ	1.19	పునీత కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
119	143/B3	పట్టా	ఖుష్కీ	4.00	గోమతి దీక్షిత్ భర్త (గణపతి దీక్షిత్)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
120	143/B2	పట్టా	ఖుష్కీ	4.00	పునీత కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	మామిడి, సీతాఫలం	550, 1000	[illegible]	0
121	143/A/1	పట్టా	ఖుష్కీ	13.20	పునీత కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
122	143/B1	పట్టా	ఖుష్కీ	4.00	ప్రేమ్ కుమార్ దీక్షిత్ తం (గణపతి దీక్షిత్)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తము:				26.39									
123	145/1/అ	[illegible]	ఖుష్కీ	2.37	మీర్ ఇమామ్ అలీ తం (మీర్ ఖాజా అలీ)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
124	145/1/ఇ	[illegible]	ఖుష్కీ	4.00	గోరి బీ భర్త (లాల్ మహమ్మద్)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	[illegible]	0
125	145/3/ఆ2	[illegible]	ఖుష్కీ	1.27	మున్నూర్ కాపు దేవేందర్ తం (రామచందర్)	[illegible]	[illegible]	అంజయ్య	నాగమ్మ	0	0	1బోరు	0
126	145/4/అ	[illegible]	ఖుష్కీ	1.04	లక్ష్మమ్మ భర్త (మొగులప్ప)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
127	145/3/ఆ/2	[illegible]	ఖుష్కీ	1.04	కాలమ్మ భర్త (అంజయ్య)	[illegible]	[illegible]	[illegible]	అంజయ్య	0	0	[illegible]	0
128	145/3/ఆ/3	[illegible]	ఖుష్కీ	1.03	బసవరాజ్ తం (మనికప్ప)	[illegible]	[illegible]	[illegible]	అంజయ్య	0	0	1బోరు	0
129	145/ఉ	[illegible]	ఖుష్కీ	1.00	కే జగమ్మ భర్త (మానికప్ప)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
130	145/3/ఆ/1	[illegible]	ఖుష్కీ	1.03	సిద్దప్ప తం (మానికప్ప)	[illegible]	[illegible]	[illegible]	అంజయ్య	0	0	0	0
131	145/3/ఆ/4	[illegible]	ఖుష్కీ	1.04	గురన్న తం (మానికప్ప)	[illegible]	[illegible]	[illegible]	అంజయ్య	0	0	0	0
132	145/3/ఆ1	[illegible]	ఖుష్కీ	1.27	మున్నూర్ కాపు రాజు తం (రాంచందర్)	[illegible]	[illegible]	అంజయ్య	నాగమ్మ	0	0	0	0
133	145/ఉ2	[illegible]	ఖుష్కీ	0.22	తులమ్మ భర్త (లక్ష్మయ్య)	[illegible]	[illegible]	[illegible]	[illegible]	0	0	0	0
మొత్తము:				17.11									
పూర్తి మొత్తము:				288.13									

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) ప్రకారం భూ సేకరణ సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయడమైనది.

భూసేకరణలో తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, రాతి ఫలక మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షంలో వాటిని సేకరించడం జరుగుతుంది. లేనిచో సేకరించబడవు.

భూ సేకరణ చేయుచున్న పై భూములయొక్క ప్లాను భూ సేకరణ అధికారి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నిమ్జ్ ప్రాజెక్ట్ జహీరాబాద్ వారి కార్యాలయములో ఏదైనా పని దినము నాడు పని వేళలో చూసుకోవచ్చును.

సం/-	సం/-	సం/-	సం/-
తహసీల్దార్ న్యాల్కల్	ప్రత్యేక ఉప కలెక్టర్-నిమ్జ్ ప్రాజెక్ట్, జహీరాబాద్	అదనపు కలెక్టర్ సంగారెడ్డి జిల్లా	కలెక్టర్ సంగారెడ్డి జిల్లా

DIPR No.15/LA-PP/Advt/Agency/2025-26

ఖుషీ ఖుషీగా..

సుంకాల అమలు వాయిదాతో మార్కెట్లో జోరుగా కొనుగోళ్లు

- సెన్సెక్స్ 1,310 పాయింట్లు అప్
- మళ్లీ 75,000 ఎగువకు సూచీ

ముంబై: భారత్‌పై 26 శాతం అదనపు సుంకాల అమలును ట్రంప్ 90 రోజులు వాయిదా వేయడంతో స్టాక్ మదుపరుల్లో సంతోషం ఉప్పొంగింది. వారాంతం ట్రేడింగ్‌లో వారు అమితోత్సాహంతో కొనుగోళ్లు జరపడంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు భారీగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,620.18 పాయింట్లు (2.19 శాతం) ఎగబాకి 75,467.33 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 1,310.11 పాయింట్ల (1.77 శాతం) లాభంతో 75,157.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 524.75 పాయింట్ల (2.34 శాతం) వృద్ధితో 23,000 స్థాయికి చేరువైంది. చివరికి 429.40 పాయింట్ల (1.92 శాతం) పెరుగుదలతో 22,828.55 వద్ద ముగిసింది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.7.85 లక్షల కోట్లు పెరిగి రూ.401.67 లక్షల కోట్లకు (4.66 లక్షలకోట్ల డాలర్లు) చేరింది. ఈ వారం మొత్తానికి మాత్రం సెన్సెక్స్ 207.43 పాయింట్లు, నిఫ్టీ 75.9 పాయింట్ల నష్టాన్ని చవిచూశాయి.

రూపీ హైజంప్: భారత కరెన్సీ విలువ భారీగా పుంజుకుంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్క రోజే 58 పైసలు బలపడి రూ.86.10 వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఈ.. 22 కోట్ల ఇన్వెస్టర్ అకౌంట్లు

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) మరో రికార్డును నమోదు చేసింది. ఈ నెలలో ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్ ఖాతాలు (యూనిక్ క్లయింట్ కోడ్స్) 22 కోట్ల మైలురాయిని దాటాయి. 2024 అక్టోబరులో ఎక్స్ఛేంజీ ఇన్వెస్టర్ల ఖాతాలు తొలిసారిగా 20 కోట్లకు చేరుకోగా.. ఆరు నెలల్లోనే మరో 2 కోట్ల మేర పెరగడం విశేషం. కాగా, ఈ మార్చి 31 నాటికి ఎన్ఎస్ఈ రిజిస్టర్డ్ ఇన్వెస్టర్ల సంఖ్య 11.3 కోట్లకు చేరుకుంది.

ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడులు..

11 నెలల కనిష్ఠం

ఈ ఏడాది మార్చిలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాల్లోకి పెట్టుబడులు 11 నెలల కనిష్ఠ స్థాయి రూ.25,082 కోట్లకు తగ్గాయి. సుంకాల దెబ్బకు స్టాక్ మార్కెట్లు తీవ్ర ఊగిసలాటలకు లోనవుతుండటం ఇందుకు కారణం. ఈక్విటీ ఫండ్లలోకి పెట్టుబడుల ప్రవాహం తగ్గడం వరుసగా ఇది మూడో నెల. ఈ ఫిబ్రవరితో పోలిస్తే గత నెలలో పెట్టుబడులు 14 శాతం మేర తగ్గాయి. కాగా, మార్చిలో క్రమానుగత పెట్టుబడుల పథకాల్లో (సిప్)కి పెట్టుబడులు 4 నెలల కనిష్ఠ స్థాయి రూ.25,925 కోట్లకు పరిమితమయ్యాయి.



ఓలా ఎలక్ట్రిక్.. రోడ్‌స్టర్ ఎక్స్ బైక్

ప్రారంభ ధర రూ.84,999

న్యూఢిల్లీ: విద్యుత్ టూ వీలర్ల దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్ తమిళనాడులోని కృష్ణగిరి ప్లాంట్ నుంచి తొలి రోడ్‌స్టర్ ఎక్స్ మోటార్ సైకిల్‌ను విడుదల చేసింది. ఈ బైక్ దేశంలో విద్యుత్ వాహనాల విప్లవాన్ని మరో మెట్టు పైకి ఎక్కిస్తుందని కంపెనీ చైర్మన్, ఎండీ భవిష్ అగర్వాల్ అన్నారు. ఈ బైక్ విక్రయాలు ఈ నెలలోనే ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్‌స్టర్ ఎక్స్ సిరీస్ సర్వీసింగ్‌కు అనుకూలమైన బ్యాటరీ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (బీఎంఎస్) కలిగి ఉంటుంది. మూడు వేరియెంట్లలో అందుబాటులో ఉండే ఈ బైక్ ధరలు వరుసగా రూ.84,999, రూ.94,999,రూ.1,04,999గా ఉన్నాయి. ఇవి కాకుండా టాప్ వేరియెంట్ రోడ్‌స్టర్ ఎక్స్+4.5 కిలోవాట్ల బ్యాటరీతో కూడిన బైక్ ధర రూ.1,14,999గా ఉండగా రోడ్‌స్టర్ ఎక్స్+9.1 కిలోవాట్ల బ్యాటరీ (4680 భారత్ సెల్)తో కూడిన ధర రూ.1,84,999గా ఉంది.

పసిడి రూ.96,000 దాటి..

- ఒక్కరోజే రూ.6,250 పెరుగుదల
- రూ.96,450కి చేరిన 10 గ్రాముల ధర
- సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి ఇది..
- రూ.2,300 పెరిగి రూ.95,500కు చేరుకున్న కిలో వెండి రేటు
- అంతర్జాతీయ మార్కెట్లో 3,200 డాలర్లు దాటిన ఔన్స్ గోల్డ్
- అమెరికా-చైనా ట్రేడ్ వార్ ఎఫెక్ట్



న్యూఢిల్లీ: పసిడి తగ్గినట్టే తగ్గి మళ్లీ కొండెక్కింది. ఈసారి మరింత పైకి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం ఒక్కరోజే రూ.6,250 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.96,450కి చేరింది. దేశీయంగా 10 గ్రాముల బంగారం రూ.96,000 దాటడం ఇదే తొలిసారి. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం ఇదే స్థాయిలో పెరిగి రూ.96,000గా నమోదైంది. కిలో వెండి సైతం రూ.2,300 పెరుగుదలతో రూ.95,500 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో విలువైన లోహాలకు డిమాండ్ అమాంతం పెరగడం ఇందుకు ప్రధాన కారణం. అమెరికా-చైనా మధ్య సుంకాల యుద్ధం తీవ్ర రూపం దాల్చడంతో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 3,249 డాలర్లకు ఎగబాకింది. సిల్వర్ మళ్లీ 32 డాలర్లకు చేరువైంది. భారత్ సహా ఇతర దేశాలపై సుంకాల అమలును 90 రోజుల పాటు వాయిదా వేసిన ట్రంప్.. చైనాపై సుంకాలను మాత్రం మరింత పెంచి అమలులోకి తెచ్చారు. దాంతో చైనా కూడా దీటుగా అమెరికాపై సుంకాలు పెంచింది. ఈ రెండు ప్రధాన దేశాల మధ్య సుంకాల యుద్ధం అంతర్జాతీయ ఎగుమతి వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపనుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగించవచ్చన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా డాలర్ మరింత బలహీనపడటం కూడా బులియన్ ర్యాలీకి మరో కారణమైంది.

మరింత పైకేనా..? మళ్లీ కిందికా..?

పసిడి ధరల భవిష్యత్ గమనంపై మిశ్రమ అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాణిజ్య యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితులు, మాంద్యం, ద్రవ్యోల్బణం మళ్లీ పెరగవచ్చన్న భయాందోళనల నేపథ్యంలో బంగారం మరింత పెరగనుందని యూబీఎస్, గోల్డ్‌మన్ శాక్స్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ గ్రూప్, మాక్వేరీ వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు భావిస్తున్నాయి. ఈ ఏడాదిలో ఔన్స్ గోల్డ్ 3,500 డాలర్ల వరకు పెరగవచ్చని అంచనా వేశాయి. అంతర్జాతీయ ఆర్థిక సలహాల సంస్థ డెవేర్ గ్రూప్ 4,500 డాలర్ల వరకు పెరిగే అవకాశాల్లేకపోలేవని అంటోంది. అయితే, దీర్ఘకాలికంగా గోల్డ్ బుల్లిష్‌గానే కన్పిస్తున్నప్పటికీ స్వల్ప, మధ్యకాలికంగా భారీ దిద్దుబాటుకు లోనుకావచ్చన్న అంచనాలూ ఉన్నాయి. వినియోగ డిమాండ్‌తో సంబంధం లేకుండా బంగారం ధర ఈ ఏడాదిలో అతివేగంగా పెరుగుతూ వచ్చిందని పేస్ 360 చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ అంటున్నారు. వచ్చే 6-10 నెలల్లో ఔన్స్ గోల్డ్ ధర మళ్లీ 2,400-2,600 డాలర్ల వరకు పడిపోయే అవకాశాలున్నాయని ఆయన అంచనా వేశారు. పసిడిలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి అది మంచి అవకాశమని గోయల్ పేర్కొన్నారు.



సేంద్రీయ వ్యవసాయం, టెర్రస్ గార్డెనింగ్‌కు 'పర్‌ఫెక్ట్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): బెంగళూరు కేంద్రంగా ఉన్న గ్లోబల్ గ్రీన్ అగ్రినోవా.. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న తెలంగాణ రైతు మహోత్సవంలో తన 'పర్‌ఫెక్ట్' స్టాల్‌ను ఏర్పాటు చేసింది. వృక్ష ఆయుర్వేదం ద్వారా తయారు చేయబడిన పర్‌ఫెక్ట్‌ను మొక్కలు, పండ్ల చెట్లకు పిచికారీ చేయటం ద్వారా చీడపీడలను నివారించవచ్చు. అలాగే సేంద్రీయ వ్యవసాయానికి దోహదం చేయటంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని కంపెనీ చైర్మన్ బీఎస్ మూర్తి తెలిపారు. పర్‌ఫెక్ట్ సేంద్రీయ వ్యవసాయానికే కాకుండా నగరాల్లో ఇటీవల ప్రాచుర్యం పొందిన మిద్దె తోటలకు, పెరటి తోటలకు అనువుగా ఉంటుందని అన్నారు. రైతు మహోత్సవంలో డీ-12లో ఏర్పాటు చేసిన స్టాల్‌లో పర్‌ఫెక్ట్ ఉత్పత్తులు వినియోగదారులు నేరుగా పొందవచ్చని మూర్తి తెలిపారు.

లైసెన్సులు, దరఖాస్తులకు ఆర్‌బీఐ ప్రవాహ్

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నుంచి లైసెన్సులు, అనుమతులు, ఆథరైజేషన్లు పొందాలనుకుంటున్న సంస్థలు.. దరఖాస్తుల సమర్పణకు ప్రవాహ్ పోర్టల్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుంది. మే 1 నుంచి ప్రవాహ్ పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని తన నియంత్రణలోని సంస్థలు సహా అన్నింటినీ ఆర్‌బీఐ ఆదేశించింది. నియంత్రణాపరమైన అనుమతుల ప్రక్రియ అంతటినీ సంపూర్ణంగా డిజిటలైజ్ చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఆర్‌బీఐ ప్రవాహ్ వేదికను గత ఏడాది మే 28న ప్రారంభించింది.

పారిశ్రామికవేత్త మధుర్ బజాజ్ కన్నుమూత



ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త, బజాజ్ ఆటో వైస్-చైర్మన్ మధుర్ బజాజ్ (73) అస్వస్థతతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అనారోగ్యం కారణంగా కొద్ది రోజుల క్రితం ఆయనను బ్రీచ్‌కాండీ ఆస్పత్రిలో చేర్చారు. రెండు రోజుల క్రితం ఆయనకు స్ట్రోక్ కూడా వచ్చింది. శుక్రవారం తెల్లవారు ఝామున 5 గంటల సమయంలో ఆయన కన్ను మూసినట్టు కుటుంబ సభ్యులు ప్రకటించారు. మధుర్ బజాజ్ గ్రూప్‌నకు చెందిన పలు కంపెనీల బోర్డు సభ్యుడుగా పని చేశారు. 2005-07 సంవత్సరాల మధ్య కాలంలో ఆయన సియామ్ (భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం) అధ్యక్షుడుగా పని చేశారు.

ఆరు నెలల కనిష్ఠానికి ఐఐపీ

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామిక రంగం మరోసారి నిరుత్సాహపూరితమైన వృద్ధిని నమోదు చేసింది. ఫిబ్రవరిలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 6 నెలల కనిష్ఠ స్థాయి 2.9 శాతానికి దిగజారింది. గత ఏడాది ఫిబ్రవరిలో 5.6% ఉంది. తయారీ, గనులు, విద్యుత్ రంగాలు నిరాశావహమైన వృద్ధిని నమోదు చేయడం ఇందుకు కారణం. గత ఏడాది ఆగస్టులో జీరో శాతం వృద్ధిని నమోదు చేసిన తర్వాత నమోదైన మరో కనిష్ఠ స్థాయి ఇదే.

మివి నుంచి 'ఏఐ బడ్స్'

జూన్‌లో మార్కెట్లోకి.. ధర 10,000 లోపే



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృత్రిమ మేధ (ఏఐ) కొత్త పుంతలు తొక్కుతోంది. రోజువారీ జీవితాన్ని మరింత సులభం చేస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ స్టార్టప్ కంపెనీ 'మివి' అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత వాయిస్ టూల్ సంచలనం సృష్టిస్తోంది. ఈ టూల్ ఆధారంగా కంపెనీ ఇప్పటికే ఏఐ ఇయర్ బడ్స్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఏడాది జూన్‌లో ఈ బడ్స్ మార్కెట్లోకి విడుదల కానున్నాయి. వీటి ధర కూడా అందరికీ అందుబాటులో ఉండేలా రూ.10,000 కంటే తక్కువగానే నిర్ణయించనున్నట్లు కంపెనీ సహ వ్యవస్థాపకులు, సీఎంఓ మిధుల దేవభక్తుని చెప్పారు. ఈ ఏఐ బడ్స్‌ను చెవిలో పెట్టుకుని తోటి మనిషితో మాట్లాడినట్టు మాట్లాడి మన ప్రశ్నలు, సందేహాలు అన్నిటికీ సమాధానాలు రాబట్టుకోవచ్చు. అది కూడా మనకు బాగా సన్నిహితులైన వ్యక్తులతో మాట్లాడుతున్న అనుభూతితో. ఏ వంటకం ఎలా ప్రిపేర్ చేయాలనే విషయం మొదలుకుని, తాజా వార్తల వరకు చక్కటి స్వరంతో అప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ఈ టూల్ ప్రత్యేకత.

ఇదే తొలిసారి: కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించినంత వరకు ప్రపంచంలో ఇదే తొలి వాయిస్ ఆధారిత ఏఐ ఉత్పత్తి. 'మివి ఏఐ' ద్వారా మేము కేవలం ఒక ఉత్పత్తిని మాత్రమే మార్కెట్లోకి విడుదల చేయడం లేదు. మానవ-ఏఐ సంభాషణ భవిష్యత్‌ను మేము నిర్వచించబోతున్నాం. ఇది అంతర్జాతీయ సృజనాత్మకతను సమూలంగా మార్చివేస్తుంది. ఈ ప్రయాణంలో మివి ఏఐ బడ్స్ తొలి అడుగు మాత్రమే' అని మిధుల అన్నారు. తొలుత ఇంగ్లీషులో మాత్రమే ఈ ఏఐ బడ్స్ లభిస్తాయి. త్వరలో దీన్ని అన్ని భారతీయ భాషలకు విస్తరింపచేస్తారు. ముందు మివి వెబ్‌సైట్ ద్వారా, తర్వాత మిగతా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఈ బడ్స్ విక్రయిస్తారు. కాగా, హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న తమ ప్లాంట్‌లో ఈ ఏడాది జూన్ కల్లా ఉత్పత్తి ప్రారంభమవుతుందని మిధుల చెప్పారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	125
వరంగల్	110	గుంటూరు	122
కరీంనగర్	110	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	88
కర్నూలు	110	నెల్లూరు	93
విశాఖపట్నం	119	అనంతపురం	93
గోదావరి	125		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12న తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	420
వరంగల్	392	గోదావరి	415
చిత్తూరు	460	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	95,400 ▲	87,450 ▲	1,08,000 ▲
విజయవాడ	96,300 ▲	90,000 ▲	96,000 ▲
విశాఖపట్నం	93,680 ▲	85,870 ▲	93,280 ▲
రాజమండ్రి	95,400 ▲	87,450 ▲	95,500 ▲
ప్రొద్దుటూరు	93,100 ▲	85,560 ▲	95,400 ▲
ముంబై	93,353 ▲	85,511 ▲	92,929 ▲



త్రిపాఠి (16) క్లీన్‌బౌల్డ్

చెన్నై.. అదే కథ

- 103 పరుగులకే ఆలౌట్
- వరుసగా ఐదో ఓటమి
- కోల్‌కతా ఘనవిజయం
- నరైన్ ఆల్‌రౌండ్‌షో

చెన్నై: మాజీ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ నుంచి మరో నిరాశాజనక ప్రదర్శన. ఎంఎస్ ధోనీ జట్టు పగ్గాలు చేపట్టినా.. ఆట తీరులో ఎలాంటి మార్పూ కనిపించలేదు. ఈసారి బ్యాటింగ్‌లో మరింత దారుణ వైఫల్యం కనబర్చగా.. అటు స్వల్ప స్కోరును కాపాడే క్రమంలో బౌలర్లు కూడా తేలిపోయారు. ప్రత్యర్థి కోల్‌కతా నైట్‌రైడర్స్ మాత్రం అదరగొట్టింది. ముఖ్యంగా స్పిన్నర్ సునీల్ నరైన్ (3/13; 18 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 44) బంతితో, బ్యాట్‌తోనూ మెరిశాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కోల్‌కతా 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ఐపీఎల్ చరిత్రలో చెన్నై ఇలా వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడడం ఇదే తొలిసారి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 9 వికెట్లకు 103 పరుగులు చేసింది. శివమ్ దూబే (31 నాటౌట్), విజయ్ శంకర్ (29) ఫర్వాలేదనిపించారు. వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో కోల్‌కతా కేవలం 10.1 ఓవర్లలో 107/2 స్కోరు చేసి గెలిచింది. డికాక్ (23), రహానె (20 నాటౌట్), రింకూ సింగ్ (15 నాటౌట్) రాణించారు. నూర్ అహ్మద్, అన్షుల్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా సునీల్ నరైన్ నిలిచాడు.



2 చెన్నైపైఎక్కువ వికెట్లు (26) తీసిన రెండో బౌలర్‌గా నరైన్. మలింగ (31) ముందున్నాడు.

61 బంతుల్లోనే ముగించారు: చెన్నై బ్యాటర్లు చెమటోడ్చిన అదే పిచ్‌పై నైట్‌రైడర్స్ మాత్రం ఓవర్‌కు పది పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. ఓపెనర్లు నరైన్, డికాక్ మెరుపు ఆరంభం అందించారు. స్పిన్, పేస్ తేడా లేకుండా బౌండరీలతో హోరెత్తించారు. దీంతో 104 పరుగుల ఛేదనలో ఈ జట్టు పవర్‌ప్లేలోనే 71/1 స్కోరుతో నిలిచింది. మూడో ఓవర్‌లో డికాక్ రెండు సిక్సర్లు బాదగా.. తర్వాతి ఓవర్‌లో నరైన్ 4,6తో ఆకట్టుకున్నాడు. అయితే ఐదో ఓవర్‌లో డికాక్‌ను పేసర్ అన్షుల్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ ఆరో ఓవర్‌లో రహానె 6, నరైన్ 6,4తో 18 పరుగులు రావడంతో పవర్‌ప్లేలోనే ఈ జట్టు సగానికి కంటే ఎక్కువ రన్స్ రాబట్టింది. అశ్విన్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో జోరు చూపిన నరైన్‌ను స్పిన్నర్ నూర్ బౌల్డ్ చేశాడు. అప్పటికే విజయానికి అతి సమీపంలో వచ్చిన జట్టుకు రింకూ సింగ్ సిక్సర్ బాది 59 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

స్పిన్‌కు దాసోహం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై బ్యాటర్లకు కోల్‌కతా స్పిన్నర్లు చుక్కలు చూపించారు. ముఖ్యంగా నరైన్ ధాటికి అటు పరుగులు కాదు కదా.. వికెట్లను కాపాడుకోవడం కూడా కష్టమైంది. నరైన్‌కు తోడు వరుణ్, మొయిన్ అలీ, పేసర్ హర్షిత్ మరో ఎండ్ నుంచి కట్టడి చేయడంతో చెన్నై ఆట టెస్టు మ్యాచ్‌ను తలపించింది. 9-18 ఓవర్ల మధ్య ఓ ఫోర్ కూడా రాబట్టలేకపోయింది. స్పిన్నర్ అలీ నాలుగో ఓవర్‌ను మెయిడిన్ వేసి మరీ ఓపెనర్ కాన్వే (12) వికెట్ తీయగా తర్వాతి ఓవర్‌లోనే మరో ఓపెనర్ రచిన్ (4)ను హర్షిత్ అవుట్ చేశాడు. ఆ వెంటనే విజయ్ శంకర్ కూడా వెనుదిరగాల్సి ఉన్నా వికెట్ల వెనుక అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను నరైన్ వదిలేశాడు. రాహుల్ త్రిపాఠి (16)తో కలిసి శంకర్ కాసేపు వికెట్ల పతనం ఆపగలిగాడు. ఇక ఆరో ఓవర్‌లో విజయ్ రెండు ఫోర్లతో జట్టు పవర్‌ప్లేలో 31/2తో నిలిచింది. ఇన్నింగ్స్‌లో ఏకైక సిక్సర్ కూడా ఏడో ఓవర్‌లో విజయ్ శంకరే బాదాడు. అతడి మరో క్యాచ్‌ను వెంకటేశ్ అయ్యర్ వదిలేసినా పదో ఓవర్‌లో వరుణ్‌కు చిక్కాడు. దీంతో మూడో వికెట్‌కు వీరి మధ్య అత్యధికంగా 43 పరుగులు జత చేరాయి. అనంతరం నరైన్ వరుస ఓవర్లలో త్రిపాఠి, జడేజా (0) వికెట్లు తీయగా.. అశ్విన్ (1)ను హర్షిత్ పెవిలియన్ చేర్చాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దీపక్ హుడాను వరుణ్ డకౌట్ చేయగా.. ప్రేక్షకుల హోరు మధ్య క్రీజులోకి వచ్చిన ధోనీ (1) సైతం జట్టును ఆదుకోలేకపోయాడు. నరైన్ ఓవర్‌లో ఎల్బీ కాగా ధోనీ రివ్యూ కోరాడు. అయితే రీప్లేలో బంతి బ్యాట్‌కు తాకినట్టు స్పైక్స్ వచ్చినా థర్డ్ అంపైర్ అవుట్‌గానే ప్రకటించడంతో స్టేడియం మూగబోయింది. అటు స్పిన్‌ను అద్భుతంగా ఆడే దూబే క్రీజులోనే ఉన్నా భారీ షాట్లు ఆడడం కష్టమైపోయింది. చివరకు 63 బంతుల తర్వాత 19వ ఓవర్‌లో అతను చెన్నై జట్టుకు ఓ ఫోర్ అందించాడు. అలాగే ఆఖరి ఓవర్‌లో దూబే రెండు ఫోర్లతో జట్టు అతికష్టంగా వంద పరుగులు దాటగలిగింది.

స్కోరుబోర్డు

చెన్నై: రచిన్ (సి) రహానె (బి) హర్షిత్ 4, కాన్వే (ఎల్బీ) మొయిన్ అలీ 12, రాహుల్ త్రిపాఠి (బి) నరైన్ 16, విజయ్ శంకర్ (సి) మొయిన్ అలీ (బి) వరుణ్ 29, శివమ్ దూబే (నాటౌట్) 31, అశ్విన్ (సి) వైభవ్ అరోరా (బి) హర్షిత్ 1, జడేజా (సి) డికాక్ (బి) నరైన్ 0, దీపక్ హుడా (సి) వైభవ్ అరోరా (బి) వరుణ్ 0, ధోనీ (ఎల్బీ) నరైన్ 1, నూర్ అహ్మద్ (సి) వరుణ్ (బి) వైభవ్ అరోరా 1, అన్షుల్ (నాటౌట్) 3, ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం: 20 ఓవర్లలో 103/9; వికెట్ల పతనం:** 1-16, 2-16, 3-59, 4-65, 5-70, 6-71, 7-72, 8-75, 9-79; **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-31-1, మొయిన్ అలీ 4-1-20-1, హర్షిత్ రాణా 4-0-16-2, వరుణ్ చక్రవర్తి 4-0-22-2, సునీల్ నరైన్ 4-0-13-3.

కోల్‌కతా: డికాక్ (బి) అన్షుల్ 23, నరైన్ (బి) నూర్ 44, రహానె (నాటౌట్) 20, రింకూ సింగ్ (నాటౌట్) 15, ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం: 10.1 ఓవర్లలో 107/2; వికెట్ల పతనం:** 1-46, 2-85; **బౌలింగ్:** ఖలీల్ 3-0-40-0, అన్షుల్ 2-0-19-1, అశ్విన్ 3-0-30-0, నూర్ 2-0-8-1, జడేజా 0.1-0-9-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	5	4	1	0	8	1.413
ఢిల్లీ	4	4	0	0	8	1.278
కోల్‌కతా	6	3	3	0	6	0.803
బెంగళూరు	5	3	2	0	6	0.539
పంజాబ్	4	3	1	0	6	0.289
లఖ్‌నవూ	5	3	2	0	6	0.078
రాజస్థాన్	5	2	3	0	4	-0.733
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	6	1	5	0	2	-1.554
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

1 చెపాక్ స్టేడియంలో చెన్నైకిదే అత్యల్ప స్కోరు (102). కాగా, ఆ జట్టుకిది ఐపీఎల్‌లో మూడో అత్యల్పం.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు

మ్యాచ్	సమయం	వేదిక
లఖ్‌నవూ x గుజరాత్	మ.3.30	లఖ్‌నవూ
హైదరాబాద్ x పంజాబ్	రా.7.30 నుంచి	హైదరాబాద్


పంజాబ్ ఆటగాళ్లు


హెడ్

సన్‌రైజర్స్ రాత మారేనా..?

ఉప్పల్‌లో పంజాబ్‌తో అమీతుమీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈ సీజన్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో నాలుగింట్లో ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) సొంతగడ్డ ఉప్పల్ స్టేడియంలో మరో మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. శనివారం శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంలోని పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ అమీతుమీ తేల్చుకోనుంది. ఆరంభంలో అద్భుతంగా ఆడి.. ఆపై వరుస పరాజయాలతో డీలా పడిన రైజర్స్‌ను గాడిన పెట్టాలని కెప్టెన్ కమిన్స్ పట్టుదలగా ఉన్నాడు. తమకు ప్రధాన బలమైన బ్యాటింగే ఇప్పుడు జట్టుకు బలహీనతగా మారింది. ఈ నేపథ్యంలో హెడ్, క్లాసెన్, ఇషాన్, నితీశ్‌లు బ్యాట్లు ఝుళిపించాల్సి ఉంది. మరో వైపు పంజాబ్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట్లో నెగ్గింది. గత మ్యాచ్‌లో ఐదుసార్లు చాంపియన్ అయిన చెన్నై సూపర్‌కింగ్స్‌ను చిత్తుచేసి జోరు మీదున్నది. చెన్నైపై అద్భుత సెంచరీతో అదరగొట్టిన ప్రియాన్ష్ ఆర్య నుంచి మరోసారి ఆ ప్రదర్శనను పంజాబ్ ఆశిస్తోంది.



ఫైనల్లో సురేఖ జోడీ

న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 1 పోటీల్లో భారత్‌కు మూడో పతకం ఖరారైంది. ఈసారి తెలుగమ్మాయి జ్యోతి సురేఖ, రిషబ్ యాదవ్ జోడీ కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లి కనీసం రజతాన్ని ఖాయం చేసుకుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో సురేఖ, రిషబ్ ద్వయం 159-155తో స్లోవేనియా జంటను ఓడించింది. శనివారం జరిగే తుదిపోరులో చైనీస్ తైపీతో సురేఖ జోడీ స్వర్ణం కోసం పోరాడనుంది.

కపిల జోడీ పరాజయం

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో జోడీ కూడా నిరాశపరిచింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భారత ద్వయం 20-22, 13-21తో హాంకాంగ్‌కు చెందిన ఐదో సీడ్ జంట టాంగ్ చున్ మన్/సె యింగ్ సుయెట్ చేతిలో పరాజయంపాలై టోర్నీ నుంచి వెనుదిరిగింది.

హెచ్‌సీఏ వివాదంపై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): క్రికెట్ మ్యాచ్ పాస్‌ల విషయంలో సన్‌రైజర్స్ జట్టు, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మధ్య మొదలైన వివాదంపై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సన్‌రైజర్స్ నుంచి వస్తున్న మ్యాచ్ టికెట్లు ఎన్ని? హెచ్‌సీఏ వాటిని ఏ విధంగా ఉపయోగిస్తోంది? కాంప్లిమెంటరీ పాస్‌లు ఎన్ని ఇస్తున్నారు? ఎన్ని టికెట్లు అమ్మారు? లాంటి విషయాలను అధికారులు ఆరా తీస్తున్నారు. ఇప్పటిదాకా జరిగిన దర్యాప్తు తీరును గురువారం విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఉప్పల్ స్టేడియానికి వచ్చి సమీక్షించారని సమాచారం.

రష్మిక బృందం మరో గెలుపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత మహిళల టెన్నిస్ జట్టు 2-1తో చైనీస్ తైపీను ఓడించి ఈ పోటీల్లో మూడో విజయాన్ని అందుకుంది. శుక్రవారం పుణెలో జరిగిన ఈ పోటీల్లో రష్మిక బృందం సింగిల్స్‌లో గెలవగా డబుల్స్‌లో ఓడింది. తొలి సింగిల్స్‌లో వైదేహి 6-2, 5-7, 6-4తో ఫాంగ్ లిన్‌పై, రెండో సింగిల్స్‌లో రష్మిక 6-2, 7-6తో జోయన్నాపై నెగ్గారు. డబుల్స్‌లో అంకిత-ప్రార్థన జోడీ ఓటమి పాలైంది.

ఇది నా గ్రౌండ్

మ్యాచ్ సంబరాలపై కేఎల్ రాహుల్

బెంగళూరు: ఆర్‌సీబీతో గురువారం జరిగిన మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ వీరోచిత ఇన్నింగ్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌ను గట్టెక్కించింది. అయితే స్థానిక ఆటగాడైన రాహుల్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాక తీవ్ర ఉద్వేగంతో సంబరాలు చేసుకున్నాడు. ఇందులో భాగంగా తన బ్యాట్‌ను కాస్త పైకి లేపి గ్రౌండ్‌కి బలంగా ఆనించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే దీనిపై రాహుల్ వివరణ ఇస్తూ.. 'ఈ మైదానం నాకెంతో ప్రత్యేకమైంది. ఇది నా హోంగ్రౌండ్. దీని గురించి నాకన్నా ఎక్కువ ఎవరికి తెలుసు? ఇక నాకెంతో ఇష్టమైన సినిమా కాంతారాలో మాదిరి బ్యాట్ సంబరాలు చేసుకున్నాను' అని రాహుల్ పేర్కొన్నాడు.



మిస్ వరల్డ్ పోటీల ప్రతినిధులకు 'కాకతీయ టూర్'

» ఏర్పాట్లపై పర్యాటక శాఖ కార్యదర్శి స్మిత సభర్వాల్ సమీక్ష



హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు తరలి వచ్చే వివిధ దేశాల ప్రతినిధులకు ఘనంగా స్వాగతం పలికి ఆతిథ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వారికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వైభవ ప్రాభవాలను పరిచయం చేయడంతో పాటు ఇక్కడి ప్రత్యేక వంటకాలను రుచి చూపించాలని భావిస్తోంది. ఈ విషయమై శుక్రవారం పర్యాటక శాఖ కార్యదర్శి స్మిత సభర్వాల్ సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ప్రతినిధుల కోసం మే 14న 'కాకతీయ టూర్' నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వరంగల్‌లోని చారిత్రక ప్రదేశాలు, రామప్ప గుడిని చూపించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆమె సూచనలు ఇచ్చారు.

బీసీలు, మహిళల కోసం పోరాడిన పూలే: భట్టి

హైదరాబాద్/ బోరబండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోని తాడిత పీడిత, వెనుకబడిన వర్గాలు, మహిళలకు సామాజిక న్యాయం కోసం పెద్ద ఎత్తున పోరాటంతోపాటు ఆయా వర్గాలకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేస్-2లో దళిత అధ్యయన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ ఉన్న పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అటుపై అధ్యయన కేంద్రం అంతటా కలియ తిరుగుతూ వసతులు, ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రంలో వసతులపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పూలే ఆశయాల సాధనకు తమ ప్రభుత్వం పునరంకితమైన బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆర్‌కేవీవై కింద టార్గెట్ రూ.2273 కోట్లు!

» కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు

» ఢిల్లీలో మకాం వేసిన వ్యవసాయశాఖ అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, సంక్షేమ పథకాల నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన'(ఆర్‌కేవీవై) పథకంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి రూ. 2,273 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ డాక్టర్ గోపి, వ్యవసాయ, ఉద్యానశాఖల ఉన్నతాధికారులు ఢిల్లీలో మకాంవేసి ఈ ప్రాజెక్టు నివేదికను సమర్పించి, ఆమోదింప చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. రాష్ట్రాలు తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించటానికి కేంద్ర ప్రభుత్వం సౌలభ్యం కల్పించి ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసి 60:40నిష్పత్తిలో (కేంద్రం:రాష్ట్రం)నిధులు మంజూరు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు బెడిసికొట్టడంతో ఈ పథకం రాష్ట్రంలో నిర్వీర్యమైపోయింది.

రజతోత్సవ సభకు అనుమతి ఇవ్వడం లేదు!

» హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్ హనుమకొండ శాఖ

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 27న నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ సభకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదని పేర్కొంటూ ఆ పార్టీ హనుమకొండ శాఖ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ టీ వినోద్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఆ పార్టీ తరఫున న్యాయవాది వాదిస్తూ రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నా.. పోలీసులు స్పందించలేదని తెలిపారు. అయితే, ఈ నెల 21 వరకు సమయం ఇవ్వాలని హోం శాఖ తరఫు న్యాయవాది కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఈ నెల 17 నాటికి హోంశాఖ, వరంగల్ కమిషనర్‌లు తమ నిర్ణయాన్ని తెలపాలని పేర్కొంది. విచారణను 17కు వాయిదా వేసింది.

రోడ్డుకీడుస్తా.. కసి తీరే వరకు చంపుతా

» ఎమ్మెల్సీ విజయశాంతి భర్తకు ఓ వ్యక్తి బెదిరింపు

» కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వకపోతే కసి తీరేంతవరకు అతి దారుణంగా చంపేస్తానంటూ ఎమ్మెల్సీ విజయశాంతి భర్తను ఓ వ్యక్తి బెదిరించాడు. దాంతో అతడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. విజయశాంతి భర్త ఎం. వి శ్రీనివాస ప్రసాద్‌కు నాలుగేళ్ల క్రితం ఎం చంద్రకిరణ్ రెడ్డి అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను సోషల్ మీడియాలో ప్రమోషన్స్ చేస్తానని చంద్రకిరణ్ చెప్పుకున్నాడు. పనితీరు చూశాక కాంట్రాక్ట్ ఇస్తామని చంద్రకిరణ్‌కు శ్రీనివాస ప్రసాద్ చెప్పాడు. కొద్దిరోజుల తర్వాత అనుకున్న స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో అతడితో ఎలాంటి ఒప్పందం చేసుకోకుండా పంపించేశారు. కానీ చంద్రకిరణ్ మాత్రం తాను విజయశాంతి కోసం సోషల్ మీడియాలో పనిచేస్తున్నాని చెప్పుకుంటూ పలువురు రాజకీయ ప్రముఖుల వద్ద కాంట్రాక్టులు కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం.. తనకు డబ్బులను ఎప్పుడు చెల్లిస్తారంటూ శ్రీనివాసప్రసాద్‌కు చంద్రకిరణ్ రెడ్డి మెసేజ్ చేశాడు. ఎటువంటి ఒప్పందం లేకుండానే చంద్రకిరణ్ డబ్బులు అడగడంతో ఇంటికొచ్చి మాట్లాడాలని శ్రీనివాస్‌ప్రసాద్ మెసేజ్‌లో సూచించగా, అతడు రాలేదు. ఇటీవల "నాకు డబ్బులు ఇవ్వకపోతే మీ బతుకులు రోడ్డు కీడుస్తా.. కసితీరే వరకు అతి దారుణంగా చంపుతాను" అంటూ చంద్ర కిరణ్ రెడ్డి మెసేజ్ ద్వారా బెదిరించాడు. దాంతో శ్రీనివాసప్రసాద్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రత్నాపూర్ నీటి సమస్యపై సీఎంవో ఆరా

» గ్రామానికి జిల్లా అధికారులు.. నిరంతర నీటి సరఫరాకు హామీ

» 'ఆంధ్రజ్యోతి'కి గ్రామస్థుల కృతజ్ఞతలు

తలమడుగు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రత్నాపూర్ గ్రామంలో నెలకొన్న శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కన్నీటి కష్టాలు' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ ఆఫీస్ ఉన్నతాధికారులు స్పందించారు. ఆదిలాబాద్ జిల్లా అధికారులకు సీఎం క్యాంప్ ఆఫీసు ఉన్నత అధికారులు ఫోన్ చేసి రత్నాపూర్ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై ఆరా తీశారు. తక్షణం ఆ గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లా నీటిపారుదల శాఖ ఈఈ చంద్రమోహన్, డీఈ దేవయ్య, ఏఈ ఈ. సాయిరాం తదితరులు రత్నాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రత్నాపూర్ వాసులు మాట్లాడుతూ తమ గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సక్రమంగా అందించాలని కోరారు. గ్రామస్తుల అభిప్రాయాలను విన్న తర్వాత అధికారులు స్పందిస్తూ.. వీలైనంత త్వరగా రత్నాపూర్ గ్రామానికి నిరంతరం నీటి సరఫరాకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ఇంకా ఇతర సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. కాగా, తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి రత్నాపూర్ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

జూన్ 15 నుంచి టెట్

హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2025 నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ. నరసింహారెడ్డి శుక్రవారం వెల్లడించారు. డీఈడీ, బీఈడీ, భాషా పండిట్, తత్సమాన అర్హతలు కలిగినవారు టెట్‌కు అర్హులు. ఈనెల 15 నుంచి 30 తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రుసుమును ఒక్కో పేపర్‌కు రూ.750, రెండు పేపర్లకు కలిపి అయితే రూ.1000 లుగా నిర్ణయించారు. పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మరింత పకడ్బందీగా భూభారతి!

హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ధరణిలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా.. పకడ్బందీగా భూభారతి చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ సమస్యలపై సివిల్ కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా స్థాయి ట్రిబ్యునల్ ద్వారా పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించడం, 33 మాడ్యుళ్లను ఆరుకు కుదించడం, కొత్త చట్టంలో కీలక అంశాలుగా నిలవనున్నాయి. తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లకు భూ సమస్యలు పరిష్కరించే అధికారాలు ఇవ్వడంతోపాటు పార్ట్-బీలో ఉన్న భూముల సమస్యకు పరిష్కారం చూపేలా, అసైన్డ్ భూములకు పాస్ పుస్తకాలు ఇచ్చేలా మార్పులు చేశారు. 2025 భూభారతి చట్టం ప్రకారం హక్కుల రికార్డు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది. ఎవరైనా సర్టిఫైడ్ కాపీలు పొందవచ్చు. 10,954 మంది గ్రామ పాలనాధికారుల(జీపీవో)తో మళ్లీ గ్రామ స్థాయిలో రెవెన్యూ సేవలు అందించనున్నారు. ధరణిలో ఉన్న 33 మాడ్యూళ్లను భూభారతి చట్టంలో ఆరుకు కుదించారు. కొత్తగా అనుభవదారు కాలానికి చోటు కల్పించారు. భూ సర్వే అనంతరం సమగ్ర రికార్డు తయారు, భూమికి-రికార్డుకు లింకు చేస్తారు. భూముల రిజిస్ట్రేషన్, వెంటనే మ్యుటేషన్, ఆ తరువాత ఎంత భూమి రిజిస్టర్ చేసుకున్నారో సర్వే చేసి రైతు చేతికి మ్యాప్ ఇస్తారు. విరాసత్ కోసం దరఖాస్తు చేసుకుంటే, వారసులందరికి నోటీసులు ఇచ్చి అభ్యంతరాల స్వీకరణ అనంతరమే రికార్డుల్లో వివరాలు నమోదు(మ్యుటేషన్) చేస్తారు. అసైన్డ్ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు, 13బీ(ఆర్వోఆర్ పాత చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు జారీ చేసే ప్రొసీడింగ్స్), 38 ఈ(కౌలు రక్షిత చట్టం ద్వారా దక్కిన భూమిని కౌలుదారుడికి పంచే వాటా భూమి)కి ఆర్డీవో విచారణ అనంతరం పట్టాదార్ పాస్‌పుస్తకం ఇస్తారు. ప్రతి కమతానికి ఆధార్‌లాగా భూధార్ కార్డులు జారీ చేస్తారు. భూభారతి పోర్టల్‌తోపాటు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయంలో మ్యానువల్ రికార్డులు అందుబాటులోఉంచి భద్రపరుస్తారు.

ఫోర్త్ సిటీ మెట్రో అనుమతులు.. పరుగెత్తించండి



ఆర్‌ఆర్‌ఆర్, జాతీయ రహదారులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

శాఖల అధికారులతో వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. మెట్రో రెండో దశకు సంబంధించి కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఢిల్లీలో సంబంధిత అధికారులను కలిసి సంప్రదింపులు జరిపినట్లు రాష్ట్ర అధికారులు సీఎంకు వివరించారు. మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు(36.8 కి.మీ), రాయదుర్గం-కోకాపేటనియోపోలీస్(11.6 కి.మీ), ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట(7.5కి.మీ), మియాపూర్- పటాన్‌చెరు(13.4కి.మీ), ఎల్‌బీనగర్-హయత్‌నగర్(7.1కి.మీ)వరకు మొత్తం 76.4కిలోమీటర్లకు రూ.24,269 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు సాధించేందుకు నిరంతరం ప్రయత్నం చేయాలని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధంగా ఉండాలని సీఎం ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

'మూసీ'కి అనుగుణంగా జూపార్కు అప్‌గ్రేడ్

మూసీ పునరుజ్జీవన పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై వంతెన నిర్మాణ పనులకు జూన్‌లో టెండర్లు పిలవాలని, ఈలోపు అందుకు అవసరమైన సర్వేలు చేపట్టాలని, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ బాపూఘాట్‌లో నిర్మించతలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు, మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించనున్న వంతెన నమూనాలను పరిశీలించారు. మీర్ ఆలం ట్యాంక్‌పై నిర్మించే రెండున్నర కిలోమీటర్ల పొడవైన వంతెనను అద్భుతంగా నిర్మించాలని, సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం సూచించారు. సింగపూర్‌లోని 'గార్డెన్స్ బై ది బే'ను తలపించేలా బర్డ్ ప్యారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా మీర్ ఆలం చెరువులోని మూడు ఐలాండ్స్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. వెడ్డింగ్ డెస్టినేషన్‌కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతోపాటు అడ్వెంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీథియేటర్ ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలని సూచించారు. చెరువులో నీటిని శుద్ధి చేయడంతోపాటు ఐలాండ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని, పీపీపీ విధానంలో ఐలాండ్స్ అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. మీర్ ఆలం వంతెన అభివృద్ధి పనులతోపాటు ఐలాండ్స్ జోన్ ఆనుకుని ఉన్న జూపార్క్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. ఐలాండ్స్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని జూ పార్క్‌ను కూడా అప్‌గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

జాతీయ రహదారులకు భూసేకరణపై దృష్టి

రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రై పోర్టుకు రూపకల్పన చేయాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. రీజినల్‌రింగ్‌రోడ్ సమీపంలో సరైన ప్రాంతంలో ఈ పోర్టు ఉండాలని పేర్కొన్నారు. జాతీయ రహదారులకు భూసేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణభాగం డీపీఆర్ నివేదికను త్వరగా తెప్పించాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించే జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు పంపేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలూ తయారు చేయాలన్నారు. భూసేకరణలో సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని సీఎస్ శాంతి కుమారికి సూచించారు. సమీక్షల్లో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

లేక్ వ్యూ పార్కులో జ్యోతిరావు పూలే విగ్రహం

» స్థలాన్ని పరిశీలించిన సీఎం

» సంఘ సంస్కర్తకు ఘన నివాళులు

హైదరాబాద్ సిటీ/గోల్నాక, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ తీరాన ఇందిరా గాంధీ రోటరీ పక్కన గల లేక్‌వ్యూ పార్కులో సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి లేక్‌వ్యూ పార్కును సందర్శించారు. పూలే విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వేచేసి విగ్రహ ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికను అందించాలని సీఎం హెచ్ఎండీఏ అధికారులకు ఆదేశించారు. మరోవైపు.. అంబర్‌పేటలోని పూలే చౌరస్తాలో పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి.. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావులతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

14న భూభారతి పోర్టల్ ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడారు. భూ భారతి బిల్లుకు గత డిసెంబరులో అసెంబ్లీ ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. ఈ చట్టాన్ని ఎలా అమలు చేయాలన్నదానిపై విధివిధానాలను రూపొందించామన్నారు. చట్టంలోని నిబంధనలను భూభారతి పోర్టల్ ప్రారంభోత్సవం రోజున సీఎం రేవంత్ వివరిస్తారని పేర్కొన్నారు. దీంతో పాటు ఏజెన్సీ ఏరియాలో గిరిజన, గిరిజనేతర ప్రజలకు సంబంధించిన భూముల విషయాలపై పలు అంశాలను తెలియజేయనున్నట్లు ఆయన చెప్పారు. గతం ప్రభుత్వం 2020లో ధరణి చట్టాన్ని తెచ్చిందని, కానీ 2023 వరకు కూడా ఆ చట్టం అమలుకు విధివిధానాలను ఖరారు చేయలేకపోయిందని పొంగులేటి ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం చట్టాన్ని తీసుకొచ్చిన మూడు నెలల్లోనే నిబంధనలను రూపొందించిందని చెప్పారు. పేదలు కష్టపడి సంపాదించిన భూమికి భద్రత కల్పించడమే భూభారతి చట్టం ఉద్దేశమన్నారు. కాగా, కూనవరం గ్రామంలో గిరిజనులు వంకా శివలక్ష్మి, కాంతారావు దంపతుల ఇంట్లో పొంగులేటి ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యం భోజనం చేశారు. ఆ దంపతుల మధ్య మంత్రి నేలపై కూర్చొని భోజనం చేయడమే కాకుండా వారికి వడ్డించారు. తర్వాత వారి కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో ఫ్రెంచ్ సబ్జెక్టు!

హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకుల విద్యాలయాల్లో ఆసక్తిఉన్న విద్యార్థులకు ఫ్రెంచ్ భాషను నేర్పించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికోసం విద్యార్థులకు ఫ్రెంచ్ బోధించడానికి కొందరు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైంది. ఆరో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులలో ఆసక్తి ఉన్నవారికి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫ్రెంచ్ సబ్జెక్టును బోధించనున్నారు. ఇందుకోసం ఫ్రెంచ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాతో ఎస్సీ గురుకుల విద్యాసొసైటీ ఒప్పందం కూడా చేసుకుంది. రెగ్యులర్ తరగతుల తర్వాత స్టడీ అవర్‌లో ఈ సబ్జెక్టును బోధించనున్నారు. విద్యార్థులు ఆసక్తి చూపితే.. రెగ్యులర్‌గా బోధించే అవకాశమూ ఉంది. ఈ అంశంలో విద్యార్థులను బలవంతం చేయబోమని అధికారులు చెబుతున్నారు.

పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేలు

» పరిహారం ఇచ్చేందుకు సర్కారు నిర్ణయం

» 20 వేల ఎకరాలకు పంపిణీ చేసే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పంటల బీమాకు సంబంధించి కేంద్ర పథకం ఫసల్ బీమా యోజన తెలంగాణలో ఇంకా అమల్లోకి రాలేదు. దీంతో రాష్ట్ర బడ్జెట్ నుంచే నష్ట పరిహారం ఇవ్వాలని సర్కారు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ యాసంగి సీజన్‌లో అకాల వర్షాలతో 8,408 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు రైతుల వారీగా నివేదిక అందింది. అయితే ఈనెల మూడో తేదీ నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలకు మరింత పంట నష్టం చోటు చేసుకుంది. 14,956 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం రాగా, రైతుల వారీగా సర్వే చేయాలని వ్యవసాయశాఖ అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ సర్వే పూర్తయితే మొత్తం కలిపి సుమారు 20 వేల ఎకరాల వరకు లెక్క తేలే అవకాశాలున్నాయి. 20 వేల ఎకరాలకు.. ఎకరానికి రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం పంపిణీ చేయటానికి రూ.20 కోట్ల నిధులు అవసరమవుతాయి.



అశ్వారావుపేటలో రోడ్డుపై పడిపోయిన కొబ్బరిచెట్టు

అశ్వారావుపేటలో ఈదురుగాలుల బీభత్సం..

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 11: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో గురువారం అర్ధరాత్రి ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఒకవైపు గాలులు, మరో వైపు వాన దాదాపు గంట పాటు ఏమీ జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నారాయణపురం, వినాయకపురం, గుర్రాల చెరువు, అశ్వారావుపేట ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటల్లో కాయలన్నీ రాలిపోయాయి. గుర్రాలచెరువు, అల్లిగూడెం ప్రాంతాల్లో కూరగాయలు సాగు దెబ్బతిన్నది. పెద్ద పెద్ద చెట్లు పడిపోవటంతో ఒక్క అశ్వారావుపేటలోనే 16 కరెంటు స్తంభాలు నేలకూలాయి. ఇతర ప్రాంతాల్లో మరో 9 కరెంటు స్తంభాలు పడిపోయాయి. పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్తు శాఖకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. రంగంలోకి దిగిన విద్యుత్తు శాఖ అధికారులు వెంటనే పనులు చేపట్టి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

కేంద్ర పథకాలకు సీఎంల ఫొటోలు పెడతారా?

సిరిసిల్లలో తుమ్మల సూటి ప్రశ్న.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేర్వేరు రాజ్యాంగ బాధ్యతలున్నాయని వ్యాఖ్య

» తొలిసారి మోదీ హయాంలోనే వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ: పొన్నం

» బీఆర్ఎస్‌ది ఏఐ విద్య : దుద్దిళ్ల



సిరిసిల్ల సభలో నియామక పత్రాలను అందజేస్తున్న మంత్రులు

సిరిసిల్ల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో ప్రధాని మోదీ ఫొటో పెట్టాలని మాట్లాడుతున్న కొందరు.. ప్రజల సొమ్ముతో కేంద్రప్రభుత్వం నడుస్తున్నందున కేంద్ర పథకాల్లో సీఎం, రాష్ట్ర మంత్రుల ఫొటోలు పెడతారా? అని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రశ్నించారు. కేంద్రాన్ని పోషించే రాష్ట్రాల్లో తెలంగాణ ముందు వరుసలో ఉంటుందని, రాష్ట్రం చెల్లించే పన్నుల్లో కేవలం 30 పైసలే తెలంగాణకు వస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజ్యాంగ బద్ధంగా ఎవరి బాధ్యతలు వారికి ఉన్నాయని గుర్తు చేశారు. శుక్రవారం రాజన్న-సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అపెరల్ పార్కులో రూ.62 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన ఫంక్సుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ (టెక్స్‌పోర్టు) గార్మెంట్ యూనిట్‌ను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతన్నలు, నేతన్నల సంక్షేమమే ప్రాధాన్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి వర్కర్ టు ఓనర్ కార్యక్రమం పునరుద్ధరిస్తామన్నారు. బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం మాట్లాడుతూ దేశంలోనే తొలిసారి తమ ప్రభుత్వం ప్రజలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఇస్తున్నారా అన్న సంగతి కేంద్రమంత్రి బండి సంజయ్ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వస్త్ర పరిశ్రమపై పన్నులేవని, కానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ వసూలు చేస్తున్నదని, దాన్ని తొలగించాలన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములు ప్రభుత్వానివేనని రికార్డుల్లో ఉన్నా కొందరు కృత్రిమ మేధను ఉపయోగించి నకిలీ వీడియోలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్‌ది 'ఏఐ' విద్య అని పేర్కొంటూ.. ఆ పార్టీ నేత కేటీఆర్ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: మంత్రులు

సిద్దిపేట కలెక్టరేట్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ చెప్పారు. అత్యాధునిక టెక్నాలజీతో సిద్దిపేట జిల్లా నంగనూరు నర్మెట్టలో రూ.300 కోట్లతో చేపట్టిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను శుక్రవారం వారు పరిశీలించారు. అనంతరం జిల్లాలో అకాల వర్షాలతో వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

కేంద్రానికి చేరిన బీసీ బిల్లులు

» న్యాయ సలహా తర్వాత పంపిన గవర్నర్

» గత నెలలో బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

» బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించేలా రూపకల్పన

» కేంద్రం స్పందనపై సర్వత్రా ఆసక్తి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం నిమిత్తం కేంద్రానికి చేరినట్టు తెలిసింది. రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉపాధి, స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ ప్రభుత్వం గత నెల 17న శాసనసభలో రెండు బిల్లులను ప్రవేశపెట్టగా.. అన్ని పార్టీల మద్దతుతో ఆమోదం పొందడం తెలిసిందే. అనంతరం ప్రభుత్వం ఈ రెండు బిల్లులను గవర్నర్‌కు పంపింది. మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలున్న నేపథ్యంలో.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ రెండు బిల్లులపై న్యాయ నిపుణుల సలహా తీసుకున్నారు. అనంతరం రెండు రోజుల క్రితం ఈ బిల్లులను కేంద్రానికి పంపినట్టు సమాచారం. బీసీ బిల్లులకు కేంద్ర ఆమోదం కోసం రాష్ట్రంలోని అన్ని పక్షాలు ఉమ్మడిగా వెళ్లి ప్రధాని మోదీని కలుద్దామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్న సంగతి తెలిసిందే.

కేంద్రం ఎలా స్పందిస్తుందన్న దానిపై ఆసక్తి

రాష్ట్రంలో బీసీ బిల్లుల నేపథ్యంలో.. బీసీలకు 42శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10శాతం మొత్తం రిజర్వేషన్లు 67శాతానికి చేరుతాయి. సుప్రీం కోర్టు నిర్దేశించిన 50శాతం గరిష్ఠ రిజర్వేషన్ల పరిమితి దాటిపోతుంది. ఈ క్రమంలో బీసీ బిల్లులకు కేంద్రం ఆమోదం లభిస్తుందా, లేదా అనేది ఆసక్తిగా మారింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 37శాతానికి పెంచుతూ ఆమోదించిన బిల్లును కేంద్రానికి పంపింది. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని ఉపసంహరించుకుంది. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించిన విధంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం కసరత్తు చేపట్టింది. వివిధ సంఘాలతో చర్చలు జరిపింది. కులగణన నిర్వహించింది. రాష్ట్రంలో బీసీలు 56.36 శాతం ఉన్నట్టు నిర్ధారించింది. బీసీలకు విద్య ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం ఒక బిల్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా మరో బిల్లు రూపొందించింది. వీటిని శాసనసభ, మండలిలో ప్రవేశపెట్టి ఆమోదం పొందింది.

ఎస్సీ వర్గీకరణకు ఇప్పటికే ఆమోదం..

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాస్ చేశారు. ఎస్సీ ఉప కులాలను మూడు విభాగాలుగా విభజించి మొత్తం 15శాతం రిజర్వేషన్లను వాటి మధ్య పంచుతూ ఆ బిల్లును రూపొందించారు. గవర్నర్ ఆమోదంతో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

సన్నబియ్యం సంబరాల్లో పాల్గొనండి

» ఈ పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లండి

» కాంగ్రెస్ నేతలకు మంత్రి ఉత్తమ్, టీపీసీసీ చీఫ్ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విప్లవాత్మక పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సన్నబియ్యం పంపిణీ, రైతుల నుంచి సన్న వడ్ల కొనుగోళ్లపై కాంగ్రెస్ నేతలు, బ్లాక్, మండల అధ్యక్షులతో మంత్రి ఉత్తమ్ జూమ్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఇందులో టీపీసీసీ చీఫ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు క్షేత్రస్థాయి కాంగ్రెస్ నేతలు సహకరించాలని కోరారు. గతంలో 2.80 కోట్ల మందికి దొడ్డు బియ్యం ఇచ్చేవారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 3.10 కోట్ల మందికి సన్నబియ్యం ఇవ్వబోతోందన్నారు. సన్నబియ్యం పథకానికి ప్రజల నుంచి అద్భుత స్పందన వస్తోందని.. పేదలకు సన్నబియ్యం పంపిణీ పథకాన్ని బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ఎక్కడైనా అమలు చేశాయా అని నిలదీశారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. సన్న వడ్లకు బోనస్ చెల్లింపుతో రాష్ట్రంలో సన్నవరి సాగు 25 లక్షల ఎకరాల నుంచి 40 లక్షల ఎకరాలకు పెరిగిందని చెప్పారు.

'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లుగా మూడు టిమ్స్

» అల్వాల్‌లో న్యూరో, సనత్‌నగర్‌లో కార్డియాక్, కొత్తపేటలో గ్యాస్ట్రో సైన్సెస్ ఆస్పత్రుల ఏర్పాటు

» అధికారికంగా ప్రకటించిన మంత్రి దామోదర

» ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో నిర్మిస్తోన్న మూడు టిమ్స్ ఆస్పత్రులను సెంటర్ ఎక్సలెన్స్ కేంద్రాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. అల్వాల్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ న్యూరో సైన్సెస్, సనత్‌నగర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ సైన్సెస్, కొత్తపేటలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ గ్యాస్ట్రో సైన్సెస్‌ను అభివృద్ధి చేస్తామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారికంగా ప్రకటించారు. ఈ విషయాన్ని "ఆంధ్రజ్యోతి" ముందే చెప్పింది. "సర్కారీ స్పెషాలిటీ" పేరిట ఈ నెల 1న ఓ కథనాన్ని ఇచ్చింది. మూడు టిమ్స్, మెడికల్ కాలేజీలు, వరంగల్ హెల్త్ సిటీ భవన నిర్మాణ పనులపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల భవన నిర్మాణ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేస్తామని అధికారులు వివరించగా.. పనులు ఆలస్యం కావడంపై మంత్రి దామోదర అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షకాలం మొదలయ్యేలోగా నిర్మాణ పనులన్నీ కొలిక్కి రావాలని అధికారులను ఆదేశించారు.

మీ నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం!

» విద్యకు ప్రాధాన్యమన్నవి కేవలం మాటలేనా?

» సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ లేఖ



హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రారంభించిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బీఏఎస్) పథకానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఈ పథకం కింద 150 స్కూళ్లకు నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు, యాజమాన్యాలకు పెను శాపంగా మారిందని చెప్పారు. బీఏఎస్ నిధుల విడుదలపై తక్షణమే స్పందించాలని కోరుతూ ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. సరైన భోజనం, వసతి, ఇతర సౌకర్యాల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాయన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యమంటూ మీరు చెబుతున్నవి కేవలం మాటలేనని ఈ నిర్లక్ష్య వైఖరితో స్పష్టమవుతోందని తన లేఖలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023-24 విద్యా సంవత్సరానికిగాను రూ.130 కోట్లు కేటాయించిందని, ఇందులో తొలి విడత రూ.50 కోట్లు విడుదల చేయగా.. రెండో విడత నిధులు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చిందని గుర్తుచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.80 కోట్లను విడుదల చేయలేదని, 2024-25కు సంబంధించిన నిధులనూ విడుదల చేయలేదని తెలిపారు. గత ఆగస్టులో ఉపముఖ్యమంత్రి భట్టికి లేఖ రాసినా పరిష్కరించలేదన్నారు. బీఏఎస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సీఎంని కోరారు.

దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ డీఎస్ఆర్ విధానం

» అగ్నిమాపక శాఖలో అమలుకు నిర్ణయం

» రాష్ట్ర అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అగ్నిమాపకశాఖ అమలు చేస్తున్న 'ఆన్‌లైన్ డీఎస్ఆర్ (డైలీ స్టేటస్ రిపోర్టు)' విధానాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని నిర్ణయించినట్టు అగ్నిమాపకశాఖ డీజీ వై.నాగిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రమాదం జరిగినట్టు ఫోన్ వచ్చినప్పటి నుంచి రెస్క్యూ ఆపరేషన్ పూర్తయ్యే వరకు అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్టు డీజీ వెల్లడించారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 45వ 'స్టాండింగ్ ఫైర్ అడ్వైజరీ కౌన్సిల్ (ఎస్ఎఫ్ఏసీ)' సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన చర్చలో అన్ని రాష్ట్రాల అగ్నిమాపక శాఖ, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖలోని అన్ని స్థాయిల సిబ్బందిని ఒకే వేదికపైకి తెచ్చి అనుసంధానించే అంశంపై డీజీ వై.నాగిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆలిండియా ఫైర్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు (ఏఐఎఫ్ఎస్‌సీబీ) ఏర్పాటు చేయాలని ఈ సదస్సులో నిర్ణయించారు. సదస్సులో మొత్తంగా 100 ఎజెండా అంశాలపై సదస్సులో చర్చించారు. ఇందులో కేంద్ర ఫైర్ సర్వీసెస్ డీజీ వివేక్ శ్రీవాస్తవతోపాటు ఇతర రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల సరఫరా టెండర్ గడువు పెంపు

» ఈ నెల 15వరకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు గుడ్లు సరఫరా చేయడానికి కాంట్రాక్టర్ల ఎంపిక కోసం చేపట్టిన టెండర్ గడువును పెంచారు. రాష్ట్రంలోని 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, జోన్ల వారీగా విభజించి గుడ్ల సరఫరాకు టెండర్ ఆహ్వానించారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10వ తేదీన దరఖాస్తు గడువు ముగియగా.. శుక్రవారం సాంకేతిక బిడ్లను తెరవాల్సి ఉంది. అయితే, వరుస సెలవుల నేపథ్యంలో దరఖాస్తు చేసుకోలేకపోయామని, గడువు పెంచాలని పౌల్ట్రీ రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 15న సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు గడువును పెంచారు. ఈ నెల 16న సాయంత్రం 4 గంటలకు ఆ శాఖ డైరెక్టర్ సమక్షంలో సాంకేతిక బిడ్లను తెరవనున్నట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

» పూలే విగ్రహం ఏర్పాటు నిర్ణయంపై ఎమ్మెల్సీ కవిత స్పందన

హైదరాబాద్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్ స్థలపరిశీలన చేయడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేసేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో 48గంటలు నిరాహారదీక్ష చేసి ఉమ్మడి రాష్ట్రంలోనే సాధించుకున్నామని ఆమె గుర్తు చేశారు.

సంస్కృతానికే దండ..

తెలుగుకేదీ అండ?



(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులకు దేవతలు మెచ్చి ఇచ్చే వరం కాదిది.. ఇంటర్ బోర్డు ఇష్టారాజ్యానికి నిదర్శనం. అదే బోర్డు.. తల్లిభాష అయిన తెలుగును సెకండ్ లాంగ్వేజ్‌గా తీసుకున్న విద్యార్థులకు మాత్రం గీచిగీచి మార్కులేస్తోంది! సంస్కృత పరీక్ష రాసే విద్యార్థులు తమకు తోచిన సమాధానాలు రాసినా.. కొందరు విద్యార్థులైతే క్వశ్చన్ పేపర్‌లో ఇచ్చిన ప్రశ్నల్నే తిరిగి సమాధానాలుగా రాసినా.. పేపర్ దిద్దేవారు దాన్ని పట్టించుకోకుండా మార్కులు వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విద్యార్థులు కొంచెం బాగా రాస్తే.. 100కి 99 మార్కులు కూడా వేస్తున్న దాఖలాలున్నాయి. ఇన్ని మాటలేల.. గత 30 సంవత్సరాల్లో జరిగిన ఇంటర్ పరీక్షల్లో సంస్కృతం పేపర్‌లో తప్పినవారు వేళ్లమీద లెక్కపెట్టదగిన సంఖ్యలో మాత్రమే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిరుడు ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కేవలం ఒక్క మార్కుతో తప్పిన విద్యార్థుల సంఖ్య రాష్ట్రవ్యాప్తంగా 40 వేలకు పైగా ఉంది. కానీ.. ద్వితీయ భాషగా సంస్కృతాన్ని తీసుకున్నవారిలో అత్యధికులకు అందులో కనీసం 90 మార్కులు వచ్చాయి. అదే సమయంలో.. తెలుగులో అత్యధికులకు 70 మార్కులకు మించి రాలేదు. అంతేనా.. నిరుడు తెలుగులో ఫెయిలైన ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల సంఖ్య దాదాపు 7 వేల దాకా ఉంది.

బట్టీ కొట్టి.. ముక్కునపట్టి..

ఇంటర్‌లో సంస్కృతాన్ని రెండో భాషగా తీసుకుంటున్న విద్యార్థులు.. ఆ భాషను కాస్తంతైనా నేర్చుకుంటున్నారా అంటే అదీ లేదు. అంతా బట్టీ వ్యవహారమే. అయినప్పటికీ.. విద్యార్థులకు వ్యవహారపరంగా ఏమాత్రం ఉపయోగపడని సంస్కృతాన్ని ప్రోత్సహిస్తూ ఇంటర్‌బోర్డు అధికారులు తెలుగు చదివేవారిని నిరుత్సాహపరుస్తున్నారని భాషాభిమానులు విమర్శిస్తున్నారు. విద్యార్థులు తెలుగు పరీక్షను చక్కటి చేతిరాతతో, అక్షర, అన్వయ దోషాలు లేకుండా ఎంత బాగా రాసినా 80-85 మార్కులు కూడా వేయని అధికారులు.. కనీసం ఒక్క సంస్కృత తరగతి కూడా వినని విద్యార్థులకు 90కి పైగా మార్కులు వేయడమేమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్కృత పరీక్షలో సమాధానాలు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ ఇలా ఏ భాషలోనైనా రాసే వీలుండడం.. భారీగా మార్కులు వచ్చే అవకాశం ఉండడంతో అది కార్పొరేట్ విద్యార్థులకు ఒక వరంగా, స్కోరింగ్ సబ్జెక్టుగా మారిపోయింది.

నిబంధనల ఉల్లంఘన..

ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం.. కాలేజీల్లో బోధించే ఏ భాషకైనా అందులో సబ్జెక్టు నిపుణుడైన అధ్యాపకుడు ఒకరు ఉండాల్సిందే. గణితంలో ఎమ్మెస్సీ చేసినవారే లెక్కల పాఠాలు చెప్పాలి. ఆంగ్లంలో ఎంఏ చేసినవారే ఇంగ్లిష్ బోధించాలని నిబంధనలు పేర్కొంటున్నాయి. ఇదే కోవలో సంస్కృతంలో పీజీ చేసినవారే ఆ భాషను బోధించడానికి అర్హులు. కానీ, రాష్ట్రంలోని 1500కి పైగా కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల్లో చాలాచోట్ల ఆ పరిస్థితి లేదు. సబ్జెక్టు నిపుణులు లేకపోవడం సంగతి అటుంచితే.. కనీసం తరగతులు కూడా ఏడాది పొడుగునా జరగవు. వార్షిక పరీక్షలకు కొద్దిరోజుల ముందు.. కొంత మెటీరియల్ ఇచ్చి విద్యార్థులతో బట్టీపట్టిస్తున్నారంతే. ఆ కాస్త బట్టీతోనే పరీక్ష రాసేస్తున్నారు. వారి సమాధాన పత్రాలు దిద్దేందుకు అర్హులైన సంస్కృత అధ్యాపకులు సైతం తగిన సంఖ్యలో రాష్ట్రంలో లేరు. దీంతో, ఉన్న అతి కొద్దిమందితోనే మూల్యాంకనం చేయిస్తున్నారు. సరిపడా అధ్యాపకులు లేకపోవడంతో.. ఒకసారి దిద్దిన సమాధాన పత్రాలను పునఃసమీక్షించకుండానే (రీ-వెరిఫికేషన్ చేయకుండానే) మార్కులు ఖరారు చేస్తున్నారు.

ఎందుకీ ప్రాధాన్యం

కిందటి నెలలో ముగిసిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 9,96,971 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 8,54,726 (85.73%) మంది.. కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులు కేవలం 1,42,245 మంది (14.26%) మాత్రమే. రాష్ట్రంలో మొత్తం 436 ప్రభుత్వ కాలేజీలున్నాయి. అంటే.. ఒక్కో కాలేజీలో సగటున 326 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నట్టు. ఉన్న 436 కళాశాలల్లోనూ కేవలం 15 చోట్ల మాత్రమే మాత్రమే సంస్కృత అధ్యాపకుల పోస్టులు మంజూరయ్యాయి. మిగతా 421 కాలేజీల్లో చేరే విద్యార్థులు.. ద్వితీయ భాషగా సంస్కృతాన్ని తీసుకునే అవకాశం లేదు. తెలుగే తీసుకోవాలి. కాదూ కూడదూ.. సంస్కృతం తీసుకుని ఎక్కువ మార్కులు పొందాలని భావిస్తే.. ఆ సబ్జెక్టు బోధించే 15 ప్రభుత్వ కాలేజీల్లో ఎక్కడో ఒకచోట చేరాలి. లేదా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు వెళ్లాలి. దీంతో.. స్కోరింగ్ కోసం ఎక్కడో ఉన్న ప్రభుత్వ కాలేజీకి వెళ్లే అవకాశం లేని చాలా మంది విద్యార్థులు తమకు సమీపంలో ఉన్న ప్రైవేటు కాలేజీల్లో చేరుతున్నారు. తెలుగుపై అభిమానం ఉన్న విద్యార్థులు మాత్రమే తెలుగును రెండో భాషగా తీసుకుంటున్నారు. అందుకే ప్రభుత్వ కాలేజీల్లో చేరేవారి సంఖ్య తగ్గుతోందని, మాతృభాషకు విద్యార్థులు దూరం కావడానికి ఇదీ ఒక కారణమవుతోందని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. అయినప్పటికీ తెలుగును పక్కన బెట్టి ఇంటర్ బోర్డు సంస్కృతానికి ఎందుకు ప్రాధాన్యం ఇస్తోందో అంతుచిక్కట్లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్‌లో ద్వితీయ భాషగా హిందీ, ఉర్దూ, అరబ్బీ, తమిళం, కన్నడం, మలయాళం కూడా తీసుకునే వెసులుబాటు ఉంది. కానీ, వాటిల్లో ఏ భాష తీసుకున్నవారికీ వేయనన్ని మార్కులు సంస్కృతం తీసుకున్న వారికి వేయడం వెనక మతలబు ఏమిటో అర్థం కాని పరిస్థితి అని వారు వాపోతున్నారు.

ఫస్ట్ ర్యాంక్ కోల్పోతానని తెలిసినా తెలుగునే ఎంచుకున్నా

ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించా

సంస్కృతం ఎంచుకోలేదని పశ్చాత్తాపం లేదు

ఐపీఎస్ అధికారి మస్తిపురం రమేశ్

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతంను అమలు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు ఆలోచనలు చేస్తున్న వేళ.. రాష్ట్రానికి చెందిన ఐపీఎస్ అధికారి, ఐజీపీ మస్తిపురం రమేశ్ తెలుగు భాషపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. తాను ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగును ఎంచుకోవడం వల్ల ఎదురైన అనుభవాన్ని ఎక్స్ వేదికగా శనివారం పంచుకున్నారు. నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ నైవాస్య(ఏపీఆర్జేసీ) కళాశాలలో 1989లో సంస్కృతం కాదని ద్వితీయ భాషగా తెలుగును ఎంచుకొని ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంక్ సాధించానని ఐజీపీ రమేశ్ పేర్కొన్నారు. ఆంగ్లంలో పరీక్షలు రాయగలిగిన వెసులుబాటు ఉన్నా సంస్కృతం ఎంచుకొని ఉంటే తనకు మొదటి ర్యాంకు వచ్చేదని తెలిసినా కూడా తెలుగునే ఎంచుకున్నానని చెప్పారు. నాటి నుంచి నేటి వరకు ఈ విషయంలో తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఐజీపీ రమేశ్ పేర్కొన్నారు. భాషలను ర్యాంకుల పరిగణనలోకి తీసుకోవడం తగదని తన అభిప్రాయమని స్పష్టం చేశారు. విద్యా సంస్థలకు కాసులు కురిపిస్తున్న ర్యాంకులకు భాషను ముడిపెట్టడం తగదన్నారు.ఈ అంశంలో ఇంటర్మీడియట్ బోర్డు పునః సమీక్ష చేయాలని కోరుతూ పోస్టు చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు ఆలోచనపై 'మార్కుల కోసం మాతృభాషకు మంట' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి సంబంధించిన చిత్రాలను కూడా ఐజీపీ రమేశ్ తన పోస్టుకు జత చేశారు.

'సంస్కృతం'పై పునరాలోచన చేయాలి: వెంకయ్య



హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సంస్కృతంను ద్వితీయ భాషగా ప్రవేశపెట్టాలన్న అంశంపై పునరాలోచన చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. సంస్కృతాన్ని బోధించడంలో తప్పులేదని, అదే సమయంలో విద్యార్థులను మాతృభాషకు దూరం చేయడం మంచిది కాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ దిశగా యోచిస్తోందంటూ వచ్చిన వార్తలు విని తాను విచారించానని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మనదైన సంస్కృతిని అందిపుచ్చుకునే దిశగా అమ్మ భాష ఆలంబనగా నిలుస్తుందని, అందుకే జాతీయ విద్యా విధానం-2020 కూడా దానికి ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని, విద్యార్థులను మాతృభాషకు మరింత చేరువ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

గోదావరి-బనకచర్లలో ఏపీని అడ్డుకోండి

గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీకి తెలంగాణ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టులో ముందుకెళ్లకుండా ఏపీని కట్టడి చేయాలని గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ), పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జలవనరుల సంఘాని(సీడబ్ల్యూసీ)కి తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ శుక్రవారం లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం ప్రకారం గోదావరిలో ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నా గోదావరి బోర్డు డీపీఆర్‌ను పరిశీలించాల్సి ఉంటుందని.. సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి వీల్లేదని గుర్తు చేశారు. గోదావరి-బనచకర్ల లింక్‌లో భాగంగానే పల్నాడు డ్రౌట్ మిటిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని, దీని కింద ఇప్పటికే రూ.1,019.41 కోట్లు వెచ్చించారని తెలిపారు. గోదావరి-బనచకర్ల ప్రాజెక్టును తక్షణమే అడ్డుకోవాలని తెలంగాణ ఈఎన్‌సీ విజ్ఞప్తి చేశారు.

సాగర్ నుంచి సాగు నీటిని వదలొద్దు:తెలంగాణ

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ కుడి(ఏపీ), ఎడమ(తెలంగాణ, ఏపీ పాక్షికం) కాలువల నుంచి సాగు నీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయకుండా ఆపాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ఛైర్మన్‌కు తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) అనిల్‌కుమార్ లేఖ రాశారు. సాగునీటి అవసరాలు తీరినందున.. ఇక విగిలిన నిల్వలను తాగునీటి కోసం మాత్రమే వినియోగించాలని తెలంగాణ కోరింది. తాగు నీటి అవసరాల కోసం నీటి విడుదలపై కృష్ణాబోర్డుకు చెందిన త్రిసభ్య కమిటీ(తెలంగాణ, ఏపీ ఈఎన్‌సీలు, కృష్ణాబోర్డు మెంబర్ సెక్రటరీ) చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

రూ.10 వేల కోట్ల ఆర్థిక మోసం!

కంచ గచ్చిబౌలి భూముల పేరిట రుణం.. దేశాన్ని, బ్యాంకులను మోసగించిన రేవంత్ సర్కార్

» హక్కు పత్రాలు చూడకుండానే రుణమిచ్చిన ఐసీఐసీఐ బ్యాంక్ :కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ విధ్వంసంతో పాటు రూ.10 వేల కోట్ల బడా ఆర్థిక మోసం కూడా జరిగిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ఆ భూముల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి ఈ కుంభకోణానికి తెరతీశారన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ సర్కారు రిజర్వ్ బ్యాంకును, బ్యాంకులను, దేశాన్ని మోసం చేసిందని పేర్కొన్నారు. భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేకుండానే టీజీఐఐసీ ఆ భూమిని ఐసీఐసీఐ బ్యాంకుకు ఎలా తనఖా పెట్టింది? సేల్ డీడ్ కూడా లేని భూమికి బ్యాంకు ఎలా రుణం ఇచ్చింది? ఇది మోసం కాదా? అని ఆయన ప్రశ్నించారు. భూ యాజమాన్య హక్కు ఎవరిదో తెలుసుకోకుండానే రూ.10 వేల కోట్ల రుణమిచ్చిన ఐసీఐసీఐ బ్యాంకు తన విశ్వసనీయతను కోల్పోయిందన్నారు. ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్‌మెంట్ అనే కంపెనీ రేవంత్‌రెడ్డికి బ్రోకరిజం చేసిందని, దీని వెనక బీజేపీ ఎంపీ హస్తం ఉందని ఆరోపించారు. ఇందుకుగాను సదరు కంపెనీకి రూ.169.84 కోట్లు లంచం ఇచ్చారని విమర్శించారు. కంచ గచ్చిబౌలి భూములపై కోర్టు తీర్పు అనంతరం టీజీఐఐసీకి ఆ భూములు అప్పగిస్తున్నట్లు జీవో మాత్రమే ఇచ్చారన్నారు. సేల్ డీడ్, మ్యుటేషన్ చేయలేదని, భూములకు హక్కుదారుగా నిర్ధారించలేదని చెప్పారు. తనది కాని భూమిని బ్రోకర్ కంపెనీ మాట విని, టీజీఐఐసీ తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ఈ మోసానికి టీజీఐఐసీతో పాటు పరిశ్రమల శాఖ కార్యదర్శిని జైల్లో పెట్టొచ్చని తెలిపారు. సీఎం రేవంత్, ఐసీఐసీఐ బ్యాంకు, బ్రోకర్ సంస్థ పాత్రపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని అడ్డుకోకపోతే రేవంత్ సర్కారు మరో 60 వేల కోట్ల భూదోపిడీకి పాల్పడుతుందన్నారు. టీకన్ ట్రస్టీషిప్, ట్రస్ట్ అడ్వైజర్స్ సంస్థలపై వెంటనే నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ లెక్కల ప్రకారం కంచగచ్చిబౌలి ప్రాంతంలో గజం విలువ రూ.26,900 అని.. అంటే 400 ఎకరాలకు రూ.5,239.84 కోట్లు మాత్రమేనని, మరోవైపు అక్రమ మార్గంలో రుణం పొందేందుకు రెవెన్యూ శాఖ ఆ భూమి విలువ 30 వేల కోట్లు అని చెప్పుకొందని విమర్శించారు. ప్రభుత్వం, బ్రోకర్ సంస్థ, ఐసీఐసీఐ బ్యాంకు కుమ్మక్కై ఆ భూమికి లేని విలువను ఉన్నట్లుగా చూపి రూ.10 వేల కోట్ల రుణం తీసుకున్నారని తెలిపారు. అక్కడ భూమి విలువ ఎకరా రూ.75 కోట్లని జీవో ఇచ్చారని, దానిప్రకారం తొలుత రూ.30 వేల కోట్లని, తర్వాత 20 వేల కోట్లని చెప్పారని.. చివరికి ఆ భూమి విలువను రూ.16 వేల కోట్లకు కుదించి తన వాళ్లకు కట్టబెట్టడానికి రేవంత్ కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. కంచ గచ్చిబౌలిలోని ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని.. సుప్రీం కోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని కేటీఆర్ అన్నారు. అసలు ప్రభుత్వం తీసుకున్న 10వేల కోట్ల రుణంతో ఏం చేసిందని ప్రశ్నించారు. మంత్రివర్గంలో ఉన్న కాంట్రాక్టర్లు, వాళ్ల మనుషులకు కమీషన్లు చెల్లించడానికి వాడారా? అని నిలదీశారు.

ప్రధాని, ఆర్థిక మంత్రికి ఫిర్యాదు చేస్తాం

రేవంత్ సర్కార్ చేసిన ఈ ఆర్థిక మోసాన్ని బీఆర్ఎస్ వదిలిపెట్టదన్న కేటీఆర్.. తమ పార్టీ తరఫున ప్రధానిని, కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఆర్బీఐ గవర్నర్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్, సీబీఐకి ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రధాని వెంటనే స్పందించి విచారణకు ఆదేశించి, తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. ఈ వ్యవహారంలో రేవంత్‌కు అండగా నిలబడ్డ బీజేపీ ఎంపీ పేరును త్వరలో బయట పెడతానని చెప్పారు. కేంద్రంస్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తామన్నారు.

టీజీఐఐసీకి మేం రుణం ఇవ్వలేదు

వాళ్లు మా వద్ద స్థలాలు తనఖా పెట్టలేదు

కంచ గచ్చబౌలి భూముల అంశంలో.. కేటీఆర్ ఆరోపణలను ఖండించిన ఐసీఐసీఐ బ్యాంకు

హైదరాబాద్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల అంశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమపై చేసిన ఆరోపణలను ఐసీఐసీఐ బ్యాంకు ఖండించింది. కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల సంస్థ (టీజీ-ఐఐసీ)కి తమ బ్యాంకు నుంచి ఎలాంటి తనఖా(మార్టిగేజ్) రుణం ఇవ్వలేదని స్పష్టం చేసింది. కేటీఆర్ విలేకరుల సమావేశం ముగిసిన కాసేపటికే ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. బాండ్ల జారీకి టీజీ ఐఐసీ తమ వద్ద ఎలాంటి స్థలాన్ని తనఖా పెట్టలేదని తెలిపింది. బాండ్ల జారీ ద్వారా వచ్చే నిధుల స్వీకరణ, వడ్డీ చెల్లింపులకు సంబంధించి టీజీఐఐసీకి ఖాతా బ్యాంకుగా మాత్రమే ఐసీఐసీఐ వ్యవహరించిందని వెల్లడించింది.

ఆ 5200 కోట్లు..

బిల్లీరావుతో కేటీఆర్ లంచం పద్దు!

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ సంస్థకు భూములు అప్పగించి ఉండేవారని తెలిపారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడారు. కోకాపేటలో ఎకరం భూమి రూ.100 కోట్ల ధర పలికినప్పుడు.. చుట్టూ మైక్రోసాఫ్ట్, ఆక్సెంచర్ వంటి సంస్థల భవనాలు ఉన్న కంచ గచ్చిబౌలి భూముల విలువ రూ.75 కోట్లు ఉండదా? అని ప్రశ్నించారు. ఇది కూడా ప్రభుత్వ సంస్థ అయిన టీజీఐఐసీతో సర్కారు చేసుకున్న ఒప్పందమేనన్నారు. భవిష్యత్తులో ఆ భూములను టీజీఐఐసీ అభివృద్ధి చేసి వేలం వేస్తే.. ఎకరం రూ.200 కోట్ల దాకా పలుకుతుందని అన్నారు. ఈ భూములపై ఐసీఐసీఐ బ్యాంకు నుంచి టీజీఐఐసీ తీసుకున్న రూ.10 వేల కోట్ల రుణం ఎవరి జేబుల్లోకూ పోలేదని, ఆ మొత్తాన్ని రైతు రుణమాఫీకి, సన్న వడ్లకు బోనస్‌కు ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. రైతులు బాగుపడుతున్నారన్న కడుపు నొప్పితో కేటీఆర్ మాట్లాడుతున్నారని మహేశ్‌గౌడ్ మండిపడ్డారు. రుణాల సేకరణకు సంబంధించి ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కన్సల్టెన్సీకి రూ.175 కోట్ల చెల్లింపును కూడా కుంభకోణం అన్నట్లుగా కేటీఆర్ మాట్లాడుతున్నారని తప్పుబట్టారు. ఏ ప్రభుత్వమైనా కన్సల్టెన్సీల ద్వారానే రుణాలకు వెళ్తుందని, గత ప్రభుత్వంలోనూ ఇదే జరిగిందని గుర్తు చేశారు. ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ.. టెండర్ ద్వారానే కన్సల్టెన్సీని దక్కించుకుందని, ఆ సంస్థకు ప్రభుత్వం నుంచి వెళ్లిన మొత్తం పూర్తిగా వైట్ మనీయేనని స్పష్టం చేశారు. ఇది ఏ రకంగా అవినీతి అవుతుందని ప్రశ్నించారు.

ప్రజాధనాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబం..

దేశ చరిత్రలోనే అతి తక్కువ సమయంలో ఎక్కువ ప్రజాధనాన్ని దోచుకున్న కుటుంబం.. కేసీఆర్ కుటుంబమని మహేశ్‌గౌడ్ ఆరోపించారు. అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం.. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ప్రైవేటు సంస్థ చేతుల్లో నుంచి కంచ గచ్చిబౌలి భూములను కాపాడి.. ప్రభుత్వపరం చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని తెలిపారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను 500 ఎకరాల్లో కడితే 10 లక్షల ఉద్యోగాలు వచ్చాయని, ఈ 400 ఎకరాలను అభివృద్ధి చేసి అందులో కొత్త కంపెనీలు వస్తే 5లక్షల ఉద్యోగాలు ఎందుకు రావని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం, లక్షల ఎకరాల మేరకు జరిగిన డీ ఫారెస్టేషన్, హైదరాబాద్ పరిధిలో భూముల అమ్మకం, భూ దోపిడీపై చర్చకు కేటీఆర్ సిద్ధమా! అంటూ సవాల్ విసిరారు. గ్రేటర్ పరిధిలో 10 వేల ఎకరాలకుపైగా భూములను అమ్మిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అవకతవకలపై సీఎం రేవంత్‌రెడ్డి విచారణ జరిపించాలని కోరారు. ఇక తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బీసీ బిల్లులపై ఆమోద ముద్ర వేయాల్సిందిగా ప్రధాని మోదీని బీజేపీ ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, లక్ష్మణ్ ఎందుకు అడగడంలేదని మహేశ్‌గౌడ్ ప్రశ్నించారు. బీసీ అంశం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే హెచ్‌సీయూ అంశాన్ని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తెరపైకి తెచ్చాయని ఆరోపించారు. హైదరాబాద్ అభివృద్ధి కాకూడదనే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మూసీ సహా పలు ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని అన్నారు.

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు పూర్తిగా ప్రభుత్వ భూమేనని సుప్రీం కోర్టు ఎంపవర్ కమిటీకి కాంగ్రెస్ ఎంపీలు రఘురాంరెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ, అటవీ శాఖ రికార్డుల ప్రకారం ఈ భూమిని అటవీ భూమి అని వర్గీకరించలేదని పేర్కొన్నారు. ఈ భూములను అభివృద్ధి చేస్తే రూ.50 వేల కోట్ల మేరకు పెట్టుబడులు, 5లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ మేరకు ఎంపీలు శుక్రవారం కమిటీ సభ్యులను కలిసి లేఖ సమర్పించారు.

ఆ 400 ఎకరాలు పూర్తిగా ప్రభుత్వ భూమే

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.